జిల్లాలో కురిసిన వర్షాలతో ఎక్కడ చూసినా జల సవ్వడి వినిపిస్తోంది. పలు మీడియం, మైనర్ ఇరిగేషన్ చెరువుల్లోకి భారీగా నీరు చేరుతోంది. మరోవైపు గుండ్లకమ్మ, ముసి, పాలేరు నదులతోపాటు జిల్లా అంతటా ఉన్న వాగులు, వంకలలో భారీగానే నీటి ప్రవాహం కనిపిస్తోంది. అదే సమయంలో వర్షం తెరిపి ఇవ్వడంతో పలు ప్రాంతాల్లో పంట నష్టాలు వెలుగుచూస్తున్నాయి. పశ్చిమప్రాంతంలో శుక్రవారం కూడా ఒక మోస్తరు వర్షం కురవడంతో కొన్నిచోట్ల వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి.


నిండుకుండలా ఉన్న మార్కాపురం చెరువు

అంతా జలమే..

- వర్షాలతో వనరుల్లోకి భారీగా చేరుతున్న నీరు
- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
- పశ్చిమాన మళ్లీ వాన
- ఉధృతంగా గుండ్లకమ్మ
- అక్కడక్కడా పంట నష్టాలు

2,749 హెక్టార్లలో దెబ్బతిన్న పంటలు

జిల్లాలో పంట నష్టాలు ఇప్పుడిప్పుడే వెలుగుచూస్తున్నాయి. 17 మండలాల్లోని 89 గ్రామాల్లో సుమారు 3,749 హెక్టార్లలో పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. అందులో సజ్జ 1,747, మినుము 844, జొన్న 3, అలసంద 1,050, పత్తి 25, వరి 80 హెక్టార్లు ఉంది. సుమారు 3,231 మంది రైతులకు చెందిన వివిధ రకాల పంటలు దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా గుర్తించి ఆమేరకు నివేదికను పంపారు. ప్రస్తుతం జిల్లాలో వర్షాలు తగ్గి ఎండలు వస్తుండటంతో పంట నష్టాలు ఇంకా పెరిగే అవకాశం కనిపిస్తోంది.


తర్లుపాడు మండలం సీతానాగులవరం వద్ద చెరువును తలపిస్తున్న పంట పొలాలు

ఒంగోలు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎటుచూసినా జలం కనిపిస్తోంది. తాజా వర్షాలతో వనరుల్లోకి భారీగా నీరు చేరుతోంది. జిల్లాలో ఈనెల 10వ తేదీ రాత్రి నుంచి తెరపిలేకుండా వర్షాలు కురిశాయి. ప్రత్యేకించి బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో 13వతేదీ రాత్రి నుంచి 17వ తేదీ ఉదయం వరకు భారీ వర్షాలు పడ్డాయి. అలా ఈనెల 11 నుంచి 17 వరకూ వారంరోజుల పాటు నగటున 15.32 సెం.మీ వర్షపాతం నమోదైంది. కొన్ని మండలాల్లో 20నుంచి 34 సెం.మీ వరకూ కురిసింది. తిరిగి గురు, శుక్రవారాల్లోనూ జల్లులు పడ్డాయి. ప్రత్యేకించి చివరి రెండు రోజులు పశ్చిమప్రాంతంలో అధికంగా వర్షం కురిసింది.

కంభం చెరువుకు నీరు

వారం రోజులు తెరపిలేకుండా వర్షం కురవడంతో జిల్లాలోని దాదాపు 40కిపైగా ఉన్న చిన్న పెద్ద వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. చిన్నపాటి వనరులైన గుండ్లకమ్మ, పాలేరు, ముసిలతోపాటు మీడియం, మైనర్ ఇరిగేషన్ చెరువులకు భారీగా నీరు చేరుతోంది. గుండ్లకమ్మ ప్రాజెక్టులో ప్రస్తుతం 20.06 మీటర్ల మేర నీటి నిల్వ ఉంది. గేట్లు దెబ్బతిన్న అనంతరం ఎక్కువ నీరు నిల్వ చేసేందుకు అధికారులు ధైర్యం చేయడం లేదు. కాగా వర్షాలతో ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 6,800 క్యూసెక్కులు వస్తుండగా ప్రాజెక్టు భద్రత దృష్ట్యా మూడు గేట్లు ఎత్తి 8వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. కంభం చెరువు నీటి మట్టం తొమ్మిది అడుగులకు చేరగా ఒక తడికి నీరివ్వాలని అక్కడి రైతులు కోరుతున్నారు. మోపాడు రిజర్వాయర్‌లోకి 7 అడుగుల మేర నీరు చేరింది. చాలాకాలం తర్వాత మార్కాపురం చెరువులోకి భారీగా నీరు రాగా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వందలాది

మిగతా 6వ పేజీలో


మార్కాపురం వద్ద గుండ్లకమ్మ ఉధృతి


మార్కాపురం నుంచి తర్లుపాడు వెళ్లే రోడ్డులో ఉధృతంగా ప్రవహిస్తున్న కొండవాగు


గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్ల నుంచి దిగువకు వెళ్తున్న నీరు


నిండుగా పారుతున్న చెరువు సప్లై చానల్

ఎన్నాళ్లకెన్నాళ్లకు..

- జలకళను సంతరించుకున్న మార్కాపురం చెరువు
- ఆక్రమణలపై దృష్టిపెడితే మరింత నీరు చేరే అవకాశం

మార్కాపురం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో వాయు గుండం ప్రభావంతో కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో మార్కాపురం చెరువు జలకళను సంతరించుకుంది. ముఖ్యంగా శుక్రవారం వేకువజాము నుంచి కురిసిన భారీ వర్షంతో వాగులు పొంగిపొర్లాయి. మార్కాపురం చెరువుకు ప్రధాన వనరులైన సప్లై చానల్, మొండివాగు, ఎర్రవాగులు కూడా గతంలో ఎన్నడూలేనంత పొంగాయి. ఈ ప్రభావంతో నీరు చెరువుకు చేరుతోంది. గత నాలుగు రోజుల నుంచి పడిన దానికంటే శుక్రవారం ఉదయం కురిసిన వర్షం చెరువులో నీటిమట్టం పెరగడానికి ప్రధాన కారణమైంది. 2020లో చెరువు పూర్తిస్థాయిలో నిండింది. అప్పటి నుంచి ఇప్పటి వరకూ కనీస నీటిమట్టమే ఉంటోంది. తాజా వర్షాలతో చెరువు నిండుకుండలా మారడంతో పట్టణ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం 65శాతం మేర చెరువు నిండినట్లు నీటిపారుదలశాఖ అధికారులు చెబుతున్నారు. మరో ఏడాదిపాటు నీటికి ఇబ్బందులు తప్పినట్లేనని పట్టణ ప్రజలు భావిస్తున్నారు.

ఆక్రమణలను తొలగిస్తేనే భవిష్యత్తు

మార్కాపురం చెరువుకు ప్రధాన నీటివనరులైన మొండివాగు, ఎర్రవాగులపై పలుచోట్ల ఆక్రమణలు ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో రియల్ వ్యాపారులు వాగులను పూడ్చి వెంచర్లు వేశారు. అంతేకాక వాగుల్లో దట్టంగా పెరిగిన చిల్లకంపతో కూడా నీరు చెరువుకు చేరేందుకు ఆటంకం ఏర్పడుతోంది. రెవెన్యూ, నీటిపారుదల శాఖలకు చెందిన అధికారులు ఇప్పటికే చెరువుపై సర్వే చేశారు. ఎక్కడైతే ఆక్రమణలు చోటుచేసు కున్నాయో వాటిని తొలగించేందుకు సత్వరం చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఎమ్మెల్యే సోదరుడు హల్‌చల్

- కాలనీ దారిలో వైన్‌షాప్
- మహిళల నిరసన
- ఇదంతా వైసీపీ శ్రేణుల కుట్ర అన్న రామిరెడ్డి

వివరాలు 6వ పేజీలో

ఉద్యోగం ఇక్కడ.. ఉండేది విదేశాల్లో..

- 11 మంది ప్లానింగ్ సెక్రటరీలపై చర్యలు
- డీటీసీపీకి సరెండ్ చేసిన కమిషనర్

ఒంగోలు, కార్పొరేషన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయల్లో టౌన్‌ప్లానింగ్ సెక్రట రీలుగా ఉద్యోగాలు పొందిన పలువురు రెండేళ్లపాటు విధుల్లో కొనసాగారు. ఆతర్వాత పర్మినెంట్ చేస్తూ గత ప్రభుత్వం ఉత్వర్వులు జారీచేయడంతో ఇక ఉద్యోగాలకు ఢోకా ఉండదని భావించిన వారు తెలి విగా వ్యవహరించారు. దీర్ఘకాలిక సెలవులు పెట్టుకుని సాఫ్ట్‌వేర్ కంపెనీలలో పనిచేస్తున్నట్లు తెలిసింది. ఇదిలా ఉంచితే కొందరు హైదరాబాద్, చెన్నై, బెంగళూరులో ఉద్యోగాలు చేస్తుండగా.. మరికొందరు నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగులుగా, ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లినట్లు తెలిసింది. వాస్తవానికి ఇతర దేశాలకు వెళ్లాలంటే ప్రభుత్వ అనుమతి తీసుకోవాల్సి ఉంది. అంతేకాకుండా ఎన్ని రోజులు సెలవు పెడుతున్నారు. ఏ కారణాలతో విదేశాలకు వెళుతున్నారు అన్న వివరాలను విన్నవించుకోవాలి. ఆతర్వాత ప్రభుత్వ అనుమతితో వారు జీతం నష్టపోవడానికి ఇష్టపడి వెళ్లాల్సి ఉంది. అయితే ఒంగోలు కార్పొరేషన్‌లో అందుకు విరుద్ధంగా వ్యవహారం నడిచింది. గతంలో ఇక్కడ పనిచేసి బదిలీపై వెళ్లిన కమిషనర్ తన సొంత

మిగతా 6వ పేజీలో



ఎక్సైజ్ శాఖలో దొంగలు

- ఎలైట్ మాల్ గోల్‌మాల్‌లో ఎవరి వాటా ఎంతో?
- విచారణ చేపట్టిన ఆర్డీవో
- అజ్ఞాతంలోనే హెడ్‌కానిస్టేబుల్

ఒంగోలుక్రైం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ శాఖలో దొంగలు పడ్డారు. సుమారు రూ.2.34 కోట్ల మద్యం అమ్మకాల నిధులు గోల్‌మాల్ అయినట్లు ఆశాఖ ఉన్నతాధికారులు లెక్క తేల్చారు. ఒంగోలులో ఉన్న రెండు ఎలైట్ మాల్స్‌లో ఈ మొత్తం అవినీతి జరిగిందని నిర్ధారణకు వచ్చారు. ఇందులో ఎవరి పాపం ఎంత అని తేల్చే పనిలో రెండురోజులుగా మల్లగుల్లాలు

మిగతా 6వ పేజీలో

ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి

- వర్షాలతో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా వైద్యారోగ్యశాఖ చర్యలు
- 21 నుంచి ఇంటింటి ఫీవర్ సర్వే
- ఆస్పత్రుల్లో అందుబాటులో మందులు
- పీహెచ్‌సీల్లోనే డెంగ్యూ, మలేరియా రక్త పరీక్షలు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో విస్తారంగా కురిసిన వర్షాలతో ప్రజలు వ్యాధుల బారిన పడకుండా వైద్యారోగ్యశాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ప్రభుత్వ ఆదేశాలతో జిల్లావ్యాప్తంగా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, జిల్లాస్థాయి హాస్పటల్స్‌లో ప్రజలకు అన్ని రకాల టెస్టులు (రక్త పరీక్షలు) చేసే విధంగా అధికారులు ఏర్పాట్లు చేశారు. గత

మిగతా 6వ పేజీలో





రోలర్‌తో సైలెన్సర్ల ధ్వంసాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్

ఫటాఫట్... సైలెన్స్!

రణగొణి ధ్వనులు చేసే సైలెన్సర్లపై పోలీసు శాఖ కన్నెర్ర చేసింది. శుక్రవారం స్థానిక అద్దంకి బస్టాండ్ సెంటర్‌లో 515 సైలెన్సర్లను రోడ్డు రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేయించారు. స్వయంగా ఎస్పీ ఏఆర్ దామోదర్ హాజరై కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఒంగోలు నగరంలో మాడిఫైడ్ సైలెన్సర్లు ఏర్పాటు చేసుకొని వాహనాలు నడుపుతూ జనాన్ని భయభ్రాంతులకు గురిచేస్తున్న బైక ర్లపై ఇటీవల పోలీసులు దృష్టి పెట్టారు. రోజూ ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. మొత్తం 515 సైలెన్సర్లు తొలిగించి కంపెనీవి ఏర్పాటు చేయించారు. ఈమేరకు తొలగించిన వాటిని అద్దంకి బస్టాండ్‌లో ధ్వంసం చేశారు. ఈ సంద ర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రణగొణ ధ్వనులతో చక్కర్లు కొట్టే బైకర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఎస్బీ సీఐ రాఘవేంద్రరావు, ట్రాఫిక్ సీఐ పాండురంగారావు, తాలుకా సీఐ అజయ్‌కుమార్, ఒంగోలు వన్‌టౌన్ సీఐ నాగరాజు పాల్గొన్నారు.

-ఒంగోలుక్రైం



సమావేశానికి హాజరైన మంత్రులు, టీడీపీ ఎమ్మెల్యేలు (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న అధినేత చంద్రబాబు

ప్రవర్తనే గీటురాయి

- ప్రజలు దానిని గమనిస్తారు
- మద్యం, ఇసుక జోలికి వెళ్లకండి
- టీడీపీ ఎమ్మెల్యేలకు అధినేత చంద్రబాబు ఉద్బోధ

ఒంగోలు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): 'మన ప్రవర్తనే భవిష్యత్‌లో విజయానికి గీటురాయి. ప్రజలు అన్నింటినీ గమనిస్తారు. ఆ విషయాన్ని పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు గుర్తించి మసలుకోవాలి. ఫీల్ గుడ్ ఫ్యాక్టర్ అనేది లేకపోతే మనల్ని ప్రజలు విశ్వసించరు. అందుకు గత వైసీపీ పాలన తీరే నిదర్శనం' అని టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు

మిగతా 6వ పేజీలో

మెరుగైన వైద్యసేవలు అందించాలి

వైద్యాధికారులకు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు వైద్యాధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక మాతా శిశు వైద్యశాలను ఆమె శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. ఆస్పత్రి లోని ఓపీ రిజిస్ట్రేషన్ విధానంతోపాటు రిజిస్టర్లను కూడా చూశారు. జనరల్ ఓపీ వార్డును, ఎన్టీఆర్ వైద్యసేవల కౌంటర్, ఆపరేషన్ థియేటర్, కాన్పుల వార్డుతోపాటు పలు విభాగాలను పరిశీలించారు. అక్కడ రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రికి


ఒంగోలులోని మాతా శిశువైద్యశాలలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

మిగతా 6వ పేజీలో

ఎక్సైజ్ శాఖలో దొంగలు

(5పేజీ తరువాయి)

పడుతున్నారు. హెడ్ కానిస్టేబుల్ రమణ ప్రధాన సూత్రధారి అని అక్కడ పనిచేసే సిబ్బంది చెబుతున్నారు. అయితే అతను అజ్ఞాతంలో ఉన్నాడు. దీంతో ఎవరు ఎంత స్వాహా చేశారు? అనే కోణంలో విచారణ చేపట్టారు. ఇప్పటికే ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న రెవెన్యూపరంగా విచారణ చేస్తున్నారు. అదేవిధంగా శాఖాపరంగా ఒంగోలు ఏఈఎస్ ఈ.వెంకట్‌ను విచారణాధికారిగా నియమించారు. దీంతో శుక్రవారం ఒంగోలు ఎక్సైజ్ స్టేషన్ వద్ద ఎలైట్ మాల్స్‌లో పనిచేస్తున్న ఏడుగురు సిబ్బందిని విచారించారు. ఈక్రమంలో తమకు ఎలాంటి సంబంధం లేదని, మొత్తం రమణ చేశాడని వారు తెలిపినట్లు సమాచారం. వారి ఫోన్ల నుంచి నగదును రమణకు బదిలీ చేయించుకున్న ఆధారాలు చూపించినట్లు తెలిసింది. ఈ అవినీతి ఏడాదిన్నరగా కొనసాగుతున్నట్లు వారు చెబుతున్నారు. ఇంత పెద్దమొత్తంలో గోల్‌మాల్ జరుగుతుంటే ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు ఎందుకు చూస్తూ ఊరుకున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రూ.60లక్షలు మాత్రమే వాడుకున్నా..

ఈ మొత్తం వ్యవహారంలో కీలకంగా ఉన్న హెడ్‌కానిస్టేబుల్ రమణ అజ్ఞాతంలోకి వెళ్లిన విషయం తెలిసిందే. అతను శుక్రవారం ఓ అధికారికి ఫోన్ చేసి తాను రూ. 60లక్షలు మాత్రమే వాడుకున్నానని, కాస్త సమయం ఇస్తే ఆ మొత్తం చెల్లిస్తానని చెప్పినట్లు ప్రచారం జరుగుతోంది. కాగా ఇలాంటి మోసం విషయంలో ఇంతవరకు ఎక్సైజ్ అధికారులు ఫిర్యాదు చేయకపోవడం గమనార్హం. శాఖలో పనిచేసిన అధికారులు కొంతమంది ఈ ఊబిలో ఇరుక్కుపోయే అవకాశం ఉండటంతో నాన్చుడు ధోరణిలో ముందుకు వెళుతున్నట్లు ఉంది. అయితే మాల్స్‌లో పనిచేసే సిబ్బంది బంధువులు మాత్రం తమ వారిని ఎందుకు రెండు రోజులుగా అదుపులో ఉంచుకున్నారని ప్రశ్నిస్తున్నారు. ఇంకా రమణ పర్యవేక్షించిన మద్యం దుకాణాలలో లెక్కతేల్చాల్సినవి ఏడు ఉన్నాయి. వాటిలో కూడా అవకతవకలు జరిగాయెమో అన్న ఆందోళనలో అధికారుల తలలు పట్టుకుంటున్నారు. అయితే ఇంత జరిగినా ఎక్సైజ్ అధికారులు పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు ఇవ్వలేదు. స్వాహా చేసిన సొత్తు ఎవరెవరికి చేరిందో తేలిన తరువాత ఫిర్యాదు చేస్తామని వారు పేర్కొంటున్నారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి

(5వ పేజీ తరువాయి)

వారంరోజుల నుంచి విస్తారంగా కురుస్తున్న వర్షాలతో దోమల బెడద పెరగడంతోపాటు తాగునీరు కలుషితమయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు వైద్యాధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఇప్పటికే ఒక విడత జిల్లాలో ఫీవర్ సర్వే నిర్వహించారు. ఈనెల 21 నుంచి మరో విడత ఇంటింటి సర్వే చేపట్టనున్నారు.

అన్ని ఆస్పత్రులలో రక్తపరీక్షలు

ప్రధానంగా మలేరియా, డెంగ్యూ బారిన పడకుండా ఉండేందుకు పీహెచ్‌సీల పరిధిలోనే రక్తపరీక్షలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అందుకు అవసరమైన మెటీరియల్‌ను కూడా అందుబాటులో ఉంచారు. ప్రజానీకం జ్వరం వచ్చిన వెంటనే సమీపంలోని పీహెచ్‌సిల్లో చూపించుకొనే విధంగా గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఫీవర్ సర్వే ద్వారా జ్వరం బారిన పడిన బాధితులను గుర్తించి వారికి సత్వరమే వైద్యచికిత్స అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. మలేరియా వ్యాధికి అవసరమైన మందులను కూడా వైద్యశాలల్లో అందుబాటులో ఉంచారు. రక్త పరీక్షల్లో డెంగ్యూ ఉన్నట్లు గుర్తిస్తే అటువంటి వారికి మెరుగైన వైద్యచికిత్స అందించేందుకు జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. డెంగ్యూ బారిన పడినవారికి ప్లేట్‌లెట్స్ పడిపోకుండా సత్వర వైద్యసేవలు అందించేందుకు ఏర్పాట్లు చేశారు

సమన్వయంతో ముందుకు

మరోవైపు ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా క్షేత్రస్థాయి సిబ్బందికి దిశానిర్దేశం చేస్తున్నారు. గ్రామాల్లో వర్షపు నీరు నిల్వ ఉంటే దోమల ఉత్పత్తి పెరగకుండా అవసరమైన చర్యలను సంబంధిత శాఖల సమన్వయంతో చేపట్టాలని నిర్ణయించుకున్నారు. వర్షాలకు నీరు కలుషితం కాకుండా టెస్టులు చేసి అవసరమైతే క్లోరినేషన్ చేసి ప్రజలు వ్యాధుల బారిన పడకుండా చర్యలు చేపట్టారు. ఇప్పటికే సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని ముందుకు సాగాలని క్షేత్ర స్థాయి వైద్యశాఖ అధికారులకు అవగాహన కల్పించారు. నీరు నిల్వ ప్రాంతాల్లో లార్వాలతో పాటు బ్లీచింగ్, ఫాంగింగ్ చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

వైద్యశాలల్లోనే అన్నిరకాల వైద్య పరీక్షలు

జిల్లాలో వ్యాధుల బారిన పడిన ప్రజలకు సత్వరమే పీహెచ్‌సీల్లో వైద్యపరీక్షలు చేసే విధంగా చర్యలు తీసుకున్నాం. వర్షాలు తగ్గినందున ఈనెల 21 నుంచి మరోసారి ఇంటింటి ఫీవర్ సర్వే నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ సర్వేలో జ్వరం బారిన పడిన వారు ఉంటే గుర్తించి సత్వరమే వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రజలు ఎవరైనా అనారోగ్యానికి గురైతే వెంటనే ప్రభుత్వ వైద్యశాలలో రక్తపరీక్షలు చేయించుకొని అవసరమైన చికిత్సలను పొందాలి.

- డాక్టర్ సురేష్‌కుమార్, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో

మెరుగైన వైద్య సేవలు అందించాలి

(5వ పేజీ తరువాయి)

వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలతోపాటు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని వైద్యులకు సూచించారు. కలెక్టర్ వెంట ఆస్పత్రి సూపరిటెండెంట్ డాక్టర్ సంధ్య ఉన్నారు.

యూనివర్సిటీని సందర్శించిన కలెక్టర్

స్థానిక ఆంధ్రకేసరి యూనివర్సిటీని కలెక్టర్ తమీమ్ అన్సారియా శుక్రవారం సందర్శించారు. వీసీ డీవీఆర్ మూర్తి, రిజిస్ట్రార్ బి.హరిబాబు, కళాశాల ప్రిన్సిపాల్ జి. రాజమోహన్‌రావులు కలెక్టర్‌కు ఘనస్వాగతం పలికారు. వివిధ సెక్షన్ల అధిపతులు, అధ్యాపకులతో కలెక్టర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వీసీ మూర్తి, రిజిస్ట్రార్ హరిబాబులు పలు అంశాలను కలెక్టర్ దృష్టికి తెచ్చారు. యూనివర్సిటీ నిర్వహణ కోసం ప్రభుత్వం కేటాయించిన పేర్నమిట్ట ప్రాంగణంలో పనులు పూర్తి కాకపోవడంతో ప్రస్తుతానికి పెళ్లూరు కాలనీలోని పాత భవనాలను వినియోగించుకుంటూ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైతే ఆ పనులు సకాలంలో పూర్తవుతాయని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా అన్సారియా మాట్లాడుతూ పేర్నమిట్ట ప్రాంగణం వద్ద ప్రైవేటు వ్యక్తుల ఆక్రమణలు తొలగించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు నిర్మలామణి, సోమశేఖర్, కేవీఎన్ రాజు, డాక్టర్ బి.పద్మజ, మండే హర్షప్రీతమ్ దేవ్‌కుమార్, ఐ.దేవీవరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నాడు కళకళ.. నేడు వెలవెల!

గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో మూలనపడ్డ ఎత్తిపోతల పథకాలు

ఒకప్పుడు 900 ఎకరాల బీడు భూములవి. చుక్క నీరులేక పచ్చికతో నిండి ఉండేవి. వాటిని సాగు చేసుకునేదారిలేక రైతులు అవస్థలు పడేవారు. గతంలో టీడీపీ అధికారంలోకి వచ్చాక నిధులు కేటాయించి.. మూడు ఎత్తిపోతల పథకాలు నిర్మించి.. నీటి సౌకర్యం కల్పించి పచ్చని పంట భూములుగా మార్చి.. రైతుల మోములో చిరునవ్వులు చిగురింపజేసింది. ఆ ఆనందం రైతులకు ఎక్కువ కాలం నిలువలేదు. గత వైసీపీ ప్రభుత్వం ఎత్తిపోతల పథకాలను గాలికొదిలేసింది. మరమ్మతులను మూలకు నెట్టేసింది. పచ్చని పంట భూములను మళ్లీ బీళ్లుగా మార్చేసింది. కూటమి ప్రభుత్వమైనా కరుణించి పథకాలను పునరుద్ధరించాలని వేడుకుంటున్న ముండ్లమూరు మండలం తాళ్లూరు రైతుల దీన గాథపై కథనం...

- గత టీడీపీ హయాంలో రూ.70 కోట్లతో నిర్మాణం
- వైసీపీ హయాంలో పథకాల నిర్వహణ శూన్యం
- ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ.. అయినా పట్టించుకోని వైనం
- మళ్లీ బీడు భూములుగా 900 ఎకరాలు
- కూటమి ప్రభుత్వంపైనే రైతుల ఆశలు

ముండ్లమూరు (అక్టోబరు 18), ఆంధ్రజ్యోతి : మండలంలోని మారెళ్ల పంచాయతీలో బీడు భూములను సాగు భూములుగా మార్చేందుకు 2014లో తెలుగుదేశం ప్రభుత్వం ఐడీసీ ద్వారా రూ.70 కోట్లతో గుండ్లకమ్మ నదిపై ఎత్తిపోతల పథకాలు నిర్మించింది.

మూడు ఎత్తిపోతల పథకాల తీరిదీ..

- మారెళ్ల-4 ఎత్తిపోతల పథకానికి రూ.48 కోట్ల నిధులు మంజూరు చేసి 4,800 ఎకరాల బీడు భూములను సాగు భూములుగా మార్చింది. దాని ఫలితంగా 2014 నుంచి 2019 వరకు 4వ ఎత్తిపోతల పథకం కింద భూముల్లో పంటలు సాగయ్యాయి. ఐదేళ్లపాటు రైతులకు సిరులు కురిపించాయి.
- అదే పంచాయతీ పరిధిలో రూ.22 కోట్లతో ప్రభుత్వం గంగన్నపాలెం ఎత్తిపోతల పథకాన్ని నిర్మించింది. 2200 ఎకరాల బీడు భూములను సాగులోకి తెచ్చింది.



నిరుపయోగంగా తమ్మలేరు ఎత్తిపోతల పథకం

- మారెళ్ల-3 ఎత్తిపోతల పథకాన్ని రూ.5 కోట్లతో 900 ఎకరాలు బీడు భూములను సాగులోకి తెచ్చేందుకు అప్పటి మార్టూరు ఎమ్మెల్యే ప్రస్తుత విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ నిధులు మంజూరు చేయించి ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు.

● వైసీపీ పాలనలో అటకెక్కిన 'పథకాలు'

2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక ఎత్తిపోతల పథకాల నిర్వహణను గాలికి వదిలేసింది. ఒక వైపు ఎత్తిపోతల పథకాల పైపులైన్‌లు లీకు అయినా, పగిలిపోయినా పట్టించుకోలేదు. నీరు వృథాగా పోతున్నా చలించలేదు. కనీస మరమ్మతులు చేపట్టలేదు. దీంతో సాగు భూములు మళ్లీ బీడు భూములుగా మారాయి. వైసీపీలో ఉన్న ప్రజాప్రతినిదులు గానీ, అప్పటి ఐడీసీ అధికారులు గానీ పట్టించుకోలేదు.

- ఏడాదిగా మూడు ఎత్తిపోతల పథకాలకు చెందిన రూ.60 లక్షలు విలువ చేసే ట్రాన్స్‌ఫారాలు చోరీకి గురయ్యాయి. స్కీమ్ నిర్వాహకులు పోలీసులకు ఇటీవల ఫిర్యాదు చేసినా ఎటువంటి చలనం లేదు.
- మారెళ్ల - 4 ఎత్తి పోతల పథకానికి ఉపయోగించిన పైపులైన్‌లు పలుచోట్ల పగిలి పోయాయి. అయినా గత ప్రభుత్వం పట్టించుకోలేదు.

బీడు భూముల పాపం ఐడీసీ, ట్రాన్స్‌కో అధికారులే

మా ఊళ్లో చిలకలేరు వాగుపై అప్పటి మార్టూరు ఎమ్మెల్యే, ప్రస్తుత రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక చొరవతో ఎత్తిపోతల పథకాన్ని మంజూరు చేయించారు. రెండు వందల ఎకరాలు సస్యశ్యామంగా రెండు పంటలు పండుతున్నాయి. దాదాపు దశాబ్దన్నర కాలంగానే సమృద్ధిగా పంటలు పండించుకున్నాం. రెండేళ్ల క్రితం ట్రాన్స్‌ఫారాలను గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. అప్పటి నుంచి ట్రాన్స్‌ఫారాలు ఏర్పాటు చేయలేదు. మా కళ్ల ముందే పంట భూమలన్నీ బీళ్లుగా మారిపోయాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి బాగుచేయాలి.

- యారాసి రమణయ్య, రైతు, తమ్మలూరు

అమ్మో.. ఆ రోడ్డా...





పర్చూరు నుంచి ఇంకొల్లు వెళ్లే(పాత మద్రాస్ రోడ్డు)లో ప్రయాణమంటే ప్రమాదాలను కొని తెచ్చుకున్నట్లే.! ఎక్కడ చూసినా గుంతలే గుంతలు. ప్రస్తుతం వర్షపు నీటితో కాలువలను తలపించే విధంగా రోడ్డు తయారైంది. గత పాలకులు ఏమాత్రం పట్టించుకోకపోవడంతో ప్రస్తుత వర్షాలకు రోడ్డు మరింత అధ్వానంగా మారింది. పర్చూరు నుంచి ఇంకొల్లు మధ్య వంకాయలపాడు, దగ్గుబాడు గ్రామాల వద్ద పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగించే ప్రధాన రోడ్డు కనీసం మరమ్మతులకు కూడా నోచుకోకపోవటంపై వాహనదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. -పర్చూరు



మాట్లాడుతున్న రామకృష్ణ

పంట బీమా ప్రయోజనాలు రైతులందరికీ అందాలి

మార్టూరు, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి) : రైతులందరికీ పంటల బీమా ప్రయోజనాలు అందించేందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానంపై వ్యవసాయ అధికారులు, రైతు సేవ కేంద్రం సిబ్బంది అవగాహన పెంచుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి వై రామకృష్ణ చెప్పారు. శుక్రవారం మార్టూరులో వ్యవసాయ మార్కెట్ యార్డులో పంటల బీమా, పంట కోత ప్రయోగాలు, రబీ పంటల యాజమాన్యంతోపాటు సాంకేతిక పరిజ్ఞానంపై పర్చూరు, మార్టూరు, అద్దంకి సబ్ డివిజన్‌పరిధిలోని వ్యవసాయ అధికారులకు, రైతు సేవ సిబ్బందికి అవగాహన కల్పించారు. జిల్లా వనరుల కేంద్రం బాపట్ల సహాయ వ్యవసాయ సంచాలకులు రత్నకుమారి, ఏరువాక కేంద్రం బాపట్ల కోఆర్డినేటరు డాక్టరు బాలమురళీధర్ నాయక్, శాస్త్రవేత్త డాక్టరు కామాక్షి, సహాయ వ్యవసాయ సంచాలకులు కేవీ శ్రీనివాసరావు, ఎన్ మోహనరావు పాల్గొన్నారు.

సెంటర్ లైటింగ్.. నిర్వహణ చీటింగ్

అద్దంకి పట్టణ పరిధిలో ఉన్న నామ్ రోడ్డులో సెంటర్ లైటింగ్ నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. నల్లవాగు వద్ద నుంచి శింగరకొండ 99 అడుగుల విగ్రహం వరకు సెంటర్ లైటింగ్ వ్యవస్థ ఉంది. దీని నిర్వహణ కొంతభాగం నామ్ రోడ్డు నిర్వహణ సంస్థ, మరి కొంత భాగం అద్దంకి మున్సిపాలిటీ చూసుకుంటుంది. లైట్ల మరమ్మతుల విషయంలో ఎవరి దారి వారిదే. దీంతో ఆ రోడ్డు తరచూ చీకటిమయంగా మారుతుంది. పట్టణ పరిధిలో వాహనచోదకులు ఇబ్బంది పడటంతో పాటు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

- అద్దంకి



రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయురాలు మృతి

అద్దంకి, అక్టోబరు18, (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయురాలు మునగాల ధనలక్ష్మి(41) మృతి చెందారు. కొరిశపాడు మండలం పి.గుడిపాడుకు చెందిన కొత్తమాసు నాగేశ్వరరావు పారాచూట్ కొబ్బరినూనె డిస్ట్రిబ్యూటర్‌గా అద్దంకిలోని ఎస్‌బీఐ(మెయిన్) బ్యాంక్ రోడ్డులో నివాసం ఉంటున్నారు. అయన భార్య ధనలక్ష్మి పల్నాడు జిల్లా వినుకొండ రూరల్ మండలం గోగనకొండలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తుంది. శుక్రవారం ఉదయం మరో ఉపాధ్యాయుడితో కలిసి మోటార్‌సైకిల్‌పై పాఠశాలకు వెళ్తుండగా బాపట్ల-పల్నాడు జిల్లాల సరిహద్దులో గొర్రెపాడు, నాగులవరం మధ్య ఎదురుగా బస్సు రావటంతో మోటార్‌సైకిల్ పక్కకు తిప్పటంతో రోడ్డు మార్జిన్‌లో ఉన్న గోతులోకి పోయింది. మోటార్‌సైకిల్ వెనుక కూర్చొన్న ధనలక్ష్మి గతుకుల దెబ్బకు రోడ్డుపై పడి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్సకు తరలించేలోపే మృతి చెందారు. ధనలక్ష్మి మృతదేహాన్ని అద్దంకిలోని స్వగృహానికి తీసుకొచ్చారు. ధనలక్ష్మికి భర్త, ఆరేళ్ల కుమారుడు ఉన్నారు. ఆమె మృతి పట్ల పలువురు ఉపాధ్యాయ సంఘాల నేతలు సంతాపం తెలిపారు.

పురుగు మందు తాగి యువకుడు ఆత్మహత్య

బల్లికురవ. అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి బానిసగా మారి పురుగు మందు తాగి వైదన గ్రామానికి చెందిన శెట్టి నాగరాజు(35) శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు, పోలీసుల కథనం మేరకు... వైదన గ్రామానికి చెందిన శెట్టి నాగరాజు తరచూ మద్యం సేవించి కుటుంబ సభ్యులతో గొడవలు పడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది పురుగు మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే వారి బంధువులు అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు జీజీహెచ్‌కు తరలిచంగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య రామాంజమ్మ ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ బండి శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి ఇరువురు పిల్లలు ఉన్నారు.

గాయపడిన సువార్త గాయకుడు మృతి

చీరాలటౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో వేటపాలెం - చీరాల జాతీయ రహదారిలో గాయపడిన సువార్త గాయకుడు గరికపాటి బాబురావు(30) విజయవాడలో చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి కన్నుమూశారు. చినగంజాంలో ఏసుక్రీస్తు కూటములకు వెళ్లి తిరిగి ఈనెల 15న స్వగ్రామం వెళుతున్న బాబురావు జాతీయ రహదారిలో రోడ్డు పక్కన ద్విచక్ర వాహనం నిలిపి ఫోన్ మాట్లాడుతుండగా కోళ్ల డస్ట్‌తో వెళుతున్న గుర్తుతెలియని ఆటో వేగంగా ఢీకొంది. అప్పటి నుంచి చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచాడు. మృతుడు గుంటూరు దగ్గర గరికపాడు వాసి. ఇతనికి భార్య ఇద్దరు సంతానం ఉన్నారు.

ప్రవర్తనే గీటురాయి

(5వ పేజీ తరువాయి)

ఉద్బోధించారు. మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో రాష్ట్రంలోని టీడీపీకి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలతో శుక్రవారం ముఖ్యమంత్రి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో 125 రోజులు టీడీపీ కూటమి ప్రభుత్వ పనితీరు, వివిధవర్గాల ప్రజల కోసం అమలు చేసిన పథకాలు, కొత్తగా ప్రభుత్వం చేపట్టిన విధానాలను, అలాగే సాధించిన విజయాలను వివరించి వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అదేసమయంలో గత ప్రభుత్వం ఇసుక, మద్యంలో దోపిడీ చేయగా పలు మార్పులతో ప్రజలకు అనువుగా ఉండేట్లు కొత్త పాలసీలు తెచ్చామన్నారు. గత వైసీపీ వాళ్ల వలే మన వాళ్లు ఎవ్వరూ వాటి జోలికి వెళ్లరాదన్నారు.

ఆరోపణలు వచ్చే వాటి జోలికి వెళ్లొద్దు

వారసత్వంగా మద్యం వ్యాపారంలో ఉన్నటువంటి వారు ఓకే కానీ ఇప్పుడు ఆ రంగంలోకి ఎవరు వెళ్లినా మీకే కాక ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని చంద్రబాబు హెచ్చరించారు. దానిని గుర్తించి మనలుకోవాలని సూచించారు. ఫీల్‌గుడ్ ఫ్యాక్టర్‌ను ప్రజల్లో కల్పించకపోతే వారు మనల్ని విశ్వసించరని అందుకు మన ప్రవర్తనే కారణమవుతుందన్నారు. మన ప్రవర్తనే మన భవిష్యత్‌కు గీటురాయని, దీర్ఘకాలం రాజకీయాల్లో ఉండేవారు దానిని గమనించుకోవాలన్నారు. వైసీపీ పాలనలో ఆపార్టీ నేతలు బరితెగించారు కనుకనే నోట్ల కట్టలను వారు పరిచినా ప్రజలు మనవైపు నిలిచారన్న విషయాన్ని గుర్తించాలన్నారు. విమర్శలు, ఆరోపణలు వచ్చే పనుల జోలికి వెళ్లవద్దని హితవు పలికారు. సమావేశానికి జిల్లా నుంచి మంత్రి డాక్టర్ స్వామి, ఎంపీ మాగుంటతో పాటు ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్ విజయకుమార్, ఉగ్రనరసింహారెడ్డి, కందుల నారాయణరెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జీలు గుడూరి ఎరిక్షన్‌బాబు, డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తదితరులు హాజరయ్యారు.

జలకళ

(5వ పేజీ తరువాయి)

చెరువులు నీటితో కనిపిస్తున్నాయి. వాగులు, వంకలలో భారీగా నీటి ప్రవాహంతో గుండ్లకమ్మ, పాలేరు, ముసి, చిలకలేరు వంటి వాటిలో నీటి ప్రవాహం పెరిగింది.

పశ్చిమంలో మోస్తరు వాన

పశ్చిమ ప్రాంతంలో గురువారం రాత్రి నుంచి ఒక మోస్తరు వర్షం పడుతుండగా అక్కడక్కడా వాగులు పొంగాయి. పెద్దారవీడు, మార్కాపురం, తర్లుపాడు మండలాల్లో కురిసిన వర్షాలతో వాగులు పొంగి రాకపోకలకు అంతరాయం కలిగింది. ఇదిలాఉండగా ప్రస్తుతం జిల్లాలో వర్షం తెరిపిచ్చి ఎండ కాస్తుండటంతో పంట నష్టాలు వెలుగుచూస్తున్నాయి. పలుచోట్ల పొగాకు, సజ్జ, పత్తి, మినుము, అలసంద తదితర పంటలు వర్షాలతో దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. అయితే నష్టం తక్కువగా ఉండటంతో రైతులు ఊపిరిపీల్చుకుంటున్నారు.

ఇక్కడ ఉద్యోగం.. ఉండేది విదేశాల్లో..

(5వ పేజీ తరువాయి)

నిర్ణయాలతో ఇష్టారాజ్యంగా సెలవులు మంజూరు చేయడంతో ప్లానింగ్ సెక్రటరీలు పత్తా లేకుండా పోయారు. దీంతో ఒకవైపు ఇక్కడ కార్యాలయ విధులకు ఇబ్బంది తలెత్తుతుండగా, మరోవైపు ఉద్యోగులు లేక, ఉన్నవారు రాక ఖాళీలు చూపించుకునే పరిస్థితి లేదు. గత రెండేళ్లుగా ఇక్కడ ఇదే పరిస్థితి ఉన్నట్లు సమాచారం.

డీటీసీపీకి సరెండర్ చేసిన కమిషనరు

ఒంగోలు నగర కమిషనరుగా ఇటీవల వచ్చిన డాక్టర్ కె.వెంకటేశ్వరరావు కార్యాలయ అడ్మినిస్ట్రేషన్, సచివాలయ ఉద్యోగుల పనితీరుపై దృష్టిసారించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. సుమారు 11మంది ప్లానింగ్ సెక్రటరీలు రెండేళ్లుగా విధులకు డుమ్మా కొట్టి ఇతర ప్రైవేటు ఉద్యోగాలలో కొనసాగుతున్నట్లు గుర్తించారు. దీంతో వారు ప్రస్తుతం ఎక్కడెక్కడ పనిచేస్తున్నారు. ఎన్ని రోజుల నుంచి సెలవులో ఉన్నారు. ఏ నిబంధనల మేరకు వారు ఇతర ఉద్యోగాల్లో కొనసాగుతున్నారో పరిశీలించారు. దీంతో శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం సెలవుపై వెళ్లి ఇతర ఉద్యోగాలలో ఉన్నవారిని రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్‌కు సరెండర్ చేయడంతో ఇప్పటివరకు వేర్వేరు ప్రాంతాల్లో ఉన్నవారు ఒక్కొక్కరుగా పరుగులు పెడుతున్నారు. ఉన్న ఉద్యోగం పోతుందని భావించిన వారు తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ డీటీసీపీ అధికారులను ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నట్లు సమాచారం. ఇదిలాఉండగా, ఒంగోలు సచివాలయాల్లో ఉండకుండా ఫీల్డు పేరుతో కార్యాలయానికి డుమ్మాకొడుతున్న వారిపైనా కమిషనరు ప్రత్యేక దృష్టి సారించారు. తప్పనిసరిగా మూవ్‌మెంట్ రిజిస్టర్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినా, పౌరసేవలపై అలసత్వం వహించినా చర్యలు తప్పవని ఇతర సెక్రటరీలను ఆదేశించారు.

వంద రోజుల్లో వడివడిగా

ప్రభుత్వం చేయాల్సిన పనులు కనిగిరిలో దాతల సహకారంతో వేగంగా పూర్తి

రూ.50 లక్షలతో వైద్యశాలను ఆధునీకీకరించాలంటే ప్రభుత్వానికి సాధారణంగా కొన్ని నెలలు పట్టొచ్చు.. కానీ అక్కడ పనులు చకచకా పూర్తి చేశారు!

సంక్షేమ వసతి గృహంలో కనీస సదుపాయాల్లేక అవస్థలు పడుతున్న బాలికల సమస్యను పరిష్కరించాలంటే కొన్ని రోజులైనా పట్టొచ్చు. కానీ అక్కడ గంటల్లో అన్ని సౌకర్యాలూ అందాయి!

గురుకుల పాఠశాలకు వెళ్లడానికి రహదారి లేక సతమతమవుతున్న విద్యార్థులకు రోడ్డు సౌకర్యం కల్పించాలంటే ప్రభుత్వానికి తక్కువలో తక్కువ రెండు నెలలైనా పట్టొచ్చు. కానీ అక్కడ ఆగమేఘాలపై రోడ్డు నిర్మాణమైంది!

ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోకుండా పెండింగులో ఉన్న రిజర్వాయర్ పనులు చేయించాలంటే ఫైళ్ల దుమ్ము దులపడానికే నెలలు పడతాయి. కానీ అక్కడ రోజుల వ్యవధిలోనే చకచకా పనులవుతున్నాయి!

ఇలా ఇవన్నీ జరగడాన్ని సినిమాల్లో చూసి ఉంటాం. నిజ జీవితంలో పైవన్నీ ప్రభుత్వం చేయించాలంటే చాలా కాలం పడుతుంది. వాటన్నింటినీ గుర్తించాలి. ఫైళ్లు పెట్టాలి. ఆమోదాలు పొందాలి. నిధులు మంజూరవ్వాలి. నిర్మాణాలు జరగాలి. ఆర్థిక సమస్యల్లో ఉన్న ప్రభుత్వానికి ఇవేవీ ఇప్పట్లో సాధ్యం కావు. అయినా ఆ సమస్యలు పరిష్కారం అయ్యాయి. కొన్ని పనులు కూడా పూర్తి అయ్యాయి. అదెక్కడో కాదు. కనిగిరి నియోజకవర్గంలోనే. స్థానిక ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి సొంత ఖర్చుతోనూ, దాతలను ఆహ్వానించి వారి సహకారంతోనూ వందరోజుల వ్యవధిలోనే అనేక ఫలితాలు సాధించి ప్రజల మన్ననలు పొందుతున్నారు. - ఆంధ్రజ్యోతి, ఒంగోలు

- కునారిల్లుతున్న ప్రభుత్వాస్పత్రికి కొద్దిరోజుల్లోనే వైభవం
- సంక్షేమ వసతి గృహానికి గంటల్లో సౌకర్యాల తొడుగు
- గురుకుల పాఠశాల దారికి ఆగమేఘాలపై పనులు
- పెండింగులో రిజర్వాయర్ వర్కులు వేగంగా పూర్తి

రోల్' మోడల్' అయ్యింది!

ఒకరోజు ఎమెల్యే ఉగ్ర కనిగిరి మోడల్ స్కూల్‌కు వెళ్లారు. ప్రధాన రహదారి నుంచి ఆ స్కూల్‌కు వెళ్లేదారి కిలోమీటరు పొడవున పూర్తిగా దెబ్బతిన్నది. నడవడానికి కూడా అవకాశం లేకుండా పోయింది. స్కూల్‌కు వెళ్లి చూస్తే గదుల్లో ఫ్యాన్లు లేవు. లైట్లు లేవు. 100 మంది విద్యార్థులున్నారు. వారు పడి ఇబ్బందులను చూసి దాతలను సమీకరించి రోడ్డు వేయించారు. విద్యార్థుల భోజనానికి సన్నబియ్యం పంపుతున్నారు.


మోడల్ స్కూల్‌కు వెళ్లే నూతన రహదారి ఇదే..

ఆక్రమణల తొలగింపునకు శ్రీకారం

శాసనసభ్యుడైన పక్షం రోజుల్లోనే కనిగిరి మున్సిపాలిటీలో ఆక్రమణల తొలగింపునకు శ్రీకారం చుట్టారు. ప్రధాన రహదారులు, ఫుట్‌పాత్‌లు, సైడు రోడ్లు ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి ఏర్పాటు చేసిన షాపులను తొలగించేశారు. దీనివల్ల కొందరు పేదలు ఉపాధి అవకాశాలు కోల్పోవడాన్ని గుర్తించి వారికి ప్రత్యామ్నాయం కల్పించారు. తన మిత్రుడైన మంత్రి గొట్టిపాటి రవికుమార్ సహకారంతో సుమారు 200 విద్యుత్ స్తంభాలను వేయించి పట్టణాన్ని కాంతివంతం చేశారు.


మోపాడు రిజర్వాయర్‌కు ఆధునిక కళ

ఆధునీకీకరణ పనులు జరగక కునారిల్లుతున్న మోపాడు రిజర్వాయర్ పనులకు శ్రీకారం పలికారు. వందేళ్ల క్రితం ఏర్పాటైన తూమును వినియోగంలోకి తెచ్చేందుకు కొత్త గేటు ఏర్పాటు చేయించారు. ప్రస్తుతం రిజర్వాయర్ జంగిల్ క్లియరెన్స్ పనులు జరుగుతున్నాయి. రిజర్వాయర్ నుంచి బంగ్లా వరకు ఉన్న రోడ్డు నిర్మాణం పూర్తి చేయించారు. ఇవేకాక కనిగిరి ఆర్టీసీ డిపోకు 24 బస్సులు వచ్చాయి. రైతు బజారులో రూ.1.10 కోట్ల వ్యయంతో 37 గదుల నిర్మాణమవుతున్నాయి.

24 గంటల్లోనే 'సంక్షేమం'గా..

ఎస్సీ విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌ను ఎమ్మెల్యే ఉగ్ర సందర్శించారు. పదేళ్ల క్రితం ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు భవన నిర్మాణానికి ఆయనే నిధులు తెప్పించారు. ప్రస్తుతం ఆ హాస్టల్‌కు వెళ్లి అక్కడ పరిస్థితిని చూసి బాధపడ్డారు. 200 మంది విద్యార్థులున్న హాస్టల్‌లో కనీస సౌకర్యాలు ఏమీ లేవు. అత్యధిక గదుల్లో ఫ్యాన్లు లేవు. కొన్ని గదుల్లో ఉన్నా అవి పనిచేయడం లేదు. ట్యూబ్ లైట్లు వెలగటం లేదు. బాత్ రూమ్‌లు శిథిలమయ్యాయి. ఆగమేఘాలపై తన మిత్రుడికి ఫోన్‌చేసి 42 ఫ్యాన్లు ఏర్పాటు చేయించారు. అప్పటికప్పుడు 90 ట్యూబ్‌లైట్లు వేయించారు. బాత్‌రూమ్‌లు, ఇతర గదుల్లో అవసరమైన ఆధునిక పనులు చేయించారు. మూడు, నాలుగు రోజుల్లో రూ.4.80 లక్షల వ్యయంతో సమస్యలకు చెక్ పెట్టారు.

- పిల్లల ఆహారానికి వినియోగిస్తున్న బియ్యంలో నాణ్యత లేదని గుర్తించి సన్న బియ్యం పంపిస్తూ అందుకు నెలకు రూ.లక్ష వెచ్చిస్తున్నారు.

ఆక్రమణల ఆస్పత్రిని అధునాతనంగా తీర్చిదిద్ది..

V ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి తొలిసారి గెలిచినప్పుడే కనిగిరి ప్రభుత్వ వైద్యశాలపై దృష్టి పెట్టి 30 పడకల వైద్యశాలను 100 పడకల వైద్యశాలగా అభివృద్ధి చేశారు. ఆ తర్వాత పదేళ్లలో వైద్యశాలలో వైద్యం కరువైంది. ఆస్పత్రి ఆవరణ ఆక్రమణకు గురైంది. ఈసారి ఎమ్మెల్యే అయి విజయోత్సవాలు కూడా జరక్కముందే ఆ వైద్యశాలను సందర్శించారు. అక్కడ పరిస్థితి చూసి చలించారు. ఆక్రమణలు తొలగించారు. ఆయన పిలుపుతో దాతలు రంగంలోకొచ్చారు. తొలుత గుంటూరులోని తన వైద్యశాల నుంచి కొన్ని పరికరాలు తెప్పించారు. వినియోగంలో లేని తల్లీబిడ్డ సంరక్షణ విభాగాన్ని అన్ని సౌకర్యాలతో పునరుద్ధరించారు. తన వైద్యశాల నుంచి పడకలు తెప్పించారు. కొత్త పడకలకు ఆర్డర్లు ఇచ్చారు.

V వైద్యశాల ఆకస్మిక తనిఖీకి వెళ్లిన కలెక్టర్ అన్సారియా.. ఎమ్మెల్యే ఉగ్ర చేపట్టిన పనులు చూసి వెంటనే ఆయనతో మాట్లాడారు. తల్లీబిడ్డల సంరక్షణ విభాగాల నిర్వాహణకు ఉత్తరప్రదేశ్ అనుసరిస్తున్న విధానాన్ని వివరించారు. అక్కడి నుంచి రీసెర్చ్ సెంటర్ ప్రతినిధులను పిలిపించి వారితో తల్లీబిడ్డ సంరక్షణ కేంద్రం రూపురేఖలు మార్చేస్తున్నారు. ఆ విభాగానికి రూ.15 లక్షలు ఖర్చు చేసి పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించారు.

V మూతపడి ఉన్న ఆపరేషన్ థియేటర్‌ను వినియోగంలోకి తెచ్చేందుకు తొలుత తన వైద్యశాలలోని పరికరాలను తీసుకొచ్చారు. ఆ తర్వాత మరో రూ.10 లక్షల విలువైన వైద్య పరికరాలు కొనుగోలు చేసి ఆపరేషన్ థియేటర్‌ను వినియోగంలోకి తెచ్చారు.

V ఓపి విభాగాన్ని ఆధునికీకరించారు. మూలన పడిన రక్త పరీక్షల విభాగాన్ని పునరుద్ధరించారు. ఎక్స్‌రే మిషన్‌ను తెప్పించారు. రూ.50 లక్షల వ్యయంతో ఈ పనులు పూర్తి చేస్తున్నారు.

V తన వైద్యశాల నుంచి ముగ్గురు నర్సులు, కొందరు డాక్టర్లను ప్రభుత్వ ఆస్పత్రికి కేటాయించాలని చెప్పటంతో కలెక్టర్ అంగీకరించారు. ముందుగా మత్తు డాక్టర్ ఏర్పాటుకు కలెక్టర్ చర్యలు తీసుకున్నారు.

V డయాలసిస్ విభాగానికి భవనం కొరత తీర్చే విషయంపై దృష్టి పెట్టారు. దాతలను సమీకరించారు. ఇవన్నీ అమల్లోకి రావడంతో నిన్న మొన్నటి వరకు రోజుకు 20 ఓపీలు ఉండే ఆ ఆస్పత్రికి ఇప్పుడు 400 ఓపీలు వస్తున్నాయి.



కనిగిరి ప్రభుత్వ వైద్యశాల



ఆస్పత్రిలో ఆధునిక యంత్రాలు



జిల్లాలో 4.0 మి.మీ వర్షపాతం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు మండలాల్లో ఒక మెస్తరు వర్షం కురిసింది. శుక్రవారం ఉదయానికి గడిచిన 24 గంటల్లో 4.0 మి.మీ వర్షపాతం నమోదైంది. పిసిపల్లిలో 18.8, బేస్తవారపేట 16.0, పామూరు 11.8, రాచర్ల 11.0, దోర్నాల 10.7 మి.మీ వర్షం కురవగా, మరో పది మండలాల్లో 1.0 మి.మీ. నుంచి 8.8 మి.మీ. వరకు వాన పడింది.

గుండ్లకమ్మ రిజర్వాయర్‌కు వరద ఉధృతి

మద్దిపాడు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన వర్షాలకు గుండ్లకమ్మ రిజర్వాయర్‌లోకి శుక్రవారం వరద నీటి ఉధృతి పెరిగింది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు భారీగా వర్షపు నీరు వస్తోంది. 6800 క్యూసెక్కు నీరు చేరడంతో మూడు గేట్లు ద్వారా 10,800 క్యూసెక్కుల నీటిని బయటకు విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్టు ఏఈ రామాంజనేయులు తెలిపారు. ప్రాజెక్టులో 20.06 మీటర్లు లెవల్ ఉంచినట్లు చెప్పారు. ఎగువ నుంచి నీటి ఉధృతి పెరిగే కొద్దీ మరో గేటు ద్వారా నీటిని విడుదల చేస్తామన్నారు.



హాస్టళ్లలో మౌలిక వసతులను త్వరగా కల్పించాలి : కలెక్టర్

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : స్వీకారం కార్యక్రమం ద్వారా జిల్లాలో సంక్షేమ వసతిగృహాల్లో కనీస మౌలిక వసతులు కల్పించేందుకు చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. స్వీకారం కార్యక్రమంలో భాగంగా సామాజిక బాధ్యతతో సాంఘిక సంక్షేమశాఖ వసతిగృహాలను దత్తత తీసుకున్న సంబంధిత కార్పొరేట్ సంస్థల ప్రతినిధులను సమన్వయం చేసుకొని ఆయా పనులు పూర్తి చేయాలన్నారు. వాటికి సంబంధించిన ప్రతిపాదనలు తయారు చేసి రోజువారీగా సమన్వయం చేసేందుకు నోడల్ అధికారిని నియమించాలని డీడీ లక్ష్మానాయక్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో సీపీవో వెంకటేశ్వర్లు, మత్స్యశాఖ జేడీ చంద్రశేఖర్, పరిశ్రమలశాఖ జీఎం శ్రీనివాసరావు, బీసీ వెల్ఫేర్ అధికారి అంజల, గిరిజన సంక్షేమశాఖ అధికారి జగన్నాథరావు, మైనింగ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



డీఆర్వో శ్రీలతకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం మునిసిపాలిటీలో అక్రమంగా తొలగించిన మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఏపీ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ) నాయకులు కోరారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో డీఆర్వో శ్రీలతను కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ గత 20 ఏళ్ల నుంచి విధులు నిర్వహిస్తున్న కార్మికులను అక్రమంగా తొలగించడం దారుణంగా ఉందన్నారు. కార్మికులు కడుపు కొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని, ఇది మంచిపద్ధతి కాదని, వారందరినీ తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. గత ఐదు రోజుల నుంచి కార్మికులు రిలే నిరాహారదీక్షలు చేస్తున్నా పట్టించుకోకపోవడం దారుణంగా ఉందన్నారు. వెంటనే సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కె.శ్రీనివాసరావు, టి.మహేష్, కె.సామ్రాజ్యం, యు.రత్నకుమారి, టి.విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతులకు పెద్దపీట



డ్రైనేజీ కాలువకు పనులు ప్రారంభిస్తున్న ఎంపీడీవో, నాయకులు

నాగులుప్పలపాడు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎంపీడీవో వై.మహాలక్ష్మి పేర్కొన్నారు. పల్లె పండుగలో భాగంగా శుక్రవారం మండలంలోని చేకూరపాడులో రూ.20లక్షలు, బి.నిడమానూరులో రూ.20లక్షలు, పోతవరంలో రూ.15లక్షలు, ఓబన్నపాలెంలో రూ.10లక్షలు, ఎం.ముప్పాళ్లలో రూ.20లక్షలు, మట్టిగుంటలో రూ.20లక్షలు, కండ్లగుంట రూ.20లక్షలతో చేపట్టనున్న సిమెంట్‌రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలకు ఎంపీడీవో స్థానిక టీడీపీ నాయకులతో కలసి శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమాల్లో టీడీపీ మండల అధ్యక్షులు మనోజ్‌కుమార్, సీనియర్ నేత గుమ్మడి సాయిబాబా, ఏపీవో రవి, ఏపీఎం నరేంద్ర, ఏఈ పాలపర్తి రవి, టీడీపీ మండల కార్యదర్శి కాకర్ల లక్ష్మీ వరప్రసాద్, మున్నంగి పున్నారెడ్డి, మెట్టు సుబ్బయ్య నాయుడు, పోలినేని చలపతి, వైకుంఠ వీరాంజనేయులు, నలమలపు అంకిరెడ్డి, స్వర్ణ కిషోర్, సర్పంచ్‌లు రమేష్, పోలినేని వెంకటేశ్వర్లు, వైకుంఠ పద్మశ్రీ, వి.శ్రీనివాసరావు, పాలేరు అనీలాకుమారి, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

షూటింగ్‌బాల్ జిల్లా జట్లు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

సంతనూతలపాడు, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా షూటింగ్‌బాల్ బాల, బాలికల జట్టు ఎంపికలు శుక్రవారం పేర్నమిట్ట జడ్పీహైస్కూల్లో జరిగాయి. తుదిగా 12 మంది బాలురు, 12 బాలికలు ఎంపికైనట్లు జిల్లా షూటింగ్‌బాల్ సెక్రటరీ రత్నకుమార్ తెలిపారు. ఎంపికైనవారు అనంతపురం జిల్లా నార్పాలలో జరిగే 43వ రాష్ట్రస్థాయిలో పోటీలలో జిల్లా తరుపున పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పార్వతిశాంతి, కె.నారాయణ, ఫణీంద్ర, మూర్తి, పాల్గొన్నారు.

పాదచారికి గాయాలు

టంగుటూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మోటార్‌సైకిల్ ఢీకొని పాదచారికి గాయాలయ్యాయి. ఈ ఘటన టంగుటూరు హైవేలోని బాపూజీ కాలనీ వద్ద శుక్రవారం జరిగింది. సింగరాయకొండకు చెందిన బాపట్ల శివకుమార్ ఆర్టీసీ బస్సు ఎక్కి బాపూజీకాలనీ సమీపంలోని పెట్రోలు బంకు వద్ద దిగాడు. నడుచుకుంటూ వెళ్తున్న ఆయన్ను ఎదురుగా రాంగ్ రూట్‌లో వచ్చిన ద్విచక్రవాహనదారుడు ఢీకొట్టాడు. దీంతో శివకుమార్ గాయపడగా ఎస్సై పరిశీలించి క్షతగాత్రుడిని ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.



భాగ్యనగర్‌లో బురదమయంగా ఉన్న రోడ్డు



ఇందిరమ్మకాలనీలో గోతుల్లో నిలిచిన వర్షపునీరు



జర్నలిస్టుకాలనలో పేరుకున్న బురద



కమ్మపాలెంలో రోడ్డు దుస్థితి

ఇవేమి రోడ్లు..!

నగరదారులన్నీ గతుకులమయం ● వానలకు అస్తవ్యస్తంగా మారిన వైనం

గత ఐదేళ్లలో మరమ్మతులు కరువు

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): గడిచిన నాలుగు రోజులుగా కురిసిన వానలకు నగరంలో రోడ్లన్నీ అధ్వానంగా మారాయి. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అవసరమైన ప్రాంతాల్లో కొత్తగా రోడ్ల నిర్మాణాలు లేకపోగా, ఉన్నవాటికి మరమ్మతులు, ప్యాచ్‌వర్క్‌లు కరువయ్యాయి. ఇటీవల కురిసిన వర్షాలకు నగరంలోని రోడ్లు గతుకులమయంగా మారాయి. మరోవైపు మట్టిదిబ్బలు పేరుకుపోవడమే కాకుండా కంకర రోడ్లపైకి చేరడంతో రహదారులన్నీ అస్తవ్యస్తంగా మారాయి. దీనికితోడు వానలకు నగరంలోని పలు వీధుల్లో, శివారుకాలనీల్లో రోడ్లన్నీ బురదమయంగా మారాయి. ప్రత్యేకించి హౌసింగ్‌బోర్డు కాలనీ, దారావారితోట, జర్నలిస్ట్‌కాలనీ, జాషువాకాలనీ, మదర్‌థెరిస్సాకాలనీ, బిలాల్ నగర్, భగత్‌సింగ్ కాలని, వెంకటేశ్వరకాలనీ, ఇలా పలు ప్రాంతాల్లో వాన ఇబ్బందులు ఇంకా వీడలేదు. ప్రత్యేకించి ఏళ్ల తరబడి ఈ కాలనీల్లో రహదారులు పూర్తిస్థాయిలో నిర్మాణానికి నోచుకోలేదు. రోడ్లపై గుంతల్లో వర్షపునీరు నిలబడటంతో కాలు బయటకు పెట్టలేని పరిస్థితి పలు కాలనీల్లో కనిపిస్తున్నది. దీంతో బురద బాధలతో జనం అల్లాడిపోతున్నారు.



కొత్తపట్నం బస్టాండు వద్ద..

మిరప పంటలో నీరు నిల్వ లేకుండా చూడాలి

● ఉద్యానశాఖ ఏవో ప్రత్యూష

నాగులుప్పలపాడు అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రైతులు సాగుచేసిన మిరప పంటలో వర్షపునీరు నిల్వ లేకుండా బయటకు మళ్లించాలని ఉద్యానశాఖ ఏవో ప్రత్యూష సూచించారు. మండలంలోని రాపర్ల, మాచవరం, చదలవాడ, నాగులుప్పలపాడు గ్రామాల్లోని మిరప పంటలను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ వర్షాలకు మిరప పంటలో నీరు ఉంటే వెంటనే బయటకు పంపి తేమ ఆరడానికి ఒక ఎకరం పొలానికి 30 కేజీల యూరియా, 15 కేజీల పొటాష్ చల్లాలన్నారు. 5 గ్రాముల 19.19.19 లేదా 13.0.45 లేదా 10 గ్రాముల యూరియా 10 గ్రాముల చక్కెర లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. అంతర సేద్యం చేసి నేల ఆరబెట్టాలని సూచించారు. తెగుళ్ల ఆశించకుండా అవసరమైన మందులు పిచికారి చేయాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.



నాగులుప్పలపాడులో మిరప పంటను పరిశీలిస్తున్న ఏవో ప్రత్యూష



మిట్టపాలెంలో వరి దుబ్బులను పరిశీలిస్తున్న ఏవో

వరి పంటను పరిశీలించిన ఏవో

కొండపి: వ్యవసాయాధికారి విజయ్‌కుమార్ శుక్రవారం మండలంలోని గోగినేనివారిపాలెం, మిట్టపాలెం గ్రామాల్లో పర్యటించారు. వరి పైరును పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వీఏఏలు డి.ఆదినారాయణ, కె.శ్రీకాంత్, ఏఈవో పి.కుమార్ పాల్గొన్నారు.

మద్దిపాడు మండలంలో..

మద్దిపాడు: బంగాళాఖాతంలో అల్పపీడనం వల్ల కురిసిన వర్షాలు మండలంలోని రైతులకు మాత్రం నష్టం మిగిల్చింది. ఏకధాటిగా మూడు రోజులు కురిసిన వానకు చేలల్లో నీళ్లు నిలిచి వేసిన పంటలు దెబ్బతిన్నాయి. గుండ్లాపల్లిలో మినుము, మల్లవరం వద్ద జొన్న పూర్తిగా దెబ్బతినగా మిరపచేలో పూత రాలిపోయి రైతులు నష్టపోయారు. వెల్లంపల్లి పొగాకు బోర్డు పరిధిలో పొగనాట్లు వేశారు. దాదాపు 100 ఎకరాల్లో పొగనారు దెబ్బతింది. అలాగే జామతోటలో పూతరాలిపోయి కాయలు దిగుబడి తగ్గుతుందని రైతులు చెబుతున్నారు. ఇనమనమెళ్లూరు, నందిపాడు, వెల్లంపల్లి జామతోటల్లో వర్షానికి పూత రాలిపోయిందని వాపోతున్నారు. ఇంకా చేలల్లో నీరు నిలిచే ఉండటంతో నష్టం ఇంకా పెరిగే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



గుండ్లాపల్లిలో నీట మునిగిన మినుము

విద్యుత్ సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలి : సీపీఎం

ఒంగోలు క్రైం, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని, స్మార్టు మీటర్లు ఏర్పాటు చేయవద్దని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ఒంగోలులోని విద్యుత్‌భవన్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి హనీఫ్ మాట్లాడుతూ ఒక వైపు నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయని, అలాగే కరువు, వరదలతో ప్రజలు సతమతం అవుతుంటే కరెంటు చార్జీలు పెంచడం సరికాదన్నారు. ప్రభుత్వం సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జీవి.కొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు, కంకణాల ఆంజనేయులు, బి.రఘురామ్, రమాదేవి పాల్గొన్నారు.

సంతనూతలపాడులో..

సంతనూతలపాడు: విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో వినియోగదారులపై భారం మోపొద్దని సీపీఎం మండల కార్యదర్శి బంకా సుబ్బారావు కోరారు. శుక్రవారం సంతనూతలపాడు బస్టాండ్‌లో జరిగిన నిరసనలో ఎస్.వెంకటేశ్వర్లు, ఎ.భగత్‌సింగ్, ఏవీ.సుబ్బారావు, పద్మ, సుబ్రహ్మణ్యం, క్రిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఒంగోలులో నాయకుల నిరసన

టంగుటూరులో..

టంగుటూరు: విద్యుత్ సర్దుబాటు చార్జీలను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక విద్యుత్ శాఖ టౌన్ కార్యాలయం వద్ద వారు శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు టి.రాము, వి.మోజెస్ మాట్లాడుతూ ప్రజావ్యతిరేక విధానాలకు స్వస్తి చెప్పకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కొల్లాబత్తిన శ్రీనివాస్, మల్లాల యానాది, టంగుటూరి పాపారావు, కొప్పోలు రామారావు, ఎం.బుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కొండపిలో..

కొండపి: విద్యుత్ సర్దుబాటు చార్జీలకు వ్యతిరేకంగా శుక్రవారం కొండపిలో సీపీఎం నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆర్టీసీ బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ పి.మురళికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి మస్తాన్, నాయకులు గడ్డం వందనం, వై.రూబెన్, మంగమూరి వెంకటేశ్వర్లు, జయరావు తదితరులు పాల్గొన్నారు.

రూ.3.70కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

సింగరాయకొండ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తొమ్మిది గ్రామాల్లో శుక్రవారం పల్లె పండుగ కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. రూ.3.70 కోట్ల అభివృద్ధి పనులకు టీడీపీ నాయకులు శంకుస్థాపనలు చేశారు. దీంతో ఐదేళ్ల తర్వాత మరలా గ్రామాల్లో అభివృద్ధి పనులు ప్రారంభమవుతున్నాయని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో జయమణి, జేఈ కోట శ్రీహరి, ఏపీవో సుధాకర్‌రావు, టీడీపీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య, నేతలు చీమకుర్తి కృష్ణ, గాలి హరిబాబు, మించల బ్రహ్మయ్య, పంచాయతీ కార్యదర్శి అప్పనబోయిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు, అధికారులు

సబ్సిడీపై దాణా : జేడీఏ

నాగులుప్పలపాడు అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులకు ప్రభుత్వం 60శాతం సబ్సిడీపై అందిస్తున్న సమీకృత దాణాను సద్వినియోగం చేసుకోవాలని జేడీఏ బేబీరాణి కోరారు. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో అమ్మనబ్రోలు పశువైద్యశాల వద్ద శుక్రవారం గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందును జేడీఏ తాపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశువులకు మేత కొరత లేకుండా సమీకృత దాణా మిశ్రమాన్ని ఒక్కో గేదెకు 30 కేజీలు అందించాలన్నారు. వర్షాకాలంలో పశువులు గొంతువాపు వ్యాధికి గురికాకుండా టీకాలను చేయించాలన్నారు. పశువులకు బీమా చేయించాలని చెప్పారు. అనంతరం 35మందికి ఆరు టన్నుల దాణా అందించారు. కార్యక్రమంలో వైద్యులు అనురాధ పాల్గొన్నారు.

రైతులకు శిక్షణ

చీమకుర్తి, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ, ఉద్యానపంటలలో మేలైన యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం కూనంనేనివారిపాలెంలో జిల్లా వనరులకేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఏవో డీవీ.భాస్కర్ ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, ఈ-పంట ప్రాముఖ్యత గురించి వివరించారు. డీఆర్‌సీ అధికారి శేషమ్మ పంటల సాగులో యాజమాన్య పద్ధతుల గురించి చెప్పారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఈవో వెంకటేశ్వర్లు, రంగదివ్య పాల్గొన్నారు. తదుపరి గోనుగుంట, కేవీ.పాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఉపాధి పనుల కేటాయింపులో వివక్ష

● మండల సమావేశంలో ఎంపీటీసీ చర్చ

కొత్తపట్నం(ఒంగోలు నగరం), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద కేటాయించిన సిమెంటు రోడ్లలో మండలంలోని కొన్ని పంచాయతీలకే ఇచ్చి మిగిలిన పంచాయతీలకు అన్యాయం చేశారని ఎంపీటీసీ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం కొత్తపట్నం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కొత్తపట్నం ఎంపీటీసీ ఆర్.వెంకటరావు, పాదర్తి ఎంపీటీసీ అరుణ, అల్లూరు ఎంపీటీసీ శాంతారావు తదితరులు మాట్లాడుతూ ఇటీవల మండలంలోని ఏడు గ్రామాలకు మాత్రమే సిమెంటు రోడ్లను మంజూరు చేశారని, మిగిలిన గ్రామాలకు కేటాయింపులు లేవన్నారు. ప్రస్తుతం మంజూరైన పనులను రద్దు చేసి వచ్చిన నిధులను అన్ని గ్రామాలకు సమానంగా పంచి పనులు మంజూరు చేయాలని కోరారు. అనంతరం వైద్యఆరోగ్యశాఖపై చర్చ జరిగింది. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వైష్ణవి, ఎంపీటీసీ వెంకటరావు మధ్య వాదన తీవ్ర స్థాయికి చేరింది. పంచాయతీ చెత్తబండి ఆసుత్రి ఆవరణలోకి వచ్చి చెత్త తీసుకుపోవాలన్న అంశంతో ప్రారంభమైంది. మహిళా సర్పంచ్‌ని సమావేశాలకు రాకుండా అడ్డుకుంటున్నారంటూ ఎంపీటీసీపై వైద్యాధికారి ఆరోపణ చేయగా ఆయన ఆగ్రహంతో ఊగిపోయారు. అల్లూరు గ్రామ ఎస్సీ కాలనీకి శ్మశానం వాటిక లేక అనేక ఇబ్బందులు పడుతు న్నా రని శాంతారావు చెప్పారు. సమావేశంలో ఎంపీడీవో శ్రీ కృష్ణ, తహసీల్దార్ మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి టీడీపీ లక్ష్యం

● పార్టీ మండలాధ్యక్షుడు జయంత్‌బాబు

మద్దిపాడు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): సంక్షేమ పాలన, అభివృద్ధి తెలుగుదేశం పార్టీకి రెండు కళ్లని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని నందిపాడు, గుండ్లాపల్లి, నాగన్నపాలెం, రాచవారిపాలెం, నేలటూరు గ్రామాల్లో పల్లెపండుగ కార్యక్రమం ఎంపీడీవో వి.జ్యోతి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నందిపాడులో రూ.10లక్షలు, గుండ్లాపల్లిలో రూ.20లక్షలు, నాగన్నపాలెంలో రూ.10 లక్షలు, రాచవారిపాలెంలో రూ.20 లక్షలు, నేలటూరులో రూ.20లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్లకు శంకుస్థాపన చేశారు. అనంతరం జయంత్‌బాబు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం రోడ్లు, డ్రైనేజీలతో పాటు మౌలిక వసతుల కల్పనకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈ రవికుమార్, ఏపీవో ధనుంజయ వర్మ, సర్పంచ్‌లు తుమ్మల సుధాకర్‌బాబు, పోకూరి శ్రీనివాసరావు, కాకర్ల విజయ్‌కుమార్, పారా నరసింహారావు, చెరుకూరు శ్రీను, చింతల శ్రీనివాసరావు, శుద్ధపల్లి అనిల్, దుంపా కృష్ణమోహన్‌రెడ్డి, సిరిమిళ్ల అబ్రహం, అద్దాల ఫణీంద్ర, కోవి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎల్‌ఐసీ పాలసీలపై పన్నులు ఎత్తివేయాలి



కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఏజెంట్లు

ఒంగోలు(రూరల్), అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): ఎల్‌ఐసీ పాలసీల ప్రీమియంలపై విధించిన విధించిన పన్నులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే ఎత్తివేయాలని ఎల్‌ఐసీ ఏజెంట్‌ల యూనియన్ (లియాఫి) నాయకుడు మేడికొండ లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఒంగోలులోని ఎల్‌ఐసీ కార్యాలయం ఎదుట ఏజెంట్లు నిరసన కార్యక్రం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పాలసీల పాలసీలపై ఏజెంట్లకు కమీషన్ తగ్గించడం దారుణంగా ఉందని విమర్శించారు. పాత పాలసీ విధానం యథాతథంగా ఉంచాలని డిమాండ్ చేశారు. ఏజెంట్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. క్లబ్‌మెంబర్ షిప్‌ను లాప్స్‌వేషన్‌తో ముడిపెట్టడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఏజెంట్లు ఎం.శ్రీహరి, వై.రాంబాబు, ఆంజనేయులు, బి.అంజయ్య, డి.శ్రీనివాసరావు, జి.నాగయ్య, అక్బర్, ఆర్.మణికంఠ, ఎస్.సత్యనారాయణ, బోజిరెడ్డి, రమణారెడ్డి, పి.శేషు, పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందును తాగించాలి



నట్టల నివారణ మందు తాగిస్తున్న జేడీఏ బేబీరాణి

ఒంగోలు(రూరల్)అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): గొర్రెలు, మేకలు, దూడలకు నట్టల నివారణ మందు తప్పక తాగించాలని జేడీఏ డాక్టర్ కె.బేబీరాణి కోరారు. శుక్రవారం త్రోవగుంట పశువైద్యశాల వద్ద నట్టల నివారణ మందు తాగించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీఏ మాట్లాడుతూ ఏలికపాములు, బద్దెపురుగులు, ఖార్జపు జలగలు, పొట్ట జలగలు వల్ల మేకలు, గొర్రెలు, దూడలు అనారోగ్యానికి గురై మరణిస్తాయన్నారు. పరాన్నజీవులను నివారించటానికి తప్పక నట్టల నివారణ తాగించాలని, దీనివల్ల జీవాలు ఆరోగ్యంగా ఎదుగుతాయని చెప్పారు. 235 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తాగించారు. కార్యక్రమంలో ఏడీఏ బి.బసవశంకరరావు, పశువైద్యాధికారి లక్ష్మయ్య, సహాయకులు ప్రగతి, మాధవాచారి పాల్గొన్నారు.

'వెంకటరమణ'లో వాస్క్యులర్ సర్జరీ సేవలు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వైద్యులు

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని వెంకటరమణ నర్సింగ్ హోమ్‌లో గుంటూరు వికాస్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో వాస్క్యులర్ సర్జరీ సేవలను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు డాక్టర్ కామేపల్లి సీతారామయ్య తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను స్థానిక ఆసుపత్రిలో ఆవిష్కరించారు. అనంతరం సీతారామయ్య మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా వాస్క్యులర్ సేవలు వెరికోసిస్ వెయిన్స్, ఏవీఫిస్టులా, డయాబెటిక్ ఫుట్‌అల్సర్, ఎండోవాస్క్యులర్ వైద్యసేవలను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు. గతంలో ఈ సేవల కోసం చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, విజయవాడ వంటి నగరాలకు వెళ్ళాల్సి వచ్చేదన్నారు. జిల్లా ప్రజల కోసం ఒంగోలులోని వెంకటరమణ నర్సింగ్ హోమ్‌లో ఈ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. డాక్టర్ సురేంద్ర మాట్లాడుతూ వాస్క్యులర్ దేశంలోనే అత్యంత ప్రముఖమైన మేదాంత, ది మెడిసిటీ (ఢిల్లీ)లో వెయిన్స్ సీటీవీఎస్ సర్జరీ చేయడంలో రెండేళ్ళపాటు అనుభవం ఉన్నట్లు చెప్పారు. ప్రజలు ఈ సేవలను వినియోగించుకోవచ్చని కోరారు. సమావేశంలో డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ సుబ్రమణ్యేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలు పరివర్తన చెందాలి : ఎస్పీ

ఒంగోలు క్రైం, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి) : క్షణికావేశంతో నేరం చేసి జైలు జీవితం గడిపిన ఖైదీలు పరివర్తన చెందాలని ఎస్పీ దామోదర్ కోరారు. శుక్రవారం ఒంగోలులోని జిల్లా జైలును ఆయన సందర్శించారు. అక్కడ పరిసరాలు, బ్యారక్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఖైదీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ పి.వరుణారెడ్డి, డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్రరావు, సీఐలు అజయ్‌కుమార్, నాగరాజు, జైలర్ రమేష్, డాక్టర్ బ్రహ్మతేజ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ మహిళా కళాశాలలో వర్క్‌షాపు

ఒంగోలు విద్య, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు ప్రభుత్వమహిళా డిగ్రీ కళాశాలలో జడ్ స్పేస్ ఉపయోగించి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా ఏఆర్అడ్‌వీఆర్ టెక్నాలజీతో ప్రాథమిక సైన్స్ విద్యను మెరుగుపర్చడంపై శుక్రవారం వర్క్‌షాపు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డి.కళ్యాణి అధ్యక్షత వహించారు. ముంబై నుంచి విచ్చేసిన వీటీఐ సొల్యూషన్ ప్రాజెక్టు మేనేజర్ శబిన్‌మహేంద్ర జడ్ స్పేస్ ల్యాప్‌టాప్‌ని వినియోగం, అసెంబుల్డ్, ఇన్‌స్టాల్ చేయడం వివరించారు. కార్యక్రమంలో అకడమిక్ కో ఆర్డినేటర్ ఎం.శ్రీనివాసరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

సింగరాయకొండ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి):: రైలుకింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన పాతసింగరాయకొండ పంచాయతీ పరిధిలోని చిల్లా కాలువ సమీపంలో శుక్రవారం జరిగింది. మృతుడి వయసు 25-30 సంవత్సరాలు ఉంటుందని, 5.7 అడుగల ఎత్తు ఉన్నాడని రైల్వే పోలీసులు తెలిపారు. శవపరీక్ష నిమిత్తం మృతదేహాన్ని ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. జీఆర్పీ ఎస్సై అరుణకుమారి కేసు నమోదు చేశారు.

రూ.50 లక్షలతో వైద్యశాలను ఆధునికీకరించాలంటే ప్రభుత్వానికి సాధారణంగా కొన్ని నెలలు పట్టొచ్చు.. కానీ అక్కడ పనులు చకచకా పూర్తి చేశారు!

సంక్షేమ వసతి గృహంలో కనీస సదుపాయాల్లేక అవస్థలు పడుతున్న బాలికల సమస్యను పరిష్కరించాలంటే కొన్ని రోజులైనా పట్టొచ్చు. కానీ అక్కడ గంటల్లో అన్ని సౌకర్యాలూ అందాయి!

గురుకుల పాఠశాలకు వెళ్లడానికి రహదారి లేక సతమతమవుతున్న విద్యార్థులకు రోడ్డు సౌకర్యం కల్పించాలంటే ప్రభుత్వానికి తక్కువలో తక్కువ రెండు నెలలైనా పట్టొచ్చు. కానీ అక్కడ ఆగమేఘాలపై రోడ్డు నిర్మాణమైంది!

ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోకుండా పెండింగులో ఉన్న రిజర్వాయర్ పనులు చేయించాలంటే ఫైళ్ల దుమ్ము దులపడానికే నెలలు పడతాయి. కానీ అక్కడ రోజుల వ్యవధిలోనే చకచకా పనులవుతున్నాయి!

ఇలా ఇవన్నీ జరగడాన్ని సినిమాల్లో చూసి ఉంటాం. నిజ జీవితంలో పైవన్నీ ప్రభుత్వం చేయించాలంటే చాలా కాలం పడుతుంది. వాటన్నింటినీ గుర్తించాలి. ఫైళ్లు పెట్టాలి. ఆమోదాలు పొందాలి. నిధులు మంజూరవ్వాలి. నిర్మాణాలు జరగాలి. ఆర్థిక సమస్యల్లో ఉన్న ప్రభుత్వానికి ఇవేవీ ఇప్పట్లో సాధ్యం కావు. అయినా ఆ సమస్యలు పరిష్కారం అయ్యాయి. కొన్ని పనులు కూడా పూర్తి అయ్యాయి. అదెక్కడో కాదు. కనిగిరి నియోజకవర్గంలోనే. స్థానిక ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి సొంత ఖర్చుతోనూ, దాతలను ఆహ్వానించి వారి సహకారంతోనూ వందరోజుల వ్యవధిలోనే అనేక ఫలితాలు సాధించి ప్రజల మన్ననలు పొందుతున్నారు. - ఆంధ్రజ్యోతి, ఒంగోలు

వంద రోజుల్లో — వడివడిగా —

ప్రభుత్వం చేయాల్సిన పనులు కనిగిరిలో దాతల సహకారంతో వేగంగా పూర్తి

- కునారిల్లుతున్న ప్రభుత్వాస్పత్రికి కొద్దిరోజుల్లోనే వైభవం
- సంక్షేమ వసతి గృహానికి గంటల్లో సౌకర్యాల తొడుగు
- గురుకుల పాఠశాల దారికి ఆగమేఘాలపై పనులు
- పెండింగులో రిజర్వాయర్ వర్కులు వేగంగా పూర్తి

రోల్‘ మోడల్’ అయ్యింది!

ఒకరోజు ఎమెల్యే ఉగ్ర కనిగిరి మోడల్ స్కూల్‌కు వెళ్లారు. ప్రధాన రహదారి నుంచి ఆ స్కూల్‌కు వెళ్లేదారి కిలోమీటరు పొడవున పూర్తిగా దెబ్బతిన్నది. నడవడానికి కూడా అవకాశం లేకుండా పోయింది. స్కూల్‌కు వెళ్లి చూస్తే గదుల్లో ఫ్యాన్లు లేవు. లైట్లు లేవు. 100 మంది విద్యార్థులున్నారు. వారు పడి ఇబ్బందులను చూసి దాతలను సమీకరించి రోడ్డు వేయించారు. విద్యార్థుల భోజనానికి సన్నబియ్యం పంపుతున్నారు.


మోడల్ స్కూల్‌కు వెళ్లే నూతన రహదారి ఇదే..

ఆక్రమణల తొలగింపునకు శ్రీకారం

శాసనసభ్యుడైన పక్షం రోజుల్లోనే కనిగిరి మున్సిపాలిటీలో ఆక్రమణల తొలగింపునకు శ్రీకారం చుట్టారు. ప్రధాన రహదారులు, ఫుట్‌పాత్‌లు, సైడు రోడ్లు ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి ఏర్పాటు చేసిన షాపులను తొలగించేశారు. దీనివల్ల కొందరు పేదలు ఉపాధి అవకాశాలు కోల్పోవడాన్ని గుర్తించి వారికి ప్రత్యామ్నాయం కల్పించారు. తన మిత్రుడైన మంత్రి గొట్టిపాటి రవికుమార్ సహకారంతో సుమారు 200 విద్యుత్ స్తంభాలను వేయించి పట్టణాన్ని కాంతివంతం చేశారు.


మోపాడు రిజ్వాయర్‌కు ఆధునిక కళ

ఆధునికీకరణ పనులు జరగక కునారిల్లుతున్న మోపాడు రిజర్వాయర్ పనులకు శ్రీకారం పలికారు. వందేళ్ల క్రితం ఏర్పాటైన తూమును వినియోగంలోకి తెచ్చేందుకు కొత్త గేటు ఏర్పాటు చేయించారు. ప్రస్తుతం రిజర్వాయర్ జంగిల్ క్లియరెన్స్ పనులు జరుగుతున్నాయి. రిజర్వాయర్ నుంచి బంగ్లా వరకు ఉన్న రోడ్డు నిర్మాణం పూర్తి చేయించారు. ఇవేకాక కనిగిరి ఆర్టీసీ డిపోకు 24 బస్సులు వచ్చాయి. రైతు బజారులో రూ.1.10 కోట్ల వ్యయంతో 37 గదుల నిర్మాణమవుతున్నాయి.

24 గంటల్లోనే ‘సంక్షేమం’గా..

ఎస్సీ విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌ను ఎమ్మెల్యే ఉగ్ర సందర్శించారు. పదేళ్ల క్రితం ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు భవన నిర్మాణానికి ఆయనే నిధులు తెప్పించారు. ప్రస్తుతం ఆ హాస్టల్‌కు వెళ్లి అక్కడ పరిస్థితిని చూసి బాధపడ్డారు. 200 మంది విద్యార్థులున్న హాస్టల్‌లో కనీస సౌకర్యాలు ఏమీ లేవు. అత్యధిక గదుల్లో ఫ్యాన్లు లేవు. కొన్ని గదుల్లో ఉన్నా అవి పనిచేయడం లేదు. ట్యూబ్ లైట్లు వెలగటం లేదు. బాత్ రూమ్‌లు శిథిలమయ్యాయి. ఆగమేఘాలపై తన మిత్రుడికి ఫోన్‌చేసి 42 ఫ్యాన్లు ఏర్పాటు చేయించారు. అప్పటికప్పుడు 90 ట్యూబ్‌లైట్లు వేయించారు. బాత్‌రూమ్‌లు, ఇతర గదుల్లో అవసరమైన ఆధునిక పనులు చేయించారు. మూడు, నాలుగు రోజుల్లో రూ.4.80 లక్షల వ్యయంతో సమస్యలకు చెక్ పెట్టారు.

- పిల్లల ఆహారానికి వినియోగిస్తున్న బియ్యంలో నాణ్యత లేదని గుర్తించి సన్న బియ్యం పంపిస్తూ అందుకు నెలకు రూ.లక్ష వెచ్చిస్తున్నారు.

ఆక్రమణల ఆస్పత్రిని అధునాతంగా తీర్చిదిద్ది..

V ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి తొలిసారి గెలిచినప్పుడే కనిగిరి ప్రభుత్వ వైద్యశాలపై దృష్టి పెట్టి 30 పడకల వైద్యశాలను 100 పడకల వైద్యశాలగా అభివృద్ధి చేశారు. ఆ తర్వాత పదేళ్లలో వైద్యశాలలో వైద్యం కరువైంది. ఆస్పత్రి ఆవరణ ఆక్రమణకు గురైంది. ఈసారి ఎమ్మెల్యే అయి విజయోత్సవాలు కూడా జరక్కముందే ఆ వైద్యశాలను సందర్శించారు. అక్కడ పరిస్థితి చూసి చలించారు. ఆక్రమణలు తొలగించారు. ఆయన పిలుపుతో దాతలు రంగంలోకొచ్చారు. తొలుత గుంటూరులోని తన వైద్యశాల నుంచి కొన్ని పరికరాలు తెప్పించారు. వినియోగంలో లేని తల్లీబిడ్డ సంరక్షణ విభాగాన్ని అన్ని సౌకర్యాలతో పునరుద్ధరించారు. తన వైద్యశాల నుంచి పడకలు తెప్పించారు. కొత్త పడకలకు ఆర్డర్లు ఇచ్చారు.

V వైద్యశాల ఆకస్మిక తనిఖీకి వెళ్లిన కలెక్టర్ అన్సారియా.. ఎమ్మెల్యే ఉగ్ర చేపట్టిన పనులు చూసి వెంటనే ఆయనతో మాట్లాడారు.

తల్లీబిడ్డల సంరక్షణ విభాగాల నిర్వాహణకు ఉత్తరప్రదేశ్ అనుసరిస్తున్న విధానాన్ని వివరించారు. అక్కడి నుంచి రీసెర్చ్ సెంటర్ ప్రతినిధులను పిలిపించి వారితో తల్లీబిడ్డ సంరక్షణ కేంద్రం రూపురేఖలు మార్చేస్తున్నారు. ఆ విభాగానికి రూ.15 లక్షలు ఖర్చు చేసి పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించారు.

V మూతపడి ఉన్న ఆపరేషన్ థియేటర్‌ను వినియోగంలోకి తెచ్చేందుకు తొలుత తన వైద్యశాలలోని పరికరాలను తీసుకొచ్చారు. ఆ తర్వాత మరో రూ.10 లక్షల విలువైన వైద్య పరికరాలు కొనుగోలు చేసి ఆపరేషన్ థియేటర్‌ను వినియోగంలోకి తెచ్చారు.

V ఓపి విభాగాన్ని ఆధునికీకరించారు. మూలన పడిన రక్త పరీక్షల విభాగాన్ని పునరుద్ధరించారు. ఎక్స్‌రే మిషన్‌ను తెప్పించారు. రూ.50 లక్షల వ్యయంతో ఈ పనులు పూర్తి చేస్తున్నారు.

V తన వైద్యశాల నుంచి ముగ్గురు నర్సులు, కొందరు డాక్టర్లను ప్రభుత్వ ఆస్పత్రికి కేటాయించాలని చెప్పటంతో కలెక్టర్ అంగీకరించారు. ముందుగా మత్తు డాక్టర్ ఏర్పాటుకు కలెక్టర్ చర్యలు తీసుకున్నారు.

V డయాలసిస్ విభాగానికి భవనం కొరత తీర్చే విషయంపై దృష్టి పెట్టారు. దాతలను సమీకరించారు. ఇవన్నీ అమల్లోకి రావడంతో నిన్న మొన్నటి వరకు రోజుకు 20 ఓపీలు ఉండే ఆ ఆస్పత్రికి ఇప్పుడు 400 ఓపీలు వస్తున్నాయి.


కనిగిరి ప్రభుత్వ వైద్యశాల


ఆస్పత్రిలో ఆధునిక యంత్రాలు


వైద్యశాలలో నూతన బెడ్లు

డీసీఎంఎస్ బాధ్యులకు సర్‌చార్జి నోటీసులు

- 29న విచారణ

ఒంగోలు విద్య, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్)లో నిధులు గోల్‌మాల్ వ్యవహారంలో సివిల్ చర్యలకు జిల్లా సహకార శాఖాధికారి బి.శ్రీనివాసరెడ్డి శ్రీకారం చుట్టారు. డీసీఎంఎస్‌లో ప్రాథమికంగా రూ.3.5 కోట్లు దారి మళ్లించారు. ఈ మొత్తంలో సుమారు రూ.3కోట్లు ఇండియన్ పొటాష్ లిమిటెడ్(ఐపీఎల్)కు జమ చేశారు. ఈ గోల్‌మాల్‌పై విచారణాధికారి మాలకొండయ్య రూ.52.95 లక్షలు నికరంగా దుర్వినియోగమైనట్లు తేల్చారు. రైతులకు సరఫరా చేసిన ఎరువులకు సంబంధించి పొగాకు బోర్డు డిసిఎంఎస్‌కు రూ.3.5కోట్లు బ్యాంకు ఖాతాకు జమ చేయగా ఆ మొత్తాన్ని దుర్వినియోగం చేశారు. ఈ వ్యవహారంలో మొత్తం రూ.52.95 లక్షలు గల్లంతయ్యాయి. దీనికి డీసీఎంఎస్ చైర్‌పర్సన్ రావి పద్మావతి, బిజినెస్ మేనేజర్ చుండూరి సతీష్, అకౌంటెంట్ రామచంద్రరావులు బాధ్యులుగా గుర్తించారు. వారిని ప్రాసిక్యూట్ చేసేందుకు కలెక్టర్ అనుమతించడంతో ఒంగోలు సబ్‌డివిజనల్ సహకారాధికారి రామచంద్రనాద్ ఫిర్యాదు మేరకు ఒంగోలు తాలూకా పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు అయింది. నిధులు రికవరీకి డీసీవో శ్రీనివాసరెడ్డి సర్‌చార్జి నోటీసులు జారీ చేశారు. ఈనెల 29న డీసీవో కార్యాలయంలో నిర్వహించే విచారణకు హాజరు కావాలని అందులో ఆదేశించారు. ఇందులో రావి పద్మావతి, రామచంద్రరావులు బాపట్ల జిల్లాకు చెందిన వారు కాగా సతీష్ ఒక్కరే జిల్లాకు చెందిన వారు. సర్‌చార్జి విచారణకు వరుసగా మూడుసార్లు హాజరుకాకపోతే ఎక్స్‌పార్టీ కింద సర్‌చార్జి ఉత్తర్వులు జారీ చేసి ఈపీఫైల్ చేసి ఆ మొత్తం రికవరి చేస్తారు.

టెట్‌కు 151 మంది గైర్హాజరు

ఒంగోలు విద్య, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జరుగుతున్న ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)కు శుక్రవారం 151 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. జిల్లాలో నాలుగు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా ఒంగోలులోని బ్రిలియంట్‌కంప్యూటర్ సెంటర్, ఎన్‌సీసీఈఎల్ కేంద్రం, మార్కాపురంలోని కృష్ణచైతన్య ఇంజనీరింగ్ కాలేజీల్లో పరీక్షలు జరిగాయి. పరీక్షకు 790మంది అభ్యర్థులను కేటాయించగా 639 మందిహాజరయ్యారు. ఉదయం సెషన్‌కు 395మందికి 75, మధ్యాహ్నం సెషన్‌కు 395 మందికి 76 మంది గైర్హాజరైనట్లు ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ కె.శివకుమార్ తెలిపారు.

జిల్లాలో 4.0 మి.మీ వర్షపాతం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు మండలాల్లో ఒక మోస్తరు వర్షం కురిసింది. శుక్రవారం ఉదయానికి గడిచిన 24 గంటల్లో 4.0 మి.మీ వర్షపాతం నమోదైంది. పిసిపల్లిలో 18.8, బేస్తవారపేట 16.0, పామూరు 11.8, రాచర్ల 11.0, దోర్నాల 10.7 మి.మీ వర్షం కురవగా, మరో పది మండలాల్లో 1.0 మి.మీ. నుంచి 8.8 మి.మీ. వరకు వాన పడింది.

గుండ్లకమ్మ రిజర్వాయర్‌కు వరద ఉధృతి

మద్దిపాడు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన వర్షాలకు గుండ్లకమ్మ రిజర్వాయర్‌లోకి శుక్రవారం వరద నీటి ఉధృతి పెరిగింది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు భారీగా వర్షపు నీరు వస్తోంది. 6800 క్యూసెక్కు నీరు చేరడంతో మూడు గేట్లు ద్వారా 10,800 క్యూసెక్కుల నీటిని బయటకు విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్టు ఏఈ రామాంజనేయులు తెలిపారు. ప్రాజెక్టులో 20.06 మీటర్లు లెవల్ ఉంచినట్లు చెప్పారు. ఎగువ నుంచి నీటి ఉధృతి పెరిగే కొద్దీ మరో గేటు ద్వారా నీటిని విడుదల చేస్తామన్నారు.

సమగ్ర శిక్షలో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్


ఒంగోలు విద్య, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టులో ఖాళీగా ఉన్న సెక్టోరల్ అధికారుల పోస్టులు భర్తీ చేసేందుకు శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఒంగోలులోని ప్రాజెక్టు కార్యాలయంలో ప్రస్తుతం కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి (సీఎంవో), ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ కో ఆర్డినేటర్ (ఐఈసీవో) గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్(జీసీడీవో), ఎంఐఎస్‌అండ్ ప్లానింగ్ కో ఆర్డినేటర్, అసిస్టెంట్ స్టాటిస్టిక్స్ ఆఫీసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూలు అసిస్టెంట్లు ఈ పోస్టులకు అర్హులు. అభ్యర్థులు ఈనెల 24లోపు సంబంధిత అధికారుల ద్వారా ధ్రువీకరించిన దరఖాస్తులను సమగ్ర శిక్ష కార్యాలయంలో సమర్పించాలి. ఒకటి కంటే ఎక్కువ పోస్టులకు దరఖాస్తులు చేసేవారు ప్రతి పోస్టుకు వేర్వేరుగా దరఖాస్తు చేయాలని ఇన్‌చార్జి ఏపీసీ సామా సుబ్బారావు తెలిపారు. సంబంధిత ధృవీకరణ పత్రాలు, సర్వీసు రిజిస్టర్ జెరాక్స్ కాపీలు జత చేయాలి. ఈ పోస్టులకు సంబంధించిన మార్గదర్శకాలు, దరఖాస్తు నమూనాను ప్రకాశం వెబ్‌సైట్ నుంచి పొందవచ్చని ఆయన పేర్కొన్నారు.

నేడు, రేపు సర్టిఫికెట్ల పరిశీలన

ఒంగోలు విద్య, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి శని, ఆదివారాల్లో అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహిస్తున్నట్లు సమగ్ర శిక్ష ఇన్‌చార్జి ఏపీసీ సామా సుబ్బారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నోటిఫికేషన్‌కు సంబంధించి మెరిట్ లిస్టులో సబ్జెక్టు వారీగా షార్ట్‌లిస్టు చేసిన అభ్యర్థులకు ఈమేరకు సమాచారం పంపించినట్లు పేర్కొన్నారు. ప్రిన్సిపాల్, పీఈటీ, సీఆర్టీలకు శనివారం, అలాగే పీజీటీలు, అకౌంటెండెంట్, వార్డెన్ పోస్టులకు ఆదివారం సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందన్నారు. ఒంగోలులోని సమగ్ర శిక్ష కార్యాలయంలో ఉదయం పది గంటలనుంచి ఈప్రక్రియ ప్రారంభమవుతుందని, అభ్యర్థులు తమకు కేటాయించిన తేదీల్లో అన్ని ఒరిజనల్ సర్టిఫికెట్లతో పాటు రెండు సెట్ల జెరాక్స్ కాపీలతో హాజరుకావాలని ఆయన కోరారు.

భూసేకరణ పనులను వేగవంతం చేయాలి

- జేసీ గోపాలకృష్ణ


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నుంచి వెళ్తున్న జాతీయ రహదారులు, ప్రతిపాదిత రైల్వే మార్గాలకు పెండింగ్ భూసేకరణ పనులను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఆదేశించారు. ఈ పనులకు సంబంధించి శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో సంబంధితశాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నడికుడి-శ్రీ కళాహస్తి రైల్వేమార్గంతో పాటు 565, 544(డి), 216, 765, 167(బి) జాతీయరహదారుల పెండింగ్ భూ సేకరణ పనుల వివరాలను జేసి అడిగి తెలుసుకున్నారు. పునరావాసం, పెండింగ్‌లో ఉన్న నష్టపరిహారం, కోర్టు కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరించాలని దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో మార్కాపురం,కందుకూరు సబ్ కలెక్టర్లు సహదిత్ వెంకటత్రివినాగ్, శ్రీపూజ, కనిగిరి, ఒంగోలు ఆర్డీవోలు జి.కేశవర్ధన్‌రెడ్డి, లక్ష్మీప్రసన్న, తహసీల్దార్లు పాల్గొన్నారు.

భూగర్భ జలాల పెంపుపై దృష్టి పెట్టాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో భూగర్భజలాలు అధికంగా వినియోగించిన గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి తిరిగి నీటిమట్టం పెరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. భూగర్భజల మట్టం పెంచేందుకు మార్కాపురం మండలం నికరంపల్లి గ్రామాన్ని మోడల్‌గా ఎంపిక చేసినట్లు తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టర్ చాంబర్‌లో జరిగిన సమావేశంలో ముందుగా భూగర్భజలవనరులశాఖ డీడీ విద్యాసాగర్ మాట్లాడుతూ జిల్లాలో 57 గ్రామాల్లో పరిమితికి మించి భూగర్భజలాలను వినియోగించినట్లు గుర్తించామన్నారు. వీటిలో 14 గ్రామాల్లో రిలయన్స్ ఫౌండేషన్, సార్ఫ్, ఎఫర్ట్ సంస్థలు ఇప్పటికే అధ్యయనం చేసి వాటర్‌బడ్జెట్ ప్రణాళికను రూపొందించాయని చెప్పారు. దీనిపై కలెక్టర్ అన్సారియా స్పందిస్తూ నికరంపల్లిని మోడల్ గ్రామంగా ఎంపిక చేసి భూగర్భనీటిమట్టం పెరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్థానిక నీటి వనరులను బట్టి సాగు చేయాల్సిన పంటలపై కూడా రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లోనూ జీవనోపాధి పెరిగేలా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. జిల్లాలో భూగర్భజలమట్టం పెంచేందుకు చేపడుతున్న కార్యక్రమాలు ఉద్యమంగాచేపట్టాలని కోరారు. ఈనెల 23న నికరంపల్లిలో గ్రామసభ నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

సమావేశంలో అధికారులు జోసఫ్‌కుమార్, పీవీ.రమణ, చిరంజీవి, శ్రీనివాసరావు, గోపీచంద్, డి.వెంకటరమణ, రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు వెంకటబాబురావు, నవీన్, సార్ఫ్ ప్రతినిధి సునీల్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఎమ్మెల్యే సోదరుడి హల్‌చల్

- మహిళల నిరసన మధ్య కాలనీ దారిలో వైన్‌షాప్
- ఇదంతా వైసీపీ శ్రేణుల కుట్ర అన్న నిర్వాహకుడు

ఆంధ్రజ్యోతి, ఒంగోలు : ఒక వైన్‌షాపు ఏర్పాటు విషయంలో స్థానిక ప్రజల నిరసనను వ్యతిరేకిస్తూ మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సోదరుడు రామిరెడ్డి హల్‌చల్ చేశారు. ఆ నియోజకవర్గంలోని మండల కేంద్రమైన తర్లుబాడులో శుక్రవారం ఈ సంఘటన చోటుచేసుకుంది. తర్లుబాడులోని ముదిరాజ్ కాలనీకి వెళ్లే రోడ్డులో కొత్తగా వైన్ షాప్ ఏర్పాటుకు నిర్వాహకులు రంగం సిద్ధం చేశారు. అయితే తమ కాలనీ మధ్యలో వైన్‌షాపు ఏర్పాటు చేయడాన్ని స్థానికులు వ్యతిరేకించారు. శుక్రవారం షాపు ఏర్పాటును నిరసిస్తూ మహిళలు ధర్నా చేశారు. దీంతో షాపు ప్రారంభానికి ఆటంకం ఏర్పడింది. మార్కాపురం నుంచి ఎమ్మెల్యే సోదరుడు రామిరెడ్డి అక్కడికి వెళ్లాడు. ‘ఇక్కడే షాపు ఏర్పాటు జరుగుతుంది.. మీరు ఎన్ని నిరసనలు చేసినా వృథా ప్రయాసే’ అంటూ తేల్చి చెప్పారు. అయినా మహిళలు తమ నిరసనను కొనసాగిస్తుండడంతో అక్కడ తిష్ట వేసిన రామిరెడ్డి ‘షాపు ప్రారంభిస్తాం.. చేసేది చేసుకోండి’ అంటూ గట్టిగా నిలబడటంతో వివాదం పెద్దదైంది. ఆయన వెంట ఆ కాలనీకే చెందిన కొందరు అక్కడకు చేరారు. ధర్నా చేస్తున్న మహిళలను అక్కడ్నుంచి వెళ్లిపోవాలని పోలీసులు ఒత్తిడి చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. రామిరెడ్డి వెనక్కి తగ్గకపోవడం, మహిళలు ఆందోళన విరమించకపోవడంతో కొన్ని గంటలపాటు ఉద్రిక్తత కొనసాగింది. అనంతరం పోలీసులు నచ్చజెప్పి మహిళలను పంపించడంతో అక్కడే వైన్‌షాపు ప్రారంభమైంది. ఎమ్మెల్యే సోదరుడికి మద్దతుగా ఎక్సైజ్, పోలీసు శాఖ అధికారులు నిలిచారని ఆరోపణలు వచ్చాయి.

రాజకీయ కుట్ర

షాపు ఏర్పాటు చేస్తున్న గదికి, నిరసన తెలిపిన కాలనీవాసులకు మధ్య 400 మీటర్ల దూరం ఉందని రామిరెడ్డి తెలిపారు. 2019కి ముందు పదేళ్లపాటు ఈ భవనంలోనే వైన్ షాపు నిర్వహించారని, అందులో ఐదేళ్లు వైసీపీ నేత ఆధ్వర్యంలోనే వైన్‌షాపు నడిచిందని చెప్పారు. గత జగన్ ప్రభుత్వంలో ఈ ఇంటికి పక్కనే ఓ వైసీపీ నేత బెల్ట్‌షాపు నిర్వహించారని, అప్పుడు అభ్యంతరం చెప్పని కొందరు వ్యక్తులు.. వైసీపీ శ్రేణులను రెచ్చగొట్టి నిరసనకు తీసుకొచ్చారని తెలిపారు. తమ అనుచరులు కేవలం ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగానే షాపును ప్రారంభించారని చెప్పారు.

కూలే దశలో పంప్‌హౌస్
పట్టించుకోకుంటే ప్రమాదమే


లోపలి భాగంలో పగుళ్లు

ఒంగోలు నగర తాగునీటి అవసరాల కోసం రంగారాయుడు చెరువు వద్ద మొట్టమొదటిసారిగా నిర్మించిన పంపుహౌస్ ప్రమాదంలో ఉంది. సుమారు 1970 సంవత్సరంలో నిర్మించిన ఈ పంపుహౌస్ శిథిలావస్థకు చేరుకుంది. గోడలు పగుళ్లిచ్చి పడిపోయేందుకు సిద్ధంగా ఉంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పూర్తిగా ఉరుస్తూ పంపుహౌస్‌లోని మోటార్లు సైతం తడిసి ముద్దయ్యాయి. ఇలాగే నిర్లక్ష్యంగా వదిలేస్తే ఏ సమయంలోనైనా కూలే అవకాశం పొంచివుంది. అక్కడ పనిచేసేందుకు భయంగా ఉందని ఉద్యోగులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పంప్‌హౌస్ భవన సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అక్కడి సిబ్బంది కోరుతున్నారు

- ఒంగోలు కార్పొరేషన్, (ఆంధ్రజ్యోతి)



అవీ..ఇవీ



నోటికి నల్లరిబ్బన్లు కట్టుకుని నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

మున్సిపల్ కార్మికుల వినూత్న నిరసన

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తొలగించిన మున్సిపల్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని దీక్షలు చేస్తున్న కార్మికులు శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఎదురు వినూత్నంగా నిరసన తెలిపారు. నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకుని తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు సోమయ్య మాట్లాడుతూ చిరు కార్మికులపై కక్షసాధింపులు ఆపాలన్నారు. ఈ కార్యక్రమంలో సుబ్బరాయుడు, హరి, షబ్బీర్, సుబ్బారెడ్డి, కనకయ్య, నాగేంద్ర, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.



డ్రైడే కార్యక్రమంలో పాల్గొన్న వైద్యసిబ్బంది

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

గిద్దలూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత వర్షాకాలంలో నీరు నిలువ ఉండకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్య సిబ్బంది పేర్కొన్నారు. పట్టణంలోని కోటగడ్డ సచివాలయం పరిధిలో డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత గురించి ప్రజలకు తెలియజేశారు. నిద్రించేటపుడు దోమతెరలు వాడుకోవాలని, జ్వరాలు వస్తే వెంటనే ఆరోగ్య కేంద్రానికి వెళ్లి పరీక్ష చేయించుకోవాలని సచివాలయ ఆరోగ్య కార్యదర్శి భాషాబీ సూచించారు.



డ్రైనేజీలను పరిశీలిస్తున్న కమిషనర్

మురుగు కాల్వల పరిశీలన

గిద్దలూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 5వ వార్డు పాండురంగారెడ్డి నగర్, సాయినగర్, డీఆర్ఆర్ అపార్ట్‌మెంట్ రోడ్డులోని డ్రైనేజీలను మున్సిపల్ కమిషనర్ వెంకటదాసు పరిశీలించారు. చిన్నపాటి వర్షం కురిసినా సక్రమంగా కాలువలు లేక మురుగు నీరంతా రోడ్డుపైకి వస్తున్నదని, పూర్తి స్థాయిలో కాలువలను నిర్మించాలని స్థానిక టీడీపీ నాయకులు పరుచూరి నాగేశ్వరరావు కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు.



ఆలయ ప్రదక్షిణలు చేస్తున్న మాగుంట రాఘవరెడ్డి

ఆలయాల్లో మాగుంట రాఘవరెడ్డి పూజలు

త్రిపురాంతకం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం త్రిపురాంతకేశ్వరస్వామి, బాలాత్రిపుర సుందరీదేవి అమ్మవార్ల ఆలయాల్లో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి కుమారుడు రాఘవరెడ్డి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రదక్షిణల అనంతరం త్రిపురాంతకేశ్వరస్వామికి మహాన్యాస పూర్వక అభిషేకం, చినమస్తాదేవికి పూజలు, బాలాత్రిపుర సుందరీదేవి అమ్మవారికి అర్చనలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు, అధికారులు రాఘవరెడ్డికి స్వామి, అమ్మవార్ల శేషవస్త్రాలను, తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. అనంతరం స్థానిక టీడీపీ నాయకులు రాఘవరెడ్డిని కలిసి సత్కరించారు.

స్టడీ మెటీరియల్ అందజేత

గిద్దలూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొదలకొండపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న 30 మంది విద్యా విద్యార్థులకు యశ్వంత్ ఎడ్యుకేషనల్ సొసైటీ గౌరవాధ్యక్షులు డాక్టర్ మొర్రి పిచ్చయ్య తన సొంత నిధులతో స్టడీమెటీరియల్ అందజేశారు.

ఎడతెరపిలేని వర్షం

నీటమునిగిన పొగాకు, పత్తి, మిర్చి
చెరువులను తలపిస్తున్న పొలాలు
ఉరకెత్తుతున్న పంటలు
ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు
స్తంభించిన రాకపోకలు
రహదారులు జలమయం
కన్నీటి పర్యంతం అవుతున్న రైతులు

తుఫాన్ అనంతరం డివిజన్‌లో ఎడతెరపిలేని వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం ఉదయం నుంచి కురిసిన భారీ వర్షానికి పంట పొలాలన్నీ చెరువులను తలపిస్తున్నాయి. మిర్చి, పొగాకు, పత్తి పంటలు దెబ్బతిన్నాయి. ప్రధానమైన గుండ్లకమ్మ, కొండవాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఆయా ప్రాంతాలలో చప్టాలపై నీరు ప్రవహించడంతో రాకపోకలు స్తంభించిపోయాయి. మార్కాపురం, కంభం, పెద్దారవీడు తదితర ప్రాంతాల్లో రహదారులు జలమయమయ్యాయి. పంటలన్నీ మునిగిపోవడంతో వాటిని రక్షించుకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికే వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టామని, రూపాయి కూడా చేతికొచ్చే పరిస్థితి లేదని అన్నదాతలు కన్నీటిపర్యంతమవుతున్నారు.



పెద్దారవీడు మండలం పుచ్చకాయలపల్లి వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపునీరు

పెద్దారవీడు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం ఉదయం నుంచి ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది. దీంతో పుచ్చకాయలపల్లి వద్ద నల్లమల అటవీ ప్రాంతం నుంచి వర్షపునీరు ఎక్కువగా రావడంతో రోడ్లపై ప్రవహించాయి. దీంతో వెలిగొండ ప్రాజెక్ట్ నిర్వాసిత గ్రామాలైన సుంకేసుల, కలనూతల, గుండంచర్లనుంచి మార్కాపురం పట్టణానికి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దేవరాజుగట్టు, హనుమాన్‌జంక్షన్ ప్రాంతాలలో వర్షపాతం ఎక్కువగా నమోదైయింది. దీంతో పొగాకు, పత్తి, మిరప తోటలలో వర్షపునీరు నిలబడింది. వర్షపునీటిని బయటకు పెట్టేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పెద్దారవీడులో మురుగుకాల్వలు ఏర్పాటు చేయకపోవడంతో గ్రామంలోని తూర్పుపల్లిలో వర్షపునీరు రోడ్డుపైనే నిలిచిపోయింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



తర్లుపాడులో చెరువును తలపిస్తున్న పంట పొలాలు

ఉధృతంగా గుండ్లకమ్మ

చప్టాపైనుంచి ప్రవాహం

మార్కాపురం రూరల్ : మండలంలో శుక్రవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి బొడిచెర్ల వద్ద గుండ్లకమ్మ నది ఉధృతంగా ప్రవహించింది. కొంతసేపు చప్టాపైనుంచి వరద నీరు పారింది. మార్కాపురం పరిసర ప్రాంతంతో పాటు బొడిచెర్ల గ్రామంలో సుమారు మూడు గంటల పాటు వర్షం దంచి కొట్టింది. దీంతో పంట పొలాల్లో వర్షపు నీరు నిలిచింది. రైతులు పొలాల్లో నిలిచిన వరద నీటిని బయటకు పంపిచేందుకు నానా అవస్థలు పడుతున్నారు. మండలంలోని కొన్ని ప్రాంతాలలో మిరప, పొగాకు, పత్తి పంటలలో వర్షపు నీరు నిలవడం వలన కొంత మేర పైరుకు నష్టం వాటిల్లుతుందని రైతులు తెలిపారు. మండలంలోని పలు గ్రామాలలో చెరువులకు వర్షపు నీరు చేరడంతో జలకళను సంతరించుకున్నాయి. గత కొంత కాలంగా వర్షాలు లేక భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. కొన్ని ప్రాంతాలలో బోర్ల నుంచి నీరు రాలేదు. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు చెరువులకు నీరు చేరడం వలన భూగర్భ జలాలు పెరుగుతాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పొంగుతున్న వాగులు..

రాకపోకలకు అంతరాయం

తర్లుపాడు : శుక్రవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపిలేకుండా భారీ వర్షం కురవటంతో వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. తర్లుపాడు నుంచి మార్కాపురం వెళ్లే రహదారిలో ఉన్న కొండవాగు, సీతానాగులవరం వద్ద ఉన్న వాగు, తుమ్మలచెరువులోని వాగులు ఉధృతంగా ప్రవహించాయి. భారీ వర్షాలకు పంట పొలాలు నీట మునిగాయి. తర్లుపాడు నుంచి మార్కాపురం వెళ్లే వాగులు ప్రవహించటంతో రెండు గంటల పాటు రాకపోకలకు అంతరాయం కలిగింది. ఉదయం 9 గంటలకు కొండవాగును దాటేందుకు కారు వెళ్తుండగా దాని వెనకాల రెండు స్కూల్ బస్సులు వెళ్తున్న సమయంలో కారు ఇరుక్కుని పోవటంతో స్కూల్ బస్‌లు కూడా వాగు మధ్యలో 10 నిమిషాలు నిలిచిపోవటంతో విద్యార్థులు భయంతో కేకలు వేశారు. కొంత మంది ప్రయాణికులు కారును నెట్టుకుంటూ వెళ్లడంతో బస్సులు బయటకు వెళ్లాయి. దీంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

పంటలకు అపార నష్టం

మండలంలో శుక్రవారం ఉదయం 2గంటల పాటు భారీ వర్షం కురవటంతో పంట పొలాలు చెరువులను తలపించాయి. మండలంలో ఖరీఫ్‌లో సాగుచేసిన మిరప, పొగాకు పంటలకు భారీ నష్టం వాటిల్లింది. వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు పొగాకు తోటలు ఉరకెత్తుతున్నాయి. మిరప తోటలు కూడా నీరు నిలిచిపోవడంతో ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయని రైతులు ఆందోళనకు గురవుతున్నారు. తర్లుపాడు, సీతానాగులవరం వద్ద పొలాలు అన్ని చెరువులను తలపిస్తున్నాయి.



సీతానాగులవరంలో నీటిలో మిరప పంట



వర్షాలకు దెబ్బతిన్న పొగాకు



పెద్దారవీడు మండలం దేవరాజుగట్టులో నీట మునిగిన పొగాకు తోట

రహదారులు జలమయం

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణంలో శుక్రవారం ఉదయం 6.30 నుంచి 7.30 గంటల వరకు భారీ వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని పలు ప్రాంతాలలో వర్షపు నీరు పెద్దఎత్తున నిలిచిపోయింది. అయ్యప్పస్వామి గుడి, దోర్నాల సెంటర్, మున్సిపల్ కార్యాలయం, ఆర్టీసీ బస్టాండ్, కంభం రోడ్ తదితర ప్రాంతాలలో వర్షపు నీరు నిలిచిపోయింది. దోర్నాల బస్టాండ్, అయ్యప్ప స్వామి గుడి, రీడింగ్ రూమ్ ప్రాంతాలలో అడుగుమేర వర్షపు నీరు నిలిచిపోవటంతో పాదచారులు, వాహనదారులు ఇక్కట్లు పడ్డారు. పట్టణంలోని ప్రధాన కాలువలన్నీ ఆక్ర[illegible] గురికావడంతో ఈ దుస్థితి ఏర్పడింది.



మెయిన్ బజార్‌లో రోడ్లపైకి ప్రవహిస్తున్న మురుగునీరు

పొదిలిలో..

పొదిలి : ఎడతెరిపి లేని వర్షంతో పట్టణంలోని పలు రహదారులు జలమయమయ్యాయి. విశ్వనాథపురంలో ఎంపీడీవో కార్యాలయం, ఆంజనేయస్వామి దేవాలయం, విద్యుత్‌సబ్ స్టేషన్‌కు వెళ్లే రహదారి, ఆర్టీసీడిపో సెంటర్‌గేట్, పాతపోస్టాఫీస్, పాతపంచాయతీ కార్యాలయం తదితర ప్రాంతాల్లో వర్షపునీరు నిల్వఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అదే విధంగా రహదారుల వెడల్పు ప్రక్రియలో భాగంగా ఇరువైపుల మట్టితీయడం, అదే సమయంలో వర్షాలు నాలుగురోజులుగా పడటంతో ఎక్కడినీరు అక్కడే నిల్వఉండి కుంటలను తలపించాయి.



పొదిలి ఆంజనేయస్వామి దేవాలయం సమీపంలో ఓ వీధిలో ఇలా..



మార్కాపురం అయ్యప్ప స్వామి గుడి వీధిలో నిలిచిన వర్షపు నీరు



జగనన్న కాలనీలో నిలిచిన వర్షపు నీరు



బేస్తవారపేట మండలం సోమవారపేట గ్రామంలో వర్షాలకు నాని కూలిపోయిన పెంకుటిల్లు

కూలిన ఇల్లు - తృటిలో తప్పిన ప్రమాదం

బేస్తవారపేట,అక్టోబరు18(ఆంధ్రజ్యోతి):బేస్తవారపేట మండలంలోని సోమవారపేట గ్రామంలో కొంపల వెంకటరత్నమ్మ అనే వృద్ధురాలు నివశిస్తున్న పెంకుటిల్లు కూలిపోయింది. గత కొన్ని రోజులుగా కురిసిన వర్షాలకు గోడలు నాని గురువారం రాత్రి సమయంలో కూలిపోవడంతో అప్రమత్తమైన వెంకటరత్నమ్మ బయటకు పరుగులు తీసింది. దీంతో తృటిలో ప్రమాదం తప్పింది. అలాగే కారెపోతుల రంగారావు కాంపౌండ్ వాల్ పడిపోయింది సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ జితేంద్ర సంఘటనా స్థలానికి చేరుకొని కూలిన ఇంటిని పరిశీలించారు. ఈకార్యక్రమంలో వీఆర్వో ఇండ్లా శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభ్యసన లోపాలను ప్రారంభదశలోనే గుర్తించాలి

పొదిలి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జ్ఞాపకశక్తి తక్కువగా ఉన్న విద్యార్థుల్లో అభ్యసన లోపాలను ప్రారంభ దశలోనే గుర్తించాలని సర్వశిక్షా అభియాన్ ఏఎంవో (అకడమిక్ మానిటర్ ఆఫీసర్), ఐఈడీ కోఆర్డినేటర్ రమేష్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన డిస్‌లెక్సియాపై అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎంఈవోలు శ్రీనివాసరెడ్డి, నాగలక్ష్మి, ప్రధానోపాధ్యాయురాలు కరీమున్‌బీబీ, సీఆర్పీలు సుబ్బారెడ్డి, కిరణ్మయి, ఆచారి, బీవీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిక్స్‌లెక్సియాపై అవగాహన ర్యాలీ

కంభం : పిల్లల భాషణ (ఉచ్చరణ) వైకల్యాలపై అప్రమత్తంగా ఉండాలని, వారిని అర్థం చేసుకుని అండగా నిలువాలని ఎంఈవో డి.మాల్యాద్రి తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం డిక్స్‌లెక్సియా అవేర్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కందులాపురం సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయురాలు నూర్జహాన్, సీఆర్పీలు మురళీమోహన్, ఉపాధ్యాయులు సుహాసిని, ఈశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

మునగాకుతో లాభాలపై అవగాహన

కంభం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : కంభం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం మునగాకుతో వంటకాలు తయారు చేసి తల్లులకు, బాలింతలకు, గర్భిణులకు అవగాహన కల్పించారు. మునగాకులో ఉండే పోషకాల గురించి వివరించారు. మునగాకుతో 300 రకాల రోగాలను అరికట్టవచ్చన్నారు. క్యాన్సర్లను తగ్గించే శక్తి మునగాకుకు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల సూపర్‌వైజర్ చెంచులక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి ప్రతి ఒకరూ సహకరించాలి

ఎర్రగొండపాలెం(పుల్లలచెరువు),అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీపీ డి. కిరణ్‌గౌడ్ అన్నారు.శుక్రవారం ఎర్రగొండపాలెం మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు.ఎంపీడీవో బండారు శ్రీనివాసులు మాట్లాడుతూ మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా కోట్ల రూపాయలతో పల్లెపండుగ ద్వారా సీసీ రోడ్లకు శంకుస్థాపనలు జరుగుతున్నాయని అన్నారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు మందుల ఆదిశేషు, గంజివారిపల్లె సర్పంచి సుబ్బారెడ్డి మాట్లాడగా డీటీ మల్లికార్జున నాయుడు,ఈవోఆర్డీ రాజశేఖరరెడ్డి,పీఆర్ఏఈ రవీంద్రరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ఘాట్ రోడ్డులో ప్రమాదం

నలుగురికి గాయాలు

పెద్దదోర్నాల, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి):ఎదురెదురుగా ప్రయాణిస్తున్న లారీ, మినీ లారీఢీ కొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలు కాగా, ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటన నల్లమల అటవీ ప్రాంతంలో మండలంలోని మోట్ల సమీపంలో మూలమలుపు వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. రెండు వాహనాల్లోని డ్రైవర్లకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం దోర్నాల నుంచి కర్నూలు వైపు లారీ వెళ్తుండగా మోట్ల సమీపంలో మూలమలుపు వద్ద కర్నూలు వైపు నుంచి శ్రీశైలం వెళ్తున్న మినీ లారీ అదుపు తప్పి వేగంగా ఢీ కొంది. దీంతో మినీ లారీలో ప్రయాణిస్తున్న కర్నూలుకు చెందిన మద్దిలేటికి కాలు, చేయికి తీవ్ర గాయాలు కాగా మారెప్ప, పరశురామ్, శేఖర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన కొందరు 108కి సమాచారమివ్వడంతో అంబులెన్స్ వాహనంలో క్షతగాత్రులను దోర్నాల వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్సలు నిర్వహించారు. బాధితుల ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



ప్రమాదంలో దెబ్బతిన్న మినీ లారీ

విద్యుత్ సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలి

పలు చోట్ల సీపీఎం ధర్నాలు

గిద్దలూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ కూటమి ప్రభుత్వం వెంటనే విద్యుత్ సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని ట్రాన్స్‌కో ఏడీ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ప్రజలు అనేక రకాల సమస్యలతో సతమత మవుతుండగా విద్యుత్ సర్దుబాటు చార్జీలను వేయడం ద్వారా పేదలు విద్యుత్ సౌకర్యానికి నోచుకోని పరిస్థితి నెలకొంటుందన్నారు. అనంతరం ట్రాన్స్‌కో అధికారులను కలిసి వినతి పత్రం అందజేశారు.

మార్కాపురంలో..

మార్కాపురం వన్‌టౌన్ : పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని సీపీఎం జిల్లా నాయకులు గుమ్మ బాలనాగయ్య అన్నారు. స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సీపీఎం నాయకులు రాజు, నన్నేసా, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కంభంలో..

కంభం : అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని, ప్రజలపై భారం వేయమని చెప్పి అధికారంలోకి వచ్చిన తరువాత తగ్గించకపోగా భారాలను పెంచుకుంటూ పోతున్నదని సీపీఎం మండల నాయకులు షేక్ అన్వర్ ఆరోపించారు. ఎప్పుడో కొన్న విద్యుత్‌కు ఇప్పుడు చార్జీలు వసూలు చేయడం సరైంది కాదని అన్నారు. ఈ మేరకు శుక్రవారం కంభం విద్యుత్ ఏఈ నరసయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు.



మార్కాపురంలో ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

న్యూస్ బాక్స్

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజలు

ముండ్లమూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈదర, బొప్పూడివారిపాలెం, ఉమామహేశ్వర అగ్రహారం, పసుపుగల్లు, పెదఉల్లగల్లు గ్రామాల్లో జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్లకు శుక్రవారం ఎంపీడీవో ఆర్.జనార్దన్ భూమి పూజచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి నెలాఖరు కల్లా ఆయా గ్రామాల్లో పనులను పూర్తి చేయాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో పద్మ, ఏపీవో నాగరాజు, పంచాయతీ రాజ్ ఏఈ ఎం.వెంకటేశ్వర్లు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు వందల పద్మావతి, వేముల పద్మావతి, జనమాల నాగేంద్రం, తదితరులు పాల్గొన్నారు.

పామూరులో ఏర్పాట్ల పరిశీలన

పామూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక విరాట్‌నగర్ కాలనీలో ఉపాధి హామీ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణానికి సంబంధించిన శిలాఫలకం నిర్మాణ పనులను ఎంపీడీవో బి.సురేష్ శుక్రవారం పరిశీలించారు. పట్టణంలో 23 సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర రూ.5 కోట్ల ఉపాధి నిధులు కేటాయించారని తెలిపారు. విరాట్‌నగర్ కాలనీలో శనివారం ప్రారంభించనున్న రోడ్ల నిర్మాణ పనులకు సంబంధించిన శిలాఫలక ఆవిష్కరణ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఉగ్ర పాల్గొంటున్నట్లు చెప్పారు.

వీధి కుక్కల పట్టివేత

కురిచేడు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కురిచేడు ప్రజలకు వీధికుక్కల బెడద తప్పింది. ఇటీవల వీధికుక్కల స్వైరవిహారం శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఎంపీడీవోతో మాట్లాడారు. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న వీధి కుక్కలను పట్టుకొని దూరంగా వదిలి వేయాలన్నారు. దీంతో ఎంపీడీవో పంచాయతీ కార్యదర్శి చాంద్‌బీకి సూచించారు. శుక్రవారం ఆమె కందుకూరు నుంచి కుక్కలు పట్టేవారిని పిలిపించి గ్రామంలో తిరుగుతూ కుక్కలను పట్టించారు. శుక్రవారం 95 కుక్కలను పట్టుకున్నారు. వాటిని రాత్రికి దోర్నాల సమీపంలోని అడవిలో వదిలివేస్తున్నట్లు చెప్పారు. శనివారం సైతం గ్రామంలో తిరుగుతూ కుక్కలను పట్టుకొని అడవిలో వదిలివేస్తామని ఆమె పేర్కొన్నారు.

కాంట్రాక్టు లెక్చరర్ల నిరసన

దొనకొండ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో నిలిచిపోయిన కాంటాక్టు లెక్చరర్ల రెగ్యులైజేసన్ ప్రక్రియను తిరిగి పునఃప్రారంభించాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజి కాంటాక్టు లెక్చరర్లు నిరసన తెలుపుతూ విధులు నిర్వహించారు. జీవో నెం.114ను అమలు చేయాలని కోరారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిరసన తెలుపుతూ విధులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకోకుంటే, దశలవారీ నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని కాంట్రాక్టు లెక్చరర్లు షేక్ ఖాదర్, సుందర్, బ్రహ్మం నాయక్, ఆశీర్వాదం పేర్కొన్నారు.

మద్యం షాపులు మార్చాలి

కనిగిరి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మద్యం షాపులను మార్చాలని కోరుతూ శుక్రవారం కనకపట్టణం ప్రాంతానికి చెందిన మహిళలు ఆర్టీసి డిపో వద్ద నిరసన తెలిపారు. ఇటీవల మద్యం టెండర్లలో షాపులను దక్కించుకున్న టెండరుదారులు గురువారం ఆ ప్రాంతంలో షాపులను ప్రారంభించారు. డిపో డౌన్‌లో రెండు మద్యం షాపులతో పాటు రెస్టారెంట్‌లు, లాడ్జీలు ఒకే ప్రదేశంలో ప్రధాన రోడ్డు వెంట ఉన్నాయి. రోడ్డుపై నుంచి కనకపట్టణంలోని నివాసాలకు వెళ్ళే ప్రజలకు ఇబ్బంది కల్గించే మద్యం షాపులను మార్చి వేయాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలికి వచ్చి నిరసనకారులతో మాట్లాడి వ్రాతపూర్వకంగా ఇవ్వాలని కోరటంతో వెనుదిరిగారు. మద్యం షాపు ఏర్పాటులో నిబంధనలను పరిశీలించి సంబంధిత ఎక్సైజ్ శాఖకు పంపుతామని సీఐ తెలిపారు.

అధ్వానంగా రహదారులు

- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

పామూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పామూరు పట్టణంలో ప్రధాన రహదారులు అధ్వానంగా ఉన్నాయి. మరమ్మతు పనులు చేపట్టకపోవడంతో వర్షాలకు రోడ్లపై గుంతలు ఏర్పడి నీరు నిలబడుతుంది. ప్రధానంగా పామూరు నుంచి కందుకూరు రోడ్డులోగల సునీత నర్సింగ్ హోం సమీపంలో తారురోడ్డుపై వర్షపు నీరు నిలబడి గుంతలు పడ్డాయి. ఈ గుంతల్లో నీరుచేరి వాహనాలు వెళ్లేటప్పుడు పాదచారులపై పడుతుండటంతో అసౌకర్యానికి గురవుతున్నారు. అలాగే, నుచ్చుపొద గ్రామం వరకు తారు రోడ్డుకు ఇరువైపులా మార్జిన్‌లు గుంతలమయమై ప్రమాదాలకు నిలయంగా మారాయి. సింగిల్ రోడ్డు కావడంతో ఎదురెదురుగా వాహనాల వచ్చినప్పుడు ప్రయాణికుల పాట్లు వర్ణణాతీతంగా ఉన్నాయి.

స్థానిక సీఎస్‌పురం రోడ్డులోగల విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద రోడ్డు మరమ్మతు పనులు చేపట్టకపోవడంతో గుంతలు పడ్డాయి. గత వైసీపీ ప్రభుత్వంలో తట్ట మట్టి పోసిన పాపానపోలేదు. ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్లన్నీ ఛిద్రంగా తయారయ్యాయి. కనీసం గుంతలు పడ్డచోట్ల మరమ్మతు పనులు చేపట్టాలని మండల సమావేశాల్లో సభ్యులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన సందర్భాలు ఉన్నాయి. సంబంధిత అధికారులు పట్టించుకున్న ధాఖలాలు లేవు.

ఇదిలాఉండగా, సింగరాయకొండ - మైదుకూరు జాతీయ రహదారి 167-బి రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అందులోభాగమైన కందుకూరు రోడ్డు, సీఎస్‌పురం రోడ్లు ఆర్‌అండ్‌బి శాఖ పరిధిలో లేవని సంబంధిత అధికారులు తెలిపారు. జాతీయ రహదారుల నిర్మాణ పనులు పూర్తయిన తరువాత కాంట్రాక్టర్లు అంచనావేసిన అనంతరం టెండర్లు పిలిచి పట్టణ పరదిలో తారు రోడ్డు నిర్మాణ పనులు చేపడతారని వారు తెలిపారు. ఈలోగా దెబ్బతిన్న చోట్ల మరమ్మతు పనులు చేపట్టి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


సీఎస్‌పురం రోడ్డులో మరమ్మతులకు నోచుకోని రోడ్డు


కందుకూరు మార్గంలో దెబ్బతిన్న రోడ్డు

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్

- ఈఈ శ్రీనివాసులు

ముండ్లమూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తామని దర్శి సబ్‌డివిజన్ ఈఈ పి.శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం స్థానిక సబ్‌స్టేషన్‌ను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ సమస్యపై వినియోగదారులు ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించి పరిష్కరించాలన్నారు. లేకుంటే సిబ్బందిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున శిథిలావస్థలో ఉన్న విద్యుత్ స్తంభాలు పడిపోయి ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. ముందుగానే గుర్తించినట్లయితే వెంటనే మారుస్తామని చెప్పారు. ఇళ్ళ మీదుగా విద్యుత్ లైన్‌లు వెళుతుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి లైన్‌ను మారుస్తామని చెప్పారు.

మారెళ్ళ, శంకరాపురం, ఈదర, ముండ్లమూరు సబ్‌స్టేషన్‌ల పరిధిలో లోవోల్టేజీ సమస్య ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఈ సమస్య ఉన్నట్లయితే సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫారాలు ఏర్పాటుచేస్తామని చెప్పారు. విద్యుత్ స్తంభాలకు అల్లుకుపోయిన చిల్లచెట్లను తొలగించాలన్నారు. వీటిద్వారా తరుచూ విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందన్నారు. పెండింగ్ విద్యుత్ బకాయిలను త్వరితగతిన వసూలు చేయాలన్నారు. సోలార్ విద్యుత్‌పై రైతులు, వినియోగదారులకు అవగాహన కల్పించాలన్నారు.

సమావేశంలో ఏడీఈ కె.పిచ్చయ్య ఏడీ సత్యనారాయణ, ఏఈ మురళీమోహన్, ఇన్‌చార్జ్ ఏఈ అంకబాబు, తదితరులు పాల్గొన్నారు.


సిబ్బందికి సూచనలు చేస్తున్న ఈఈ శ్రీనివాసులు

అపరిశుభ్రంగా ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణం

- అమలుకు నోచుకోని స్వచ్ఛ భారత్, స్వచ్ఛతే సేవ

దర్శి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛ భారత్ కోసం ఎంతగానో పనిచేస్తున్నప్పటికి స్థానిక అధికారులు విస్మరిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లోనూ పారిశుద్య కార్యక్రమాలకు తిలోదకాలు ఇస్తున్నారు. అనేక ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాలు పిచ్చి మొక్కలు దట్టంగా పెరిగి ఇబ్బందిగా మారాయి. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నాలుగు ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. దివ్యాంగుల పాఠశాల కూడా వుంది. ఆవరణలో ఉన్న ఖాళీ ప్రదేశంలో పిచ్చి చెట్లు దట్టంగా పెరిగాయి. మధ్యలో కూలేందుకు సిద్ధంగా ఉన్న ఎమ్మార్సీ భవనం తొలగింపు గురించి పట్టించుకోవడంలేదు. ఈ ప్రాంతంలో విషపు పురుగులు సంచరిస్తున్నాయి. అక్కడ మండల పరిషత్, వ్యవసాయశాఖ, విద్యాశాఖ, గృహనిర్మాణ శాఖ కార్యాలయాలతో పాటు దివ్యాంగుల పాఠశాల కూడా ఉంది. అయినప్పటికీ పారిశుధ్య కార్యక్రమాల గురించి ఎవరూ పట్టించుకోవడంలేదు. పిచ్చి మొక్కల్లోకి వచ్చే విషపు పురుగులు పాఠశాలలోకి చొరబడి చిన్నారులకు హానీ కల్గిస్తాయిని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి పిచ్చి చెట్లను తొలగించి ప్రభుత్వ కార్యాలయాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


దర్శి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో దట్టంగా పెరిగిన చిల్లచెట్లు

సర్దుబాటు పేరుతో వినియోగదారులపై మోయలేని భారం

- సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ ధ్వజం
- విద్యుత్ సబ్‌స్టేషన్‌ల వద్ద నిరసన


దర్శి విద్యుత్‌డివిజన్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

పామూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సర్దుబాటు ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజలపై అదనపు భారాలు మోపడం సరికాదని సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ అన్నారు. విద్యుత్ సర్దుబాటు పేరుతో ప్రజలపై రూ. 20 వేల కోట్లమేర ప్రజలపై భారాలు మోపటాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం స్థానిక సబ్‌స్టేషన్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బాదుడే బాదుడు పేరుతో వైసీపీ ప్రభుత్వాన్ని నిందించిన కూటమి నేతలు తాము అధికారంలోకి రాగానే ధరలు తగ్గిస్తాం, నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తామని ప్రకటించారని చెప్పారు. అధికారంలోకి వచ్చినతర్వాత కేంద్ర ప్రభుత్వం చెప్పినట్లు వింటూ విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో 2022-23 సంవత్సరానికి రూ.8,113 కోట్లు, 2023-24 సంవత్సరానికి మరో రూ. 11 కోట్లు మొత్తం రూ.20 వేల కోట్లు భారం మోపడానికి ప్రభుత్వం సిద్ధమవుతుందని చెప్పారు. ఈనిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. గృహ అవసరాలకు ఏర్పాటుచేసుకొనే మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్లు పెట్టడం దోపిడీ చేయడానికేనని ఆయన ధ్వజమెత్తారు. అనంతరం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కె.మాల్యాద్రి, వార్డు మెంబర్ షేక్ మస్తాన్, సీహెచ్ వెంకటేశ్వర్లు, షేక్ అల్లాభక్ష్, కె.శంకర్, శ్రీను, మదారమ్మ, అంజలి, ఖాదర్ ఉన్నీసా పాల్గొన్నారు.

కాగా సీఎస్‌పురంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద జరిగిన ఆందోళన కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఊసా వెంకటేశ్వర్లు మాట్లాడారు. అనంతరం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏసురత్నం, అజీద్‌బాషా, వెంకటేశ్వర్లు, జేసురత్నం, యేసుదాసు, తదితరులు పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన పాలకులు

దర్శి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వినియోగదారులకు విద్యుత్ సర్దుబాటు చార్జీలు భారం కాకుండా తొలగించాలని సీపీఎం నియోజకవర్గ కార్యదర్శి టి.రంగారావు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక విద్యుత్ డివిజన్ కార్యాలయం వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ట్రూఆఫ్ సర్‌చార్జీలు తగ్గిస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. ఆ హామీని విస్మరించి సర్దుబాటు చార్జీల కింద రూ.19 వేల కోట్లు ప్రజలపై పెనుభారం మోపేందుకు సిద్ధమయ్యారన్నారు. ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తూ వైసీపీ ప్రభుత్వం ఏగతి పట్టిందో గుర్తు చేసుకోవాలని హెచ్చరించారు. వెంటనే ఆనిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సందు వెంకటేశ్వరరావు, యు.నారాయణ, ఈ. నాగేశ్వరరావు, గర్నెపూడి జాన్‌శ్యామ్యేల్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ముండ్లమూరు సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలి

ముండ్లమూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సర్దుబాటు చార్జీలను వెంటనే రద్దు చేయాలని సీపీఎం నాయకుడు వెల్లంపల్లి అంజనేయులు డిమాండ్ చేశారు. ట్రూఆఫ్ సర్దు బాటు చార్జీల వసూలును నిలిపివేయాలన్నారు. శుక్రవారం ముండ్లమూరులో విద్యుత్ సబ్ స్టేషన్‌వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎప్పుడో విద్యుత్ కొనుగోలు చేసి ఇప్పుడు సర్దుబాటు చార్జీలని వినియోగదారుల నెత్తిన మోపటం తగదన్నారు. అనంతరం ఈఈ పి.శ్రీనివాసులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బోడపాటి హనుమంతరావు, గంగినేని సత్యనారాయణ, నన్నం రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వతీరు గర్హనీయం

కనిగిరి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి పీసీ కేశవరావు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక విద్యుత్ డీఈ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు చంద్రబాబు విద్యుత్ సర్దుబాటు పేరుతో ప్రజలపై రూ.20 వేల కోట్లు భారం మోపటం దుర్మార్గమన్నారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు అన్యాయమని అప్పటి వైసీపీ ప్రభుత్వంపై విమర్శలు చేశారన్నారు. అధికారంలోకి వచ్చినతర్వాత చంద్రబాబు వైసీపీ ప్రభుత్వ పద్ధతినే అవలంబించం అన్యాయమన్నారు. స్మార్ట్ మీటర్లు ఉపసంహరించుకోవాలని, ట్రూఆఫ్ చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా సీపీఎం ఆందోళనకు సిద్ధమవుతుందని హెచ్చరించారు.

కార్యక్రమంలో సీపీఎం నాయకులు బషీరా, కాశయ్య, నరేంద్ర, ఏడుకొండలు, శాంతకుమారి, నారాయణ, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ ధ్యేయం

- ఎంపీడీవో సుందరరామయ్య

తాళ్లూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీడీవో కె.సుందరరామయ్య అన్నారు. మండలంలోని తాళ్లూరు, మల్కాపురం గ్రామాల్లో శుక్రవారం జరిగిన పల్లెపండుగ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు, సీసీ రోడ్లనిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. గ్రామాల్లో ప్రాధాన్యతాక్రమంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఆయా గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలకు భూమి పూజలు చేశారు.

కార్యక్రమాల్లో సర్పంచ్‌లు చార్లెస్ సర్జన్, కాలేషావలి, టీడీపీ యువనాయకుడు ఐ.శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్ కాశీంసైదా, పంచాయతీ కార్యదర్శి ఐవీ రమణారెడ్డి, ఏపీవో మురళి, ఈసీ ప్రసాద్, టీడీపీ గ్రామ అధ్యక్షుడు మారం వెంకటరెడ్డి, నాదెండ్ల శ్రీను, ఫీల్డ్ అసిస్టెంట్లు బాలకోటయ్య, శాంసన్, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.


తాళ్లూరులో సీసీరోడ్ల నిర్మాణానికి భూమి పూజచేస్తున్న ఎంపీడీవో సుందరరామయ్య


గుంటుపల్లిలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న అధికారులు, నాయకులు

పల్లె ప్రగతే ప్రభుత్వ లక్ష్యం

పీసీపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల్లో పల్లెలు అభివృద్ధి చెందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీవో ప్రభాకరశర్మ అన్నారు. పల్లె పండుగ వారోత్సవంలో భాగంగా శుక్రవారం మండలంలోని గుంటుపల్లి, లక్ష్మక్కపల్లి, తలకొండపాడు గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఆయా గ్రామాల్లో ప్రజల నుద్దేశించి ఆయన మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందని అన్నారు. అందులో భాగంగానే రాష్ట్రప్రభుత్వం పల్లెల అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా తొలి ప్రాధాన్యతగా గ్రామాల్లో అంతర్గత రోడ్లలో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. మండలంలో తొలి ప్రాధాన్యతాక్రమంలో భాగంగా ఇప్పటికే రూ.3 కోట్ల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు మంజూరయ్యాయన్నారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ తిరుపాలయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు వేమూరి రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

కురిచేడులో భారీ వర్షం


మిర్చిలో నిలిచిన వర్షపు నీరు

కురిచేడు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కురిచేడులో శుక్రవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి విడతల వారీగా వర్షం పడింది. పత్తి, మిరప, పొగాకు చేలల్లో వర్షపు నీరు నిలిచింది. పొలాల్లో వర్షపు నీరు నిలబడకుండా రైతులు కాలువల నిర్మాణం చేశారు. ఇప్పటివరకు పెద్దగా నష్టం ఉండదని, మరలా వర్షం కురిస్తే మెట్ట పంటలు దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ప్రత్యేకావసరాల పిల్లలపై శ్రద్ధ చూపాలి



ర్యాలీలో పాల్గొన్న ఎంఈవోలు

పీసీపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నిర్దిష్ట అభ్యాస వైకల్యాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మండల విద్యాశాఖాధికారి ఆర్.శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం పీసీపల్లిలో జరిగిన అవగాహన ర్యాలీలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల్లో వారి పురోభివృద్ధిపై తల్లిదండ్రులతోపాటు ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనపరచాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో1 సంజీవిని, జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం అంజనేయులు, ఐఈఆర్పీలు నాగేశ్వరరావు, శ్వేషిక తదితరులు పాల్గొన్నారు.

తాళ్లూరులో..

తాళ్లూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో భవిత కేంద్రం, ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రపంచ డేస్లెక్సియా వారోత్సవం సందర్భంగా శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈవో జి.సుబ్బయ్య మాట్లాడుతూ నిర్దిష్ట అభ్యాసన వైకల్యాలపై అవగాహన కల్గించమే మార్గమని తెలిపారు ముందుగా వీకే ఉన్నత పాఠశాల నుంచి విద్యార్థినీ విద్యార్థులు ర్యాలీగా బస్టాండ్ సెంటర్‌కు చేరుకున్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు, జి.సుబ్బయ్య, ఎల్.సుధాకర్‌రావు, హెచ్.ఎంశేషగిరి, తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన


వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న శంకర కంటి ఆసుపత్రి వైద్యులు

కనిగిరి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జననీ చారిటబుల్ ట్రస్ట్, శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి సహకారంతో నిర్వహించిన మెగా ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో శుక్రవారం నిర్వహించిన వైద్య శిభిరంలో కంటి సంబంధ బాధితులకు డాక్టర్ బిపిన్ పరీక్షలు నిర్వహించారు. 74 మంది వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించగా, వారిలో 59 మందికి ఆపరేషన్లు అవసరంగా వైద్యులు ధ్రువీకరించి ఎంపికచేశారు. ఆపరేషన్‌కు ఎంపికైన వారిలో మొదటి విడతగా 14 మందిని, ఈనెల 20న మరో 45మందిని ప్రత్యేక వాహనాల్లో గుంటూరు శంకర కంటి ఆసుపత్రికి తరలించనున్నట్లు తెలిపారు. గత నెలలో కంటి ఆపరేషన్లు చేయించుకున్న వారికి పరీక్షలు చేసి ఉచితంగా కళ్ళద్దాలు , చుక్కల మందు అందజేశారు. కార్యక్రమంలో నాగబాబు, దొరసాని, తులసి, షేక్ షరీఫ్ తదితరలు పాల్గొన్నారు.

గుండెపోటుతో పీఆర్ డీఈ ఆదిశేషు మృతి


ఆదిశేషు(ఫైల్)

కనిగిరి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కనిగిరి నుంచి దర్శి పంచాయతీరాజ్ డీఈగా ఇటీవల బదిలీపై వెళ్ళిన ఆదిశేషు గుండెపోటుతో మృతిచెందారు. బదిలీపై వెళ్ళిన డీఈ రోజూ దర్శి నుంచి కనిగిరికి వస్తుంటారు. ఈక్రమంలో దర్శిలో విధులు ముగించుకొని శుక్రవారం సాయంత్రం బస్సులో వస్తున్నారు. కనిగిరికి సమీపంలోకి వచ్చేసరికి గుండెపోటు రావడంతో స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స అందిస్తుండగా మృతి చెందారు. ఆదిశేషు అకాలమరణం కనిగిరిలోని ఆయన బంధువులు, స్నేహితులు, సహచర ఉద్యోగుల్లో విషాదాన్ని నింపింది.

కనిగిరి నియోజకవర్గంలో గత 30 ఏళ్ళుగా ఆయన విధులు నిర్వహించారు. పంచాయతీరాజ్‌శాఖలో వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా, ఏఈగా, డీఈగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించారు. డీఈ ఆదిశేషు పదవీ విరమణకు సమీపంలో ఉండగా, మానసిక ఒత్తిడే మృతికి కారణమని ఆయన సహచరులు పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



- బడుల్లో మెరుగైన పరిశుభ్రతకు ప్రణాళిక
- ప్రత్యేకంగా యాప్, ప్రతి కమిటీకి గుర్తింపు సంఖ్య
- ప్రతి బుధ, శుక్రవారాల్లో కమిటీ సభ్యులు పనుల పరిశీలన
- మరుగుదొడ్ల మరమ్మతులకూ సత్వర పరిష్కారాలు

పారిశుధ్యం.. స్కూల్ మేనేజ్‌మెంట్లకే



మున్సిపల్ స్కూల్

బాపట్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పరిసరాల్లో చెత్తాచెదారాలు.. మరుగుదొడ్లలో దుర్వాసన.. అపరిశుభ్రత.. ఇదీ కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పరిస్థితి. అధ్వాన పారిశుధ్యం మధ్యే విద్యార్థులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉండాలి. ఈ పరిస్థితుల నుంచి విద్యార్థులకు ఉపశమనం కలిగించేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. బడుల్లో పారిశుధ్యం మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేసింది. ఇప్పటి దాకా ఉపాధ్యాయులకు భారంగా మారిన పాఠశాలల పారిశుధ్య బాధ్యత ఇక యాజమాన్య కమిటీలకు అప్పగించింది. ఇందుకోసం ప్రత్యేకంగా ఓ యాప్‌ను రూపొందించింది. ప్రతీ పాఠశాలకు ఒక గుర్తింపు సంఖ్యను కేటాయిస్తారు. జిల్లాలోని ఆయా పాఠశాలల్లో పరిసరాలు, మరుగుదొడ్ల పరిశుభ్రతను ఇప్పటి వరకు ఉపాధ్యాయులు పర్యవేక్షించారు. ప్రత్యేకంగా యాప్‌ను రూపొందించి అందులో రోజుకు మూడుసార్లు మరుగుదొడ్ల ఫొటోలు అప్‌లోడు చేయాలని గత వైసీపీ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసి ఐదేళ్లు అమలు చేసింది. దీనిపై రాష్ట్రం వ్యాప్తంగా ఉపాధ్యాయులు తీవ్ర నిరసన వ్యక్తం చేసినా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. అంతేకాకుండా గత ప్రభుత్వం పాఠశాలల యాజమాన్య కమిటీలను రద్దు చేసి తల్లిదండ్రుల పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ కమిటీలు నెలవారీ జరిగే సమావేశాల్లో పాల్గొని తీర్మానాలపై సంతకాలు చేయడం, ఉత్సవ విగ్రహాల్లా ఉండటం మినహా ఎటువంటి అధికారాలు, బాధ్యతలు ఉండేవికావు. ఈ నేపథ్యంలో ఇటీవల అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం యాజమాన్య కమిటీలను పునరుద్ధరించింది. ఇటీవల పాఠశాలల వారీగా ఎన్నికలు నిర్వహించి నూతన కమిటీలను కూడా ఏర్పాటు చేసింది. అంతేకాకుండా ఈ కమిటీలకు కొన్ని బాధ్యతల్ని అప్పగించడానికి కార్యాచరణ సిద్ధం చేసింది. ఇందులో భాగంగా ప్రతి బుధ, శుక్రవారాల్లో కమిటీ సభ్యులు పాఠశాలకు వచ్చి మరుగుదొడ్లు, ఇతర పారిశుధ్యం తదితరాలకు సంబంధించిన పనులను ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఇందుకోసం ప్రత్యేకంగా ఒక్కో కమిటీకి ప్రత్యేక ఐడీ, పాస్‌వర్డ్ కేటాయించింది. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి యాప్‌లో పారిశుధ్య నిర్వహణ ఫొటోలు అప్‌లోడు చేసేలా ఏర్పాట్లు చేయనున్నారు. ఎక్కడైనా మరుగుదొడ్ల మరమ్మతులు, ఇతర సమస్యలు ఉంటే వెంటనే ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులకు నివేదించి సమస్యను పరిష్కరించేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

ఊరే వృద్ధాశ్రమం





సందడి లేని అన్నవరం గ్రామం



8

- ఉద్యోగాల కోసం పిల్లలు వలస
- అక్కడ ఇమడలేక.. ఇక్కడ ఉండలేక
- గ్రామాల్లో ఒంటరిగా పండుటాకులు

పాపం పండుటాకులు.. పలకరించేవారు లేరు. బాగోగులు చూసేవారు లేరు. తిన్నావా అని అడిగేవారు లేరు. కొన్నిళ్లల్లో వృద్ధ జంటలు. మరి కొన్నిళ్లలో ఒంటరి మహిళలు.. ఒంటరి పురుషులు. కావాల్సినంత డబ్బు. సకల సౌకర్యాలు. మంచిమంచి భవనాలు. అన్నీ ఉన్నా.. దిగాలు. ఇదీ గ్రామాల్లోని పరిస్థితి. ఆర్థిక స్తోమత లేకపోయినా పిల్లల్ని బాగాచదవించి.. రెక్కల కష్టంతో అమెరికా పంపి వారు ఉన్నతంగా స్థిరపడేలా చేశారు. దూరతీరాల్లో ఆర్థికంగా ఎదిగిన పిల్లల్ని చూసి సంబరపడ్డారు. అయితే ఇంతవరకు బాగున్నా.. వృద్ధాప్యంలో తమ పరిస్థితి తలచుకుని కన్నీటి పర్యంతమవుతున్నారు. పిల్లల దగ్గరకు వెళ్లి ఉండలేక.. ఇక్కడ ఒంటరిగా ఉండలేక.. అనేకమంది వృద్ధులు సతమతమవుతున్నారు. తమ పిల్లలు గురించి గొప్పలు చెప్పుకున్న వారే.. ఇప్పుడు తమ పరిస్థితి మరెవ్వరికీ రాకుడదని మొక్కుకుంటున్నారు. రెక్కలు వచ్చిన పిల్లలు దూర ప్రాంతాలకు ఎగిరిపోగా వృద్ధులతో నిండిపోయిన ఇళ్లతో పలు పల్లెలు వృద్ధాశ్రమాలను తలపిస్తున్నాయి.

పిల్లల దగ్గర ఉండలేక..

గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలు ఒంటరిగా ఉండలేక బెంగళూరులోని కుమారుడి వద్దకు వెళ్లింది. వెళ్లిన రెండ్రోజులు బాగానే ఉంది. ఆ తర్వాత నుంచి కోడలి నస మొదలైంది. ఇల్లు సరిపోవడం లేదని మొఖం నల్లగా పెట్టడంతో ఆమె అక్కడ ఉండలేకపోయింది. దీంతో తిరిగి ఇంటికి చేరుకుంది. కావాలంటే ఇంకో పదివేలు ఎక్కువ పంపుతాను అక్కడే సర్దుకోమని ఆమెకు కుమారుడు చెప్పాడు. అంత వయస్సు వచ్చిన కొడుక్కి అర్థం కానిది ఏమిటంటే ఈ వయసులో అమ్మకి కావలసింది నోట్లు కాదు.. తిన్నావా.. లేదా.. అని ప్రేమతో పలకరించే నోర్లు అని. ఇప్పుడు లంకంత కొంపలో ఆమె ఒక్కతే చరిత్రకు సాక్షిలా ఉంది. ఇదే పరిస్థితి గ్రామానికి చెందిన మరో వృద్ధుడిది. అందరూ మామా అంటారు. ఉన్న ఒక్క కూతురుకి వివాహం చేసేశాడు. వయసు మీదపడినా పిల్లనిచ్చిన దగ్గరకి వెళ్లి ఉండలేకపోతున్నాడు. ఒంటరి బతుకు తప్పడం లేదు మరి. ఇలాంటి పరిస్థితి గ్రామంలోని ప్రతీ గడపలోనూ కనిపిస్తోంది.

ధాన్యం సేకరణ.. సరికొత్తగా



- జిల్లాల వారీగా లక్ష్యాలు పెంపు
- సత్వరమే నగదు చెల్లించేలా ప్రణాళికలు
- నూతనంగా మార్గదర్శకాలు జారీ చేసిన ప్రభుత్వం
- అన్నదాతల ప్రయోజనాలు కాపాడడమే అంతిమ లక్ష్యం
- ఇష్టమైన మిల్లులకే ధాన్యం రవాణా చేసుకునే వెసులుబాటు
- గత ప్రభుత్వంలో దారుణంగా పడిపోయిన సేకరణ

పిడుగురాళ్ల, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రహసనాన్ని తలపించిన ధాన్యం సేకరణ.. అలవికాని నిబంధనలు.. మిల్లర్ల మాయాజాలం.. డబ్బులు కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి.. చెల్లింపులు సంగతి అయితే చెప్పక్కర్లేదు.. నిలువునా మోసాలు.. ఇదీ ఐదేళ్ల వైసీపీ పాలనలో ధాన్యం సేకరణ తీరు. ఇక ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు నిబంధనలు సడలించి ధాన్యాన్ని సేకరిస్తామనే ఊరడింపు మాటలు తప్పితే ఆచరణలో అమలైన దాఖలాలే లేవు. ఈ పరిస్థితుల్లో అన్నదాతల కష్టాలను గట్టెక్కించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. గత ప్రభుత్వం నిలకడలేని నిర్ణయాలతో అన్నదాతలను తీవ్ర ఇబ్బందులకు గురిచేయగా కూటమి ప్రభుత్వం సరికొత్తగా సేకరణకు సిద్ధమైంది. ధాన్యం సేకరణలో గత ప్రభుత్వ హయాంలో నెలకొన్న బాలారిష్టాలన్నింటికి చరమగీతం పాడి ధాన్యానికి మద్దతు ధర పొందడం అనేది రైతు హక్కుగా చేసి వారికి న్యాయంచేయడానికి కూటమి ప్రభుత్వం నడుం బిగించింది. ఖరీఫ్ నుంచే మార్చిన మార్గదర్శకాలను అమల్లోకి తేవడంతోపాటు రైతుల ఖాతాల్లో నగదును వెంటనే జమచేసేలా ప్రణాళికలు రచిస్తోంది. ఈ క్రమంలో త్వరలో చేపట్టబోయే ధాన్యంసేకరణను సరికొత్తగా పట్టాలెక్కించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

బాపట్ల జిల్లాలో అత్యధికంగా..

ఖరీఫ్‌లో వరిసాగు అత్యధికంగా బాపట్ల జిల్లాలో దాదాపు 2.15 లక్షల ఎకరాల్లో సాగవుతూ ఉండగా దిగుబడి అంచనాలు 5.50 లక్షల టన్నులుగా ఉంది. ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా చూస్తే వరిసాగు గతంలో దాదాపుగా 1.65 లక్షల హెక్టార్లలో సాగవుతూ వస్తోంది. ఈ ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణ లక్ష్యం బాపట్ల జిల్లాలో 50,000 మెట్రిక్ టన్నులు కాగా, గుంటూరు జిల్లాలో 10,000 టన్నులు, పల్నాడు జిల్లాలో 5,000 టన్నులు సేకరించాలని యంత్రాంగం నిర్ధేశించుకుంది. గతంలో ధాన్యం సేకరణలో రైసుమిల్లుల యాజమాన్యాలు అన్నదాతలను తీవ్ర ఇక్కట్లకు గురిచేసేవారు. ఇక మీదట మిల్లుల ర్యాండమైజేషన్ ప్రక్రియను రద్దు చేసి అన్నదాతలు తమకు ఇష్టమైన మిల్లులకే ధాన్యం తరలించుకునే వెసులుబాటును కూటమి ప్రభుత్వం కల్పించింది. గతంలో మిల్లులకు తీసుకెళ్లిన ధాన్యం విషయంలో రైతులు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చేది. రైతుల ఇక్కట్లకు స్వస్తి పలికే విధంగా ప్రతి మిల్లుకు ఓ ఉద్యోగిని పరిశీలకుడుగా నియమించి అటు అన్నదాతలకు ఇటు అధికారులకు ఎప్పటికప్పుడు సమాచారం చేరవేసేలా నిర్ణయం తీసుకుంది. గతంలో ధాన్యం డబ్బులు సకాలంలో జమకాక అన్నదాతలు పడిన ఇబ్బందులు అన్నీఇన్నీకావు. ఇకపై ఇలాంటి ఎదురుచూపులకు ఆస్కారం లేకుండా ధాన్యం అమ్మిన వారం రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమయ్యేలా కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

లక్ష్యాలు చేరుకోవాల్సిందే...

గత ప్రభుత్వంలో ధాన్యం సేకరణ లక్ష్యం కేవలం అంకెలకే పరిమితమయ్యేది. పైగా బహిరంగ మార్కెట్‌లో ధర ఎక్కువగా ఉండడం వల్ల కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రావడం లేదనే సమర్ధనను కూడా అధికారులు ఇచ్చుకునేవారు. కానీ క్షేత్రస్థాయి పరిస్థితులు మాత్రం అందుకు భిన్నంగా ఉండేవి. అలవిమాలిన నిబంధనల చట్రానికి తోడు నగదు చెల్లింపులో గత ప్రభుత్వం అవలంభించిన నిర్లక్ష్య ధోరణే సేకరణకు ప్రతిబంధకాలుగా ఉండేవి. గత్యంతరం లేని పరిస్థితుల్లో దళారులకు తక్కువ ధరకు ధాన్యాన్ని అమ్ముకున్న రైతన్న తీవ్రంగా నష్టపోయేవారు. ఈ పరిస్థితుల్లో ఈ సీజన్ నుంచి ఏ కారణంతోనూ మద్దతు ధరకు ధాన్యం కొనుగోలును యంత్రాంగం నిరాకరించకూడదని ఆదేశించింది. నిబంధనల విషయంలో ఉదారంగా వ్యవహరించాలని నిర్దేశించింది. జిల్లాల వారీగా త్వరలో ప్రారంభమయ్యే ఖరీఫ్ ధాన్యం సేకరణ లక్ష్యాలను యంత్రాంగం చేరుకోవాల్సిందేననే స్పష్టమైన ఆదేశాలను జారీ చేసింది

గతంలో లక్ష్యంలో సగం కూడా చేరుకోలేక..

వైసీపీ ప్రభుత్వ అస్తవ్యస్త విధానాల వల్ల గడచిన మూడేళ్లలో ధాన్యం సేకరణ ఏటికేడు కుచించుకుపోయింది. 2022–23 ఆర్థిక సంవత్సరానికి ఖరీఫ్ సీజన్‌లో బాపట్ల జిల్లాలో సేకరించిన ధాన్యం 40 మెట్రిక్ టన్నులు కాగా అది గతేడాది 32,000కు పడిపోయింది. ఇక గుంటూరు, పల్నాడు జిల్లాల్లోనూ విధించుకున్న లక్ష్యాలకు సేకరణకు పొంతనలేని పరిస్థితి. గడచిన ఆర్థిక సంవత్సరం ఖరీఫ్‌కు గుంటూరు జిల్లాలో 15,000 మెట్రిక్ టన్నులు లక్ష్యం పెట్టుకోగా అది 4,000 మెట్రిక్ టన్నులకే పరిమితమైంది. ఇక పల్నాడు జిల్లాలో పెట్టుకున్న లక్ష్యం పదివేల టన్నులు కాగా 5,000 మెట్రిక్ టన్నులకే అది కుచించుకుపోయింది ఇలా ఏటికేడు సేకరణ లక్ష్యాలకు ముగింపు లెక్కలకు సంబంధం లేకుండా ధాన్యాన్ని సేకరించి మమ అనిపించి గత ప్రభుత్వం చేతులు దులుపు కునేది.

గుంటూరులో డ్రగ్స్ కలకలం

- 66 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం.. ఇద్దరి అరెస్టు
- బెంగళూరు.. గుంటూరు వయా హైదరాబాద్‌కు రవాణా
- సప్లయర్, వినియోగదారుల కోసం పోలీసుల గాలింపు



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న డ్రగ్స్ పరికరాలు, సెల్ ఫోన్లు

గుంటూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): గుంటూరులో మళ్లీ డ్రగ్స్ కలకలం రేపింది. ప్రమాదకరమైన ఎండీఎంఏ డ్రగ్‌ను గుం టూరులో పోలీసులు గుర్తించారు. ఇద్దర్ని అరెస్టు చేసి 5లక్షల ఖరీదైన 66 గ్రాముల డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. బెంగళూరు నుంచి గుంటూరుకు తర లించి ఇక్కడి నుంచి హైదరాబాద్‌కు పంపేందుకు సిద్ధమైన క్రమంలో ఇన్నర్‌రింగ్‌రోడ్డుకు చెందిన షేక్ యూసుఫ్ షరీఫ్‌ను, లాడ్జిసెంటర్‌లోని ఏఎల్ బీఈడీ కళాశాల కాంపౌండ్‌లో ఉండే బట్టు డోనాల్డ్ అలి యాస్ టోనీలను పోలీసులు అరెస్టుచేశారు. డ్రగ్స్‌ను హైదరాబాద్‌కు పంపేందుకు ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుకోసం వేచిఉండగా కొత్తపేట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు శుక్రవారం కేసు వివరాలను ఎస్పీ సతీష్‌కుమార్ మీడియాకు వివరించారు. యూసుఫ్ షరీఫ్ గతంలో బెంగళూరులో ఉద్యోగం చేసే ప్రాంతంలో పరిచయమైన వ్యక్తి ద్వారా ఎండీఎంఏ డ్రగ్ అలవాటైంది. ఆ తర్వాత అక్కడ ఉద్యోగం మానేసిన యూసుఫ్ కొంతకాలం విదేశాల్లో ఉన్నారు. తిరిగి గుంటూరుకు వచ్చి ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాడు. ఈ క్రమంలో బెంగళూరు గతంలో పరిచయమైన వ్యక్తి ద్వారా డ్రగ్స్ తెప్పించుకుని డీజే ఈవెంట్ ఆర్గనైజరైన డోనాల్డ్‌తో కలిసి వినియోగిస్తున్నాడు. హైదరాబాద్‌లోని స్నేహితులు డ్రగ్ తెప్పించమని రూ.లక్ష యూసుఫ్ షరీఫ్‌కు పంపారు. ఈ క్రమంలో బెంగళూరులోని తన స్నేహితుడికి రూ.75 వేలు పంపగా ఈ నెల 16న ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో గుంటూరుకు పంపాడు. అందులో కొంచెం డోనాల్డ్‌కు ఇచ్చి మిగిలిన డ్రగ్స్‌ను హైదరాబాదులోని స్నేహితులకు ఇచ్చేందుకు సిద్ధమవగా కొత్తపేట సీఐ ఎం వీరయ్యచౌదరి ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి ఐదు లక్షల ఖరీదైన 66.26 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్‌తో పాటు నాలుగు స్మార్ట్ ఫోన్లు, ఐప్యాడ్, పోర్టబుల్ ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్, డ్రగ్స్ పీల్చడానికి ఉపయోగించే ట్యూబులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు ఎస్పీ తెలిపారు.



స్వాధీనం చేసుకున్న డ్రగ్స్ వినియోగించే పరికరాలను పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్, పక్కన డీఎస్పీ అజీజ్, సీఐ వీరయ్యచౌదరి

పథకాల పురోగతికి.. 'దిశ'

- ఎంపీ కృష్ణప్రసాద్ అధ్యక్షతన నేడు సమీక్ష
- గత ప్రభుత్వం దారి మళ్లించిన నిధులపై ఆరా

బాపట్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల అమలుతో పాటు వాటి పురోగతిని పర్యవేక్షించడానికి మూడు నెలలకు ఒకసారి దిశ(జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ) సమావేశం జరపాలనేది కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ నిర్ణయం. కేంద్రం భాగస్వామ్యం ఉండే అన్ని విభాగాల్లో అమలయ్యే పథకాల అమలును ఈ దిశ సమావేశంలో సమగ్రంగా చర్చించి లోటుపాట్లను కేంద్రం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు ప్రజలకు వాటి ఫలాలు అందుతున్నాయా లేదా అనేది కూడా సమగ్రంగా చర్చించనున్నారు. ఎంపీ కృష్ణప్రసాద్ అధ్యక్షతన కలెక్టరేట్ వేదికగా శనివారం దిశ సమావేశం జరగనున్నది. కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో అమలు చేస్తున్న పథకాలకు సంబంధించి ఆయా విభాగాల అధికారులతో పాటు జిల్లాలో ఉన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జడ్పీ చైర్‌పర్సన్లుకు కూడా దిశ సమావేశ ఆహ్వానాన్ని అధికారులు పంపారు. ఉపాధి హామీ పనులు, దీన్ దయాళ్ అంత్యోదయ యోజన, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ స్కీమ్స్, బేటీ బచావో...బేటీ పడావో తదితర పథకాలన్నింటిపై దిశ వేదికగా విస్తృత చర్చ జరగనుంది. గత ప్రభుత్వంలో ఎంపీ ల్యాడ్స్ వినియోగంతో పాటు ప్రస్తుతం అందుబాటులో ఉన్న నిధులను ప్రాథమ్యాలకు అనుగుణంగా వేటికి ఖర్చు పెట్టాలనే చర్చ కూడా సమావేశంలో జరగనుంది. వైసీపీ ప్రభుత్వంలో ఎంపీ ల్యాడ్స్‌కు సంబంధించి రూ.52 లక్షల విలువైన మూడు పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు తేల్చారు. 54 లక్షలు ఖర్చు కాకుండా ఉండిపోవడంతో వాటిని ప్రస్తుత ఎంపీ నిధులకు జత చేసి అభివృద్ధి పనులకు ఖర్చు చేయనున్నారు. బాపట్ల ఎంపీ ల్యాడ్స్ రూ.5 కోట్లు ఇప్పటికే విడుదల కాగా వాటి వినియోగానికి సంబంధించి కూడా అధికారులు చర్చించనున్నారు. గత ప్రభుత్వంలో లాగా ఎంపీ ల్యాడ్స్ ఖర్చు చేయడంలో నిర్లక్ష్యం వహించకుండా పెండింగ్ పనులను పూర్తి చేయడంతో పాటు కొత్త వాటికి వర్క్ ఆర్డర్ ఇచ్చే విధంగా కసరత్తు చేయనున్నారు. కలెక్టర్ కార్యాలయం వెనక భవనంలో ఎంపీ ఫెసిలిటేషన్ కార్యాలయాన్ని ఇప్పటికే ఏర్పాటు చేయగా శనివారం దానిని ప్రారంభించనున్నారు.



జిల్లా కలెక్టర్ కార్యాలయం

గతంలో నిధుల దారి మళ్లింపు

గత వైసీపీ ప్రభుత్వంలో కేంద్ర పథకాలకు రాష్ట్ర ప్రభుత్వ మ్యాచింగ్ వాటా జారీ చేయకపోగా కేంద్రం నిధులను యధేచ్ఛగా దారి మళ్లించింది. ఇవన్నీ బహిర్గతమవుతాయనే ఉద్దేశంతో మూడు నెలల కొకసారి జరపాల్సిన దిశ సమావేశాన్ని పూర్తిగా అటకెక్కించిన ఘనత వైసీపీది. శనివారం జరగబోయే సమావేశంలో గత ప్రభుత్వంలో దారి మళ్లిన కేంద్రం నిధులపై కూడా చర్చ జరిగే అవకాశం ఉంది.

భూ సమస్యలు పరిష్కరించాలి

చౌక దుకాణాల్లో ఖాళీలు భర్తీ చేయాలి

రెవెన్యూ అధికారులకు జేసీ ప్రఖర్‌జైన్ ఆదేశాలు

బాపట్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భూ సమస్యలను పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జేసీ ప్రఖర్‌జైన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన జిల్లాస్థాయి రెవెన్యూ సదస్సులో ఆయన ప్రసంగించారు. భూ సమస్యలపై కార్యాలయాలకు వచ్చేవారిపై నిర్లక్ష్యం వీడాలన్నారు. బాధితుల సమస్యలు క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత వారు సంతృప్తి చెందేలా పరిష్కరించాలన్నారు. ఒకే ప్రాంతం నుంచి పలుమార్లు అర్జీలు వస్తుంటే



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ ప్రఖర్‌జైన్

కలెక్టరేట్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి బాధితుల సమస్యలు పరిష్కరించడంతోపాటు సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. రేషన్ దుకాణాల సమస్యలపై నమోదైన 142 అర్జీలను పరిష్కరించాలన్నారు. చౌక దుకాణాల ఖాళీలను షెడ్యూల్ ప్రకారం భర్తీ చేయాలన్నారు. ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వ లక్ష్యం మేరకు 50 వేల మెట్రిక్ టన్నుల సేకరణకు చర్యలు తీసుకోవాలన్నారు. 150 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, కలెక్టరేట్‌లో రైతుల కోసం కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేయాలన్నారు.

షెడ్యూలు ప్రకారం నిర్వహించాలి

నీటిసంఘాల ఎన్నికలను షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని జేసీ తెలిపారు. నీటి తీరువా చెల్లింపులు, పంటకాల్వలపై ఆధారపడి సాగు చేస్తున్న రైతులు ఓటరు జాబితాలో ఉండాలన్నారు. జాతీయ రహదార్లు భూసేకరణలో బాధితులకు తక్షణమే పరిహారం అందించాలన్నారు. బాపట్లలో స్టేడియం నిర్మాణానికి అవసరమైన భూమి సర్వే చేసి నివేదిక ఇవ్వాలన్నారు. సమావేశంలో డీఆర్వో సి.హెచ్.సత్తిబాబు, ఆర్డీవోలు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

పూర్వీకుల దానం.. ఆక్రమణకు అల్లుడి యత్నం

- గ్రామస్తుల ఆందోళన.. పోలీసులకు ఫిర్యాదు

బాపట్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పూర్వీకులు దానం చేసిన స్థలాన్ని ఆక్రమించుకునేందుకు ఆ ఇంటి అల్లుడి యత్నంచగా గ్రామస్తులు అడ్డుకుని పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటన శుక్రవారం బాపట్ల మండలం జిల్లెళ్ళమూడి గ్రామంలో చోటుచేసుకుంది. ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న జిల్లెళ్ళమూడిలో నూరేళ్ళ క్రితం ఖగ్గా వంశస్థులు సుమారు 7 ఎకరాల పొలాన్ని గ్రామాభివృద్ధికి దానం చేశారు. అందులో తాగునీటి చెరువుతోపాటు గుడి, బడి నిర్మించగా గ్రామస్తులు వీటిని వినియోగించుకుంటున్నారు. ఖగ్గా వంశంలో ఓ మహిళను వివాహం చేసుకున్న అదే గ్రామానికి చెందిన వేల్పూరి ధర్మారావు ఇప్పుడొచ్చి తమ పూర్వీకులు దానం చేసిన భూమి తమదేనంటూ అడ్డం తిరిగాడు. చెరువు, గుడి, బడికి వెళ్లే రోడ్డుకు అడ్డుగా కంచవేసి ఎవరినీ రానీయకుండా చేస్తున్నాడు. పైగా చెరువులో నీటిని కలుషితం చేస్తానని బెదరించడం, ప్రశ్నించినవారిని దుర్భాషలాడటం చేస్తున్నాడు. దీంతో గ్రామస్తులంతా కలిసి ఇతడిపై గ్రామ కార్యదర్శి నాగలక్ష్మికి ఫిర్యాదు చేశారు. కార్యదర్శి చెప్పినా అతను తగ్గలేదు. దీంతో పోలీసుల దృష్టికి తీసుకెళ్లగా వెదుళ్ళపల్లి ఎస్ఐ పి.జనార్ధనరావు సిబ్బందితో కలిసి శుక్రవారం గ్రామంలో విచారించారు. సమస్యకు కారణమైన వేల్పూరి ధర్మారావు ఎస్ఐ వద్ద కూడా పొలం తమదని వాదించగా పత్రాలు చూపించమంటే చూపించలేదు. దీంతో పోలీసులు అతడిపై ఫిర్యాదు చేయాలని గ్రామకార్యదర్శికి ఎస్ఐ సూచించారు.



రోడ్డుకు అడ్డుగా ముళ్ళమండలు




గ్రామస్తులతో మాట్లాడుతున్న వెదుళ్ళపల్లి ఎస్సై దారా శ్రీనివాసరావు

ఊరే వృద్ధాశ్రమం

- ఉద్యోగాల కోసం పిల్లలు వలస
- అక్కడ ఇమడలేక.. ఇక్కడ ఉండలేక
- గ్రామాల్లో ఒంటరిగా పండుటాకులు

గుంటూరు సిటీ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మా పిల్లలు బాగా చదువుకోవాలి.. మంచి ఉద్యోగం సాధించాలి.. విదేశాల్లో స్థిరపడాలి. మంచి స్థాయిలో ఉండాలి. ఇవీ పిల్లల విషయంలో తల్లిదండ్రుల కలలు. ఆశలు. ఆ కలలు సాకారం అయ్యాక అమ్మానాన్నల పరిస్థితి ఏమిటి. పిల్లలు బాగా చదువుకుని విదేశాలకు వెళ్తున్నారు బాగానే ఉంది. మరి ఊర్లో ఉంటున్న అమ్మానాన్నలు ఏమవుతున్నారు. ఎటూ వెళ్లలేక.. ఒంటరిగా ఉండలేక.. అందనంత ఎత్తుకు ఎదుగుతున్న పిల్లలను అందుకోలేక.. పిల్లలు వెళ్లిన దారుల వెంట వెళ్లలేక.. ఉన్న ఊరులో వారి కోసం ఏళ్లగా ఎదురు చూస్తూ ఉసూరుమంటున్నారు. అటువంటి తల్లిదండ్రులు ఎక్కువ మంది ఉన్న ఒక గ్రామమే గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలంలోని అన్నవరం. ఇక్కడ అన్నిటికీ సమృద్ధే.. ఊరిలో ఉన్న అమ్మానాన్నలకు అన్నీ ఉన్నాయి. ఒక్క పిల్లల సాంగత్యం తప్ప. ఈ ఊరిని చూశాక.. ఒంటరిగా ఉన్న పెద్ద వాళ్ల కథలు.. గాథలు విన్నాక.. పిల్లలు పెద్ద వాళ్లు కావాలని కోరుకోవాలి కానీ మరీ అందనంత దూరం వెళ్లాలని మాత్రం కాదని అర్థమవుతోంది. ఇది ఒక్క అన్నవరం గ్రామంలో మాత్రమే కాదు. పరిశీలిస్తే ఉమ్మడి గుంటూరు జిల్లాలోని చాలా గ్రామాల్లో ఇదే పరిస్థితి కనిపిస్తోంది. అన్నవరంలో సుమారు 450 కుటుంబాలు ఉంటాయి. ఇంటికి ఒకరిద్దరు అమెరికా, హైదరాబాద్, బెంగళూరు తదితర ప్రాంతాల్లో ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. పిల్లలు రెక్కలొచ్చిన పక్షుల్లా వెళ్ళిపోతే వృద్ధ తల్లిదండ్రులు ఒంటరిగా మిగిలిపోయారు. వారికి తినడానికి.. ఉండడానికి కొదవ లేదు. ఏదైనా ఇబ్బంది వచ్చినప్పుడే అవస్థలు. ఆప్యాయంగా పలకరించే వాళ్లు లేరన్న దిగులు. అన్ని ఇళ్లలో ఇదే పరిస్థితి.



ఒంటరి బతుకు

నేను ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేశా. భార్య, కుమార్తె ఉన్నారు. భార్య నాతో లేదు. ఉన్న కుమార్తెకు వివాహం చేశా. పెళ్లి కాక ముందే పిల్ల మీద మనకి హక్కు. పెళ్లి అయితే వాళ్ల జీవితం వాళ్లది. ఒంటరిగా ఒక్కడినే వండుకుంటా. మనవళ్లు అప్పుడప్పుడు వచ్చి పోతుంటారు.అప్పుడే ఒంటరి బతుకు అలవాటైంది. దేవుడు ఉంచిన వరకు ఇలా ఉండటమే.

- గద్దె సింగయ్య, అన్నవరం

పిల్లల దగ్గర ఉండలేం

మా పిల్లలు టౌన్‌లో ఉంటారు. మేము మాత్రమే ఇక్కడ ఉంటాము. వాళ్ల దగ్గర ఉండలేము. సొంత ఊరు అయితే పొద్దు పోతుంది. పట్టణంలో అలా కాదు. పిల్లలు మమ్మల్ని బాగా చూసుకుంటారు. వాళ్లే వచ్చి చూసి పోతారు. వయస్సు అయిపోయాక అన్నీ కావాలంటే దక్కవు మరి.

- పి ఎర్రయ్య, అన్నవరం

పాపం పండుటాకులు..

అన్నవరంలో ఓ వృద్ధ జంట దుస్థితి గురించి ఓ యువకుడు అనుభవం..

నా బాల్య మిత్రుడు అమెరికాలో పెద్ద డాక్టర్. అంతులేని సంపద. పొద్దస్తమానం ఫోన్ చెయ్యడు. రెండు నెలలకు ఒకసారి అదీ అర్ధరాత్రి ఫోన్ చేసి అన్నవరంలో ఉన్న అమ్మా, నాన్న దగ్గరికి వెళ్లి రమ్మంటాడు. నేనూ వాడు పెదనందిపాడు స్కూల్లో పదో తరగతి వరకు కలిసి చదువుకున్నాం. ఇద్దరం మంచి మార్కులతో పాసైనా నా చదువు ముందుకు సాగలేదు. నాన్న చేతి కింద ఉండి వ్యవసాయం చేయాల్సి వచ్చింది. వాడేమో డాక్టర్ అయ్యాడు. వాడ్ని అమెరికా పంపడం వాళ్ల నాన్న కల. అది నెరవేరింది. కానీ వాళ్ళకి వీడు ఒక్కడే కావడం వల్ల ఒక వయస్సు వచ్చేటప్పటికీ ఇబ్బందులు మొదలయ్యాయి. తల్లి తండ్రులకు బీపీ, షుగరు, గుండెజబ్బులు. తరాలు తిన్నా తరగని ఆస్తులున్నాయి. కానీ ఏమీ లాభం. లేచినా, లేవకపోయినా ఆప్యాయంగా పలకరించే వాళ్లు లేరు. చుట్టాలు, బంధువులు ఉన్నారు. అయితే వారు రోజుల తరబడి అంటిపెట్టుకుని ఉండలేరుగా. అయినా ఎందరున్నా ఏమి లాభం. కడుపున పుట్టిన బిడ్డ పక్కన ఉంటే ఆ లెక్కే వేరు. అలా అని వీళ్లు అక్కడకి వెళ్లలేరు. పోనీ వాడు ఇక్కడికి రావాలన్నా కుదరదు. అందుకే నాకు వారిని చూసి వచ్చే పనిని పురమాయిస్తుంటాడు. ఆ పెద్దాయనికి(డాక్టర్ తండ్రి) పాలతాలికలు అంటే చాలా ఇష్టం. పెద్దమ్మకి బూందీ అంటే మక్కువ. కానీ చేసుకునే ఓపిక వారికి లేదు. పెద్దాయన చిన్న ముక్కాల పీట తెచ్చి వేస్తే పెద్దమ్మ దాని మీద కూర్చుని ఇద్దరికీ రెండు మెతుకులు వండుతుంది. నేను వెళ్ళేటప్పుడు వారికి ఇష్టమైన వాటిని ఇంట్లో చేయించి తీసుకువెళ్తే ఎంత ఇష్టంగా తింటారో. ఊర్లో వాళ్లందరికీ నా గురించి ఎంత గొప్పగా చెప్పుకుంటారు. దేవుడిచ్చిన కొడుకంటారు.

చనిపోయానా దిక్కులేదు..

గ్రామంలో ఇటీవల ఓ మధ్య వయస్కురాలు అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె పిల్లలు అమెరికాలోనే ఉన్నారు. వాళ్ల రావడానికి కుదరకలేదు. దీంతో దూరపు బంధువులే దహన సంస్కారాలు పూర్తి చేశారు. ఇది జరిగాక ఇంటి నట్టిపెట్టుకుని ఉన్న పెద్దలకు దిగులు మొదలైంది. అయినా ఏం చేస్తారు.. పిల్లలు సంపాదన కోసం బయటకు వెళ్లక తప్పదు.

పండుగా.. పబ్బం..

దసరా పండుగకు కొందరు గ్రామానికి వచ్చారు. పెద్దల్లో సంబరం. అయితే ఆ ఉత్సాహం కొద్దిరోజులే. వచ్చేంత వరకు రావడంపై ధ్యాస.. వెళ్లేంత వరకు వెళ్లడం మీద ధ్యాస. గడిపింది కొద్ది గంటలే అయినా సంవత్సరానికి సరిపడా జ్ఞాపకాలు. విదేశాల్లో ఉన్న వాళ్ళు మాత్రం రాలేక పోయారు. కుదిరితే సంక్రాంతి వస్తామని చెప్పారు. ఇంకేముంది ఇక్కడున్న అమ్మా నాన్న కి అప్పుడే పండుగ.

ఆధ్యాత్మిక చింతన ప్రతి ఒక్కరికీ ఉండాలి

ఎమ్మెల్యే కొండయ్య

వేటపాలెం(చీరాల), అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక చింతన అవసరమని ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్య చెప్పారు. మండల పరిధిలోని ఊటుకూరిసుబ్బయ్యపాలెంలో శుక్రవారం జరిగిన అమ్మవారి పొంగళ్ల కార్యక్రమంలో ప్రత్యేక పూజల్లో ఆయన మాట్లాడుతూ గ్రామస్థులు సంఘటితంగా ఉంటూ గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్య సహాయానికి విరాళం

చీరాలటౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : కిడ్నీ సమస్యతో బాధపడుతున్న చీరాలకు చెందిన ఊటుకూరి ఆంజనేయులు కుటుంబానికి ఎస్‌వీఎస్ ఎస్‌జేఆర్ ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు ఆర్థిక సాయం అందజేశారు. ఆంజనేయులు సీజనల్ వ్యాపారంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అనుకోని రీతిలో ఆరోగ్యం దెబ్బతినడంతో గుంటూరులోని ఓ ప్రయివేట్ వైద్యశాలలో చికిత్స తీసుకుంటున్నారు. రూ.3 లక్షలకు పైగా చికిత్సకు అవసరం ఉండటంతో ఆర్థిక పరిస్థితిని గుర్తించిన సంఘ ప్రతినిధులు కొంత సాయం అందించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు చేబ్రోలు బాలాజీరావు, సెక్రటరీ వేణుగోపాల్, అరవపల్లి మాణిక్యరావు, కృష్ణ, రామారావు, కౌన్సిలర్ గుంటూరు ప్రభాకరరావు, బాంబే సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి నిధులతో రోడ్ల నిర్మాణ పనులు

పంగులూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధులతో గ్రామాలలో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపడుతున్నట్లు ఎంపీడీవో కె.స్వరూపారాణి చెప్పారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొండమంజులూరు, కోటపాడు, జనకవరం, అరికట్లవారిపాలెంలలో శుక్రవారం సీసీ రోడ్లు, గోకులాల నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. పీఆర్ ఏఈ హనుమంతరావు, ఏపీవో సంతోషం, హౌసింగ్ ఏఈ కిషోర్‌కుమార్, ఈఓఆర్డీ. కె.సుమంత్, నేతలు చింతల సహదేవుడు, బత్తుల వెంకటరావు, గుర్రం ఆదిశేఖర్, తలపనేని రాంబాబు, శింగరకొండ, మాగులూరి రమేష్, ఉన్నం రవిబాబు, ఈసీ మురళి, కార్యదర్శులు బి.రాంబాబు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

సింగరాయకొండ, అక్టోబరు 18 : రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన పాతసింగరాయకొండ పంచాయతీ పరిధిలోని చిల్లా కాలువ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. మృతుడి వయసు 25 నుంచి 30 సంవత్సరాలు ఉంటుందని, 5.7 అడుగల ఎత్తు ఉన్నాడని రైల్వే పోలీసులు తెలిపారు. శవపరీక్ష నిమిత్తం మృతదేహాన్ని ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. జీఆర్పీ ఎస్సై టి.అరుణకుమారి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మోటారు సైకిల్ ఢీకొని పాదచారికి గాయాలు

టంగుటూరు, అక్టోబరు 18 : మోటారు సైకిల్ ఢీకొని పాదచారికి గాయాలయ్యాయి. ఈ ఘటన స్థానిక జాతీయ రహదారిలోని బాపూజీకాలనీ వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు.. సింగరాయకొండకు చెందిన బా పట్ల శివకుమార్ ఆర్టీసీ బస్సు ఎక్కి బాపూజీ కాలనీ సమీపంలోని పెట్రోలు బంకు వద్ద దిగాడు. నడుచుకుంటూ వెళ్తున్న ఆయన్ను ఎదురుగా రాంగ్ రూట్‌లో వచ్చిన ద్విచక్రవాహనదారుడు ఢీకొట్టాడు. దీంతో శివకుమార్ ఎడమకాలికి గాయమైంది. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై క్షతగాత్రుడిని ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలి

టంగుటూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సర్దుబాటు చార్జీలను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక విద్యుత్ శాఖ టౌన్ కార్యాలయం వద్ద వారు శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు టి.రాము, వి.మోజెస్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్న సమయంలో ప్రభుత్వం విద్యుత్ చార్జీల భారం మోపడం తగదన్నారు. ఇలాంటి ప్రజావ్యతిరేక విధానాలకు స్వస్తి చెప్పకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు.

ఉద్యోగం ఇక్కడ.. ఉండేది విదేశాలలో..

రెండేళ్లుగా విధులకు డుమ్మా..

ఒంగోలులో 11 మందిప్లానింగ్ సెక్రటరీలపై చర్యలకు రంగం సిద్ధం

డీటీసీపీకి సరెండ్ చేసిన కమిషనరు వెంకటేశ్వరరావు

ఒంగోలు, కార్పొరేషన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సచివాలయల ఉద్యోగాల నియామకాల్లో భాగంగా టౌన్‌ప్లానింగ్ సెక్రటరీలుగా ఎంపికైన పలువురు రెండేళ్లపాటు విధుల్లో కొనసాగారు. అయితే ఆ తర్వాత పర్మినెంట్ చేస్తూ గత ప్రభుత్వం ఉత్వర్వులు జారీచేయడంతో ఇక ఉద్యోగాలకు ఢోకా లేదని భావించిన వారు తెలివిగా వ్యవహరించారు. దీర్ఘకాలిక సెలవులు పెట్టుకుని సాఫ్ట్‌వేర్ కంపెనీలలో పనిచేస్తున్నట్లు తెలిసింది. ఇదిలా ఉంచితే కొందరు హైదరాబాద్, చెన్నై, బెంగళూరులో ఉద్యోగాలు చేస్తుండగా మరికొందరు నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగులుగా, ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్ళినట్లు తెలిసింది. వాస్తవానికి ఇతర దేశాలకు వెళ్లాలంటే ప్రభుత్వం అనుమతి తీసుకోవాల్సి ఉంది. అంతేకాకుండా ఎన్ని రోజులు సెలవు పెడుతున్నారు. ఏ కారణాలతో విదేశాలకు వెళుతున్నారు అనే వివరాలను ప్రభుత్వానికి విన్నవించుకోవాలి. ఆ తర్వాత ప్రభుత్వ అనుమతితో వారు జీతం నష్టపోవడానికి ఇష్టపడి వెళ్లాల్సి ఉంది. అయితే ఒంగోలు కార్పొరేషన్‌లో అందుకు విరుద్ధంగా వ్యవహారం నడిచింది. గతంలో ఇక్కడ పనిచేసి బదిలీపై వెళ్లిన కమిషనర్ తన సొంత నిర్ణయాలతో ఇష్టారాజ్యంగా సెలవులు మంజూరు చేయడంతో ప్లానింగ్ సెక్రటరీలు పత్తా లేకుండా పోయారు. దీంతో ఒకవైపు ఇక్కడ కార్యాలయ విధులకు ఇబ్బంది తలెత్తుతుండగా, మరోవైపు ఉద్యోగులు లేక, ఉన్నవారు రాక ఖాళీలు చూపించుకునే పరిస్థితి లేదు. గత రెండేళ్లుగా ఇక్కడ ఇదే పరిస్థితి ఉన్నట్లు సమాచారం.

డీటీసీపీకి సరెండర్ చేసిన కమిషనరు

ఒంగోలు నగర కమిషనరుగా విచ్చేసిన డాక్టర్ కే.వెంకటేశ్వరరావు కార్యాలయ అడ్మినిస్ట్రేషన్, సచివాలయ ఉద్యోగుల పనితీరుపై దృష్టిసారించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. సుమారు 11మంది ప్లానింగ్ సెక్రటరీలు రెండేళ్లుగా విధులకు డుమ్మా కొట్టి ఇతర ప్రైవేటు ఉద్యోగాలలో కొనసాగుతున్నట్లు గుర్తించారు. దీంతో వారు ప్రస్తుతం ఎక్కడెక్కడ పనిచేస్తున్నారు. ఎన్ని రోజుల నుంచి సెలవులో ఉన్నారు. ఏ నిబంధనల మేరకు వారు ఇతర ఉద్యోగాల్లో కొనసాగుతున్నారో పరిశీలించారు. దీంతో శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం సెలవుపై వెళ్లి ఇతర ఉద్యోగాలలో ఉన్నవారిని రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్‌కు సరెండర్ చేయడంతో ఇప్పటివరకు వేర్వేరు ప్రాంతాల్లో ఉన్నవారు ఒక్కొక్కరుగా పరుగులు పెడుతున్నారు. ఉన్న ఉద్యోగం పోతుందని భావించిన వారు తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ డీటీసీపీ అధికారులను ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నట్లు సమాచారం.

ఇదిలాఉండగా, ఒంగోలు సచివాలయాల్లో ఉండకుండా ఫీల్డు పేరుతో కార్యాలయానికి డుమ్మాకొడుతున్న వారిపైనా కమిషనరు ప్రత్యేక దృష్టిసారించారు. తప్పనిసరిగా మూవ్‌మెంట్ రిజిస్టర్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినా, పౌరసేవలపై అలసత్వం చేసిన చర్యలు తప్పవని ఇతర సెక్రటరీలను ఆదేశించారు.

సీజనల్ వ్యాధుల బారిన పడకుండా చర్యలు

ఈనెల 21 నుంచి ఇంటింటి ఫీవర్ సర్వే

అన్ని వైద్యశాలలో అందుబాటులో ఉన్న మందులు

పీహెచ్‌సీల్లోనే డెంగ్యూ, మలేరియా రక్తపరీక్షలు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో విస్తారంగా కురిసిన వర్షాలతో ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక దృష్టిసారించింది. ప్రభుత్వ ఆదేశాలతో జిల్లావ్యాప్తంగా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, జిల్లాస్థాయి హాస్పటల్స్‌లో ప్రజలకు అన్ని రకాల టెస్టులు (రక్త పరీక్షలు) చేసే విధంగా ఏర్పాట్లు చేశారు. గత వారంరోజుల నుంచి విస్తారంగా కురుస్తున్న వర్షాలతో దోమల బెడద పెరగడంతోపాటు తాగునీరు కలుషితమయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు వైద్యాధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఇప్పటికే ఒక విడత జిల్లాలో ఫీవర్ సర్వే నిర్వహించిన వైద్యశాఖ అధికారులు, ఈనెల 21 నుంచి మరో విడత ఇంటింటి ఫీవర్ సర్వే చేసేందుకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే సీజనల్ వ్యాధుల బారిన పడి ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అయితే తాజాగా కురిసిన వర్షాలతో వ్యాధులు మరింత పెరిగే అవకాశం ఉంది. దీంతో అధికారులు ముందస్తు చర్యలు చేపడుతున్నారు.

అన్ని ఆస్పత్రులలో రక్తపరీక్షలు

ప్రధానంగా మలేరియా, డెంగ్యూ వ్యాధిబారిన పడకుండా ఉండేందుకు పీహెచ్‌సీల పరిధిలోనే రక్తపరీక్షలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అందుకు అవసరమైన మెటీరియల్‌ను కూడా అందుబాటులోకి తీసుకు వచ్చారు. ప్రజానీకం జ్వరం వచ్చిన వెంటనే సమీపంలోని పీహెచ్‌సిల్లో చూపించుకోనే విధంగా గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. జ్వరం వస్తే ఆర్ఎంపీలు, పీఎంపీల వద్దకు కాకుండా నేరుగా పీహెచ్‌సీలకు వెళ్లి చూపించుకునే విధంగా చర్యలు చేపట్టారు. ఫీవర్ సర్వే ద్వారా జ్వరం బారిన పడిన బాధితులను గుర్తించి వారికి సత్వరమే వైద్యచికిత్స అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. మలేరియా వ్యాధికి అవసరమైన మందులను కూడా వైద్యశాలలో అందుబాటులో ఉంచారు. రక్త పరీక్షల్లో డెంగ్యూ ఉన్నట్లు గుర్తిస్తే అటువంటి వారికి మెరుగైన వైద్యచికిత్స అందించేందుకు జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా వైద్యశాలలో డెంగ్యూను పూర్తిస్థాయిలో నిర్ధారించేందుకు ఎలీషా టెస్టు(రక్త పరీక్ష) చేస్తారు. అందుకు అవసరమైన కిట్లను సిద్ధం చేశారు.

సమన్వయంతో ముందుకు

డెంగ్యూ బారిన పడినవారికి ప్లేట్‌లెట్స్ పడిపోకుండా సత్వర వైద్య సేవలు అందించేందుకు ఏర్పాట్లు చేశారు మరోవైపు ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా క్షేత్రస్థాయి సిబ్బందికి దిశానిర్దేశం చేస్తున్నారు. గ్రామాల్లో వర్షపు నీరు నిల్వ ఉంటే దోమల ఉత్పత్తి పెరగకుండా అవసరమైన చర్యలను సంబంధిత శాఖల సమన్వయంతో చేపట్టే విధంగా అప్రమత్తం అయ్యారు. వర్షాలకు నీరు కలుషితం కాకుండా టెస్టులు చేసి అవసరమైతే నీటిని క్లోరినేషన్ చేసి ప్రజలు వ్యాధుల బారిన పడకుండా చర్యలు చేపట్టారు. ఇప్పటికే సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని ముందుకు సాగాలని క్షేత్ర స్థాయి వైద్యశాఖ అధికారులకు అవగాహన కల్పించారు. నీరు నిల్వ ప్రాంతాల్లో లార్వాలతో పాటు బ్లీచింగ్, ఫాంగింగ్ చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.



వైద్యశాలల్లోనే అన్నిరకాల వైద్య పరీక్షలు

డాక్టర్ సురేష్‌కుమార్, ఇన్‌చార్జీ డీఎంహెచ్ఓ

జిల్లాలో వ్యాధుల బారిన పడిన ప్రజలకు సత్వరమే పీహెచ్‌సీల్లో వైద్యపరీక్షలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకున్నాం. ఇప్పటికే ఒక విడత ఫీవర్ సర్వే నిర్వహించారు. ఈ సర్వే ద్వారా జ్వరపీడితులను గుర్తించి వైద్యసేవలు అందించే విధంగా చర్యలు తీసుకున్నారు. వర్షాలు తగ్గినందున ఈనెల 21 నుంచి మరోసారి ఇంటింటి ఫీవర్ సర్వే నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ సర్వేలో జ్వరం బారిన పడిన వారు ఉంటే గుర్తించి సత్వరమే వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రజలు ఎవరైనా అనారోగ్యానికి గురైతే వెంటనే ప్రభుత్వ వైద్యశాలలో రక్తపరీక్షలు చేయించుకొని అవసరమైన చికిత్సలను పొందాలి.

స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోండి



దుకాణదారులతో మాట్లాడుతున్న ఎస్ఐ సురేష్

ఇంకొల్లు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లులో వ్యాపారులు స్వచ్ఛందంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఎస్ఐ సురేష్ చెప్పారు. ఇంకొల్లు ప్రధానకూడలిలో శుక్రవారం రాత్రి సీసీ కెమెరాలు వలన ప్రయోజనాలు వాటి ఉపయోగాలపై వ్యాపారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నూతనంగా రోటరీక్లబ్ సహకారంతో నిర్మించిన పోలీసుకంట్రోల్ రూంలో ఆధునిక సీసీలను ఏర్పాటు చేసి స్టేషన్‌కు అనుసంధానించామన్నారు.

గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం



శంకుస్థాపనలో కూటమి నాయకులు, అధికారులు

పర్చూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రజా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెద్దపూడి విజయ్ కుమార్ చెప్పారు. శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు పిలుపు మేరకు పల్లె పండుగలో భాగంగా శుక్రవారం రూ.కోటి వ్యయంతో పర్చూరులో తలపెట్టిన ఆయా కాలనీలలో సీసీ రోడ్డు నిర్మాణాలకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జనసేన పార్టీ సెంట్రల్ జోన్ ఎలక్షన్ కన్వీనర్, చీరాల నియోజకవర్గ సమన్వయకర్త ఆలా అనిల్ కుమార్ హాజరయ్యారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో ప్రద్యుమ్నకుమార్, ఈవోఆర్డీ కొసనా సత్యనారాయణ, మండల జేఈ శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షులు షేక్ షంషుద్దీన్, పట్టణ పార్టీ అధ్యక్షులు అగ్నిగుండాల వెంకటకృష్ణారావు, సర్పంచ్ మల్లా అంజమ్మ, నాయకులు కఠారి సురేంద్రబాబు, కోడూరి శేషబ్రహ్మచారి, తంగెళ్ల మల్లికార్జునరావు, ఆకుల మధుబాబు, మామిడిపాక హరిప్రసాద్, తేజ, అబ్రహం, తులసి అప్పారావు పాల్గొన్నారు.

పల్లెపండుగతో అభివృద్ధి



రోడ్ల పనులకు భూమిపూజ చేస్తున్న నాయకులు

ఇంకొల్లు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రవేశపెట్టిన పల్లె పండుగ ప్రధాన లక్ష్యం గ్రామాలను అభివృద్ధి చేయడమేనని టీడీపీ మండల అధ్యక్షుడు నాయుడు హనుమంతరావు చెప్పారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సూచనల మేరకు మండలంలోని గంగవరం, భీమవరం గ్రామాలలో సీసీ రోడ్లు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం



రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 18 (ఆంధ్ర జ్యోతి): ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు వైద్యాధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక మాతా శిశు వైద్యశాలను కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. ఆస్పత్రిలోని ఓపీ రిజిస్ట్రేషన్ విధానంతోపాటు రిజిస్టర్లను కూడా పరిశీలించారు. జనరల్ ఓపీ వార్డును, ఎస్టీఆర్ వైద్య సేవల కౌంటర్, ఆపరేషన్ థియేటర్, కాన్పుల వార్డుతో పాటు పలు విభాగాలను పరిశీలించారు. అక్కడ రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్‌ను పరిశీలించారు.

యూనివర్సిటీని సందర్శించిన కలెక్టర్

స్థానిక ఆంధ్రకేసరి యూనివర్సిటీని కలెక్టర్ సందర్శించారు. వీసీ డీవీఆర్ మూర్తి, రిజస్ట్రార్ బి.హరిబాబు, ప్రిన్సిపాల్ జి. రాజమోహన్‌రావులు కలెక్టర్‌కు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వివిధ సెక్షన్ల అధిపతులు, అధ్యాపకులతో కలెక్టర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వీసీ మూర్తి, రిజస్ట్రార్ హరిబాబులు పలు అంశాలను కలెక్టర్ దృష్టికి తెచ్చారు. యూనివర్శిటీ నిర్వహణ కోసం ప్రభుత్వం కేటాయించిన పేర్నమిట్ట ప్రాంగణంలో పనులు పూర్తి కాకపోవడంతో ప్రస్తుతానికి పెళ్లూరు కాలనీలోని పాత భవనాలను వినియోగించుకుంటూ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైతే ఆ పనులు సకాలంలో పూర్తవుతాయని కలెక్టర్ దృష్టికి తెచ్చారు.

ప్రవర్తనే గీటురాయి

ప్రజలు దానిని గమనిస్తారు

మద్యం, ఇసుక జోలికి వెళ్లకండి

టీడీపీ ఎమ్మెల్యేలకు అధినేత ఉద్బోధ

ఒంగోలు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): 'మన ప్రవర్తనే భవిష్యత్‌లో సక్సెస్‌కు గీటురాయి. ప్రజలు అన్నింటిని గమనిస్తారు. ఆ విషయాన్ని పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు గుర్తించి మసలుకోవాలి. ఫిల్ గుడ్ ఫ్యాక్టర్ అనేది లేకపోతే మనల్ని ప్రజలు విశ్వసించరు. అందుకు త వైసీపీ పాలన తీరే నిదర్శనం' అని టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఉద్బోధించారు. మంగళగిరిలోని టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్రంలోని టీడీపీకి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జీలతో శుక్రవారం ముఖ్యమంత్రి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో 125 రోజులు టీడీపీ కూటమి ప్రభుత్వ పనితీరు, వివిధవర్గాల ప్రజల కోసం అమలు చేసిన పథకాలు, కొత్తగా ప్రభుత్వం చేపట్టిన విధానాలను, అలాగే సాధించిన విజయాలను వివరించి వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అదేసమయంలో గత ప్రభుత్వం ఇసుక, మద్యంలో దోపిడీ చేయగా పలు మార్పులతో ప్రజలకు అనువుగా ఉండేట్లు కొత్త పాలసీలు తెచ్చామన్నారు. గత వైసీపీ వాళ్ల వలే మన వాళ్లు ఎవ్వరూ వాటి జోలికి వెళ్లరాదన్నారు.

ఆరోపణలు వచ్చే వాటి జోలికి వెళ్లవద్దు

వారసత్వంగా మద్యం వ్యాపారంలో ఉన్నటువంటి వారు ఒకే కానీ ఇప్పుడు ఆ రంగంలోకి ఎవరు వెళ్లినా మీకే కాక ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని హెచ్చరించారు. దానిని గుర్తించి మసలుకోవాలని సూచించారు. ఫీల్‌గుడ్ ఫ్యాక్టర్‌ను ప్రజల్లో కల్పించకపోతే వారు మనల్ని విశ్వసించరని అందుకు మన ప్రవర్తనే కారణం అవుతుందన్నారు. మన ప్రవర్తనే మన భవిష్యత్‌కు గీటురాయని, దీర్ఘకాలం రాజకీయాల్లో ఉండే వారు దానిని గమనించుకోవాలన్నారు. వైసీపీ పాలనలో వారు బరితెగించారు కనుకనే నోట్ల కట్టలను వారు పరిచినా ప్రజలు మనవైపు నిలిచారన్న విషయాన్ని గుర్తించి, విమర్శలు, ఆరోపణలు వచ్చే పనుల జోలికి వెళ్లరాదన్నారు. సమావేశానికి జిల్లా నుంచి మంత్రి డాక్టర్ స్వామి, ఎంపీ మాగుంటతో పాటు ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్ విజయకుమార్, ఉగ్రనరసింహారెడ్డి, కందుల నారాయణరెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జీలు గుడూరి ఎరిక్షన్‌బాబు, డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తదితరులు హాజరయ్యారు.



సమావేశంలో జిల్లా నేతలు

నేర వార్తలు

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయురాలు మృతి


ధనలక్ష్మి(ఫైల్)

అద్దంకి, అక్టోబరు18, (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయురాలు మునగాల ధనలక్ష్మి(41) మృతి చెందారు. కొరిశపాడు మండలం పి.గుడిపాడుకు చెందిన కొత్తమాసు నాగేశ్వరరావు పారాచూట్ కొబ్బరినూనె డిస్ట్రిబ్యూటర్‌గా అద్దంకిలోని ఎస్‌బీఐ(మెయిన్) బ్యాంక్ రోడ్డులో నివాసం ఉంటున్నారు. ఆయన భార్య ధనలక్ష్మి పల్నాడు జిల్లా వినుకొండ రూరల్ మండలం గోగనకొండలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తుంది. శుక్రవారం ఉదయం మరో ఉపాధ్యాయుడితో కలిసి మోటార్‌సైకిల్‌పై పాఠశాలకు వెళ్తుండగా బాపట్ల-పల్నాడు జిల్లాల సరిహద్దులో గొర్రెపాడు, నాగులవరం మధ్య ఎదురుగా బస్సు రావటంతో మోటార్‌సైకిల్ పక్కకు తిప్పటంతో రోడ్డు మార్జిన్‌లో ఉన్న గోతులోకి పోయింది. మోటార్‌సైకిల్ వెనుక కూర్చొన్న ధనలక్ష్మి గతుకుల దెబ్బకు రోడ్డుపై పడి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్సకు తరలించేలోపే మృతి చెందారు. ధనలక్ష్మి మృతదేహాన్ని అద్దంకిలోని స్వగృహానికి తీసుకొచ్చారు. ధనలక్ష్మికి భర్త, ఆరేళ్ల కుమారుడు ఉన్నారు. ఆమె మృతి పట్ల పలువురు ఉపాధ్యాయ సంఘాల నేతలు సంతాపం తెలిపారు.

పురుగు మందు తాగి యువకుడు ఆత్మహత్య


యువకుడు నాగరాజు

బల్లికురవ. అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి బానిసగా మారి పురుగు మందు తాగి వైదన గ్రామానికి చెందిన శెట్టి నాగరాజు(35) శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు, పోలీసుల కథనం మేరకు.. వైదన గ్రామానికి చెందిన శెట్టి నాగరాజు తరచూ మద్యం సేవించి కుటుంబ సభ్యులతో గొడవలు పడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది పురుగు మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే వారి బంధువులు అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు జీజీహెచ్‌కు తరలిచంగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య రామాంజమ్మ ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ బండి శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి ఇరువురు పిల్లలు ఉన్నారు.

గాయపడిన సువార్త గాయకుడు మృతి

చీరాలటౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో వేటపాలెం - చీరాల జాతీయ రహదారిలో గాయపడిన సువార్త గాయకుడు గరికపాటి బాబురావు(30) విజయవాడలో చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి కన్నుమూశారు. చినగంజాంలో ఏసుక్రీస్తు కూటములకు వెళ్లి తిరిగి ఈనెల 15న స్వగ్రామం వెళుతున్న బాబురావు జాతీయ రహదారిలో రోడ్డు పక్కన ద్విచక్ర వాహనం నిలిపి ఫోన్ మాట్లాడుతుండగా కోళ్ల డస్ట్‌తో వెళుతున్న గుర్తుతెలియని ఆటో వేగంగా ఢీకొంది. అప్పటి నుంచి చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచాడు. మృతుడు గుంటూరు దగ్గర గరికపాడు వాసి. ఇతనికి భార్య ఇద్దరు సంతానం ఉన్నారు.

కళాకారుడు రమణ మృతి

మార్టూరు, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి) : జూనియర్ ఎన్‌టీఆర్‌గా, రంగస్థల కళాకారునిగా మార్టూరు ప్రాంతంలో సుపరిచితులైన రామిచెట్టి వెంకటరమణ(65)శుక్రవారం వేకువజామున గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో మృతిచెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. గురువారం అర్ధరాత్రి నేతాజీనగర్‌లోని ఇంటి సమీపంలో గడ్డిమందు తాగి అపస్మారకస్థితిలో ఉండటంతో స్థానికులు గుర్తించి, 108 వాహనంలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుని భార్య పద్మ ఫిర్యాదు మేరకు మృతదేహానికి గుంటూరులో పోస్టుమార్టం నిర్వహించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ మహమ్మద్ బాషా తెలిపారు.

కొండమంజులూరులో జూదరుల అరెస్ట్

పంగులూరు, ఆంధ్రజ్యోతి, అక్టోబరు 18 : మండలంలోని కొండమంజులూరు గ్రామంలో పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి నలుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం రేణంగివరం పోలీసులు కొండమంజులూరు రైతు సేవా కేంద్రం సమీపంలో పేకాట ఆడుతున్న జూదరులను అదుపులోకి తీసుకుని వారి వద్ద 830 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు. అదుపులోకి తీసుకున్న వారిని కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఎస్‌ఐ వినోద్‌కుమార్ తెలిపారు.

ఇళ్ల మధ్యలో మద్యం దుకాణం వద్దు

చీరాలటౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండలం వాడరేవులో ఇళ్ల మధ్యలో మద్యం దుకాణం వద్దంటూ గ్రామస్థులు నిరసన చేపట్టారు. లైసెన్సీలు నూతన షాపును సాధించుకున్న నేపథ్యంలో గ్రామస్థులు ఆందోళనకు దిగారు. తాత్కాలికంగా దుకాణాన్ని నిలిపివేశారు.

అమ్మో.. ఆ రోడ్డా...




పర్చూరు నుంచి ఇంకొల్లు వెళ్లే(పాత మద్రాస్ రోడ్డు)లో ప్రయాణమంటే ప్రమాదాలను కొని తెచ్చుకున్నట్లే.! ఎక్కడ చూసినా గుంతలే గుంతలు. ప్రస్తుతం వర్షపు నీటితో కాలువలను తలపించే విధంగా రోడ్డు తయారైంది. గత పాలకులు ఏమాత్రం పట్టించుకోకపోవడంతో ప్రస్తుత వర్షాలకు రోడ్డు మరింత అధ్వానంగా మారింది. పర్చూరు నుంచి ఇంకొల్లు మధ్య వంకాయలపాడు, దగ్గుబాడు గ్రామాల వద్ద పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగించే ప్రధాన రోడ్డు కనీసం మరమ్మతులకు కూడా నోచుకోకపోవటంపై వాహనదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. -పర్చూరు

సెంటర్ లైటింగ్.. నిర్వహణ చీటింగ్



అద్దంకి పట్టణ పరిధిలో ఉన్న నామ్ రోడ్డులో సెంటర్ లైటింగ్ నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. నల్లవాగు వద్ద నుంచి శింగరకొండ 99 అడుగుల విగ్రహం వరకు సెంటర్ లైటింగ్ వ్యవస్థ ఉంది. దీని నిర్వహణ కొంతభాగం నామ్ రోడ్డు నిర్వహణ సంస్థ, మరి కొంత భాగం అద్దంకి మున్సిపాలిటీ చూసుకుంటుంది. లైట్ల మరమ్మతుల విషయంలో ఎవరి దారి వారిదే. దీంతో ఆ రోడ్డు తరచూ చీకటిమయంగా మారుతుంది. పట్టణ పరిధిలో వాహనచోదకులు ఇబ్బంది పడటంతో పాటు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

- అద్దంకి

గ్రామాల అభివృద్ధికి కృషి

అంబడిపూడిలో పల్లె పండుగ వారోత్సవాలలో మంత్రి రవికుమార్

బల్లికురవ, అక్టోబరు 18, (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. శుక్రవారం మండలంలోని అంబడిపూడి గ్రామంలో పల్లె పండుగ వారోత్సవాల కార్యక్రమం సందర్భంగా నూతనంగా చేపడుతున్న మురుగుకాలువల నిర్మాణానికి మంత్రి రవి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటైన 125 రోజుల్లో గ్రామాల్లో ప్రజలు రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గమనించి రాష్ట్ర వ్యాప్తంగా రూ.4500 కోట్లతో సీసీ రోడ్లు, సైడు కాలువల నిర్మాణ పనులు చేయిస్తోందన్నారు. గతంలో మాదిరి కాకుండా పనులు చేసిన వెంటనే బిల్లులు చెల్లించేలా వారం వారం చెల్లింపుల కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అమలు చేస్తున్నారని చెప్పారు. అర్హత కలిగిన వృద్ధులకు వెంటనే పింఛన్లు మంజూరు చేయిస్తామన్నారు. అనంతరం పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కుసుమకుమారి, ఎంపీపీ శ్రీలక్ష్మీ, సర్పంచ్ షైలా కుసుమకుమారి, టీడీపీ నేతలు మలినేని గోవిందరావు, మండలపు సుధాకర్, దద్దాల అంజయ్య, బొట్లగుంట వేణుబాబు, పీఆర్ ఏఈ మాధవ్, విద్యుత్ శాఖ ఈఈ మస్తాన్‌రావు పాల్గొన్నారు.


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్‌ను అందజేస్తున్న మంత్రి గొట్టిపాటి

ఎరువులు అధిక ధరలకు అమ్మకుండా కట్టడి చేయండి

రైతుల నుంచి ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో ఎరువులు అధిక ధరలకు అమ్మకుండా వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీలతో కట్టడి చేయాలని మంత్రి రవికుమార్ ఆదేశించారు. అంబడిపూడి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలువురు రైతులు ఎరువుల విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఆయన వెంటనే ఏవో కుమారిని పిలిచి రైతు సేవా కేంద్రాలలో ఎరువులు అందుబాటులో ఉంచాలన్నారు. అలానే ప్రైవేట్ డీలర్లు ఎంఆర్‌పీ కంటే అధిక ధరకు అమ్మకాలు చేస్తే వారి దుకాణాలను సీజ్ చేయాలని ఆదేశించారు. గత వైసీపీ ప్రభుత్వం తమ గృహాలకు బిల్లులు చెల్లించకుండా అడ్డుకుందని మంత్రికి తెలపగా వెంటనే ఆయన గృహనిర్మాణ శాఖ అధికార్లను 2014 నుంచి 2019 కాలంలో గృహాలకు సంబంధించిన పెండింగ్ బిల్లులు నివేదికను తయారు చేసి పంపాలన్నారు.

పంట బీమా ప్రయోజనాలు రైతులందరికీ అందాలి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి రామకృష్ణ, పక్కన ఇతర అధికారులు

మార్టూరు, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి) : రైతులందరికీ పంటల బీమా ప్రయోజనాలు అందించేందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానంపై వ్యవసాయ అధికారులు, రైతు సేవ కేంద్రం సిబ్బంది అవగాహన పెంచుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి వై రామకృష్ణ చెప్పారు. శుక్రవారం మార్టూరులో వ్యవసాయ మార్కెట్ యార్డులో పంటల బీమా, పంట కోత ప్రయోగాలు, రబీ పంటల యాజమాన్యంతోపాటు సాంకేతిక పరిజ్ఞానంపై పర్చూరు, మార్టూరు, అద్దంకి సబ్ డివిజన్‌పరిదిలోని వ్యవసాయ అధికారులకు, రైతు సేవ సిబ్బందికి అవగాహన కల్పించారు. జిల్లా వనరుల కేంద్రం బాపట్ల సహాయ వ్యవసాయ సంచాలకులు రత్నకుమారి, ఏరువాక కేంద్రం బాపట్ల కోఆర్డినేటరు డాక్టరు బాలమురళీధర్ నాయక్, శాస్త్రవేత్త డాక్టరు కామాక్షి, సహాయ వ్యవసాయ సంచాలకులు కేవీ శ్రీనివాసరావు, ఎన్ మోహనరావు, ధనరాజ్, వ్యవసాయ అధికారులు వీ కిరణ్‌కుమార్, కే వెంకటకృష్ణకుమారి, సుబ్బారెడ్డి, వేణుగోపాల్, మీరమ్మ పాల్గొన్నారు.

అన్నదాన సత్రం అధ్యక్షుడిగా పొన్నపల్లి

అద్దంకి, అక్టోబరు18, (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ విశ్వబ్రాహ్మణ అన్నదాన సత్రం నూతన కార్యవర్గం ఎన్నిక శుక్రవారమిక్కడ జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షుడుగా పొన్నపల్లి బ్రహ్మానందం, ప్రధాన కార్యదర్శిగా చింతలపూడి వీరయ్య ఆచారి, కోశాధికారిగా దేవరకొండ నాగేశ్వరరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో చెన్నుపల్లి కోటిలింగాచారి, గోళ్లపాటి వెంకటాచారి, చేబ్రోలు రవీంద్రాచారి, ఆళ్లగడ్డ వీరసుందరాచారి, తక్కెళ్లపాటి నాగేశ్వరరావు, ముప్పవరం బ్రహ్మం, కొండముది రమేష్, ముత్తలూరు హరిబాబు పాల్గొన్నారు.

పాలక మండలి సమావేశంలో నేతలు



రైల్వే ఉద్యోగుల కుటుంబాలపై ప్రత్యేక శ్రద్ధ


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

చీరాలటౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : రైల్వే ఉద్యోగుల కుటుంబాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టామని, వారి ఆరోగ్య పరంగా కూడా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఒంగోలు రైల్వే హాస్పిటల్ అడిషనల్ చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ రమణారావు చెప్పారు. శుక్రవారం చీరాల రైల్వేస్టేషన్ సముదాయంలో ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు, రిటైర్డ్ ఉద్యోగులకు హార్ట్, ఆర్థో, డెంటల్ పరీక్షలు నిర్వహించారు. రైల్వే కన్సల్టెంట్ హాస్పిటల్స్ ఒంగోలు ఆస్టర్ రమేష్, గూడూరు హరిప్రియ డెంటల్ హాస్పిటల్స్ వారు సంయుక్తంగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్లు దివి విదేహ, భారతి, ఆంజనేయులు, కిరణ్, గౌరీశంకర్, నరేష్, సురేష్ పాల్గొన్నారు.

గారపాటి మంజులదేవికు డాక్టరేట్


డాక్టరేట్ అందుకుంటున్న మంజులాదేవి

చీరాలటౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సెయింట్ మార్క్స్ లూథరన్ జూనియర్ కళాశాల అర్థశాస్త్ర అధ్యాపకురాలు గారపాటి మంజులాదేవిని డాక్టరేట్ దక్కింది. మత్స్యకారుల జీవనశైలి అంశంపై విశేషంగా పరిశోధన చేసిన అధ్యాపకురాలికి శుక్రవారం సంబంధిత అధికారులు డాక్టరేట్‌ను అందజేశారు. ఈనేపథ్యంలో కళాశాల ప్రిన్సిపల్ పుష్పరాజు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

పుర ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

చీరాల, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ పరిధిలో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబులు చెప్పారు. శుక్రవారం బదిలీపై చీరాల మున్సిపాలిటీలో డీఈగా రఘురాం, ఏఈగా బాబర్‌లు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లను మర్యాదపూర్వకంగా కలసి సన్మానించారు. కార్యక్రమంలో ఏఈ కట్టా రవి తదితరులు పాల్గొన్నారు.


చైర్మన్, వైస్‌చైర్మన్‌లను సన్మానిస్తున్న అధికారులు

బాల్య వివాహాల కట్టడికి ప్రజలు సహకరించాలి


మాట్లాడుతున్న జిల్లా చైల్డ్ ప్రొడక్షన్ అధికారి శ్రీప్రియ

బల్లికురవ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాల కట్టడికి ప్రజలంతా సహకరించాలని బాపట్ల జిల్లా చైల్డ్ ప్రొడెక్షన్ అధికారి శ్రీప్రియ చెప్పారు. శుక్రవారం మండల బాల్య వివాహ నిరోధక కమిటీ సమావేశాలు బల్లికురవ, కొణిదెన ఉన్నత పాఠశాలల్లో జరిగాయి. సదస్సులో ఎంఈవో రమేష్, ఉషారాణి, సులోచన, ప్రధానోపాధ్యాయులు హనుమంతురావు, వెంకటేశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విజయనిర్మల, మీరాబీ పాల్గొన్నారు.

మునగాకు పొడి ఆరోగ్యానికి ఎంతో మేలు

యద్దనపూడి, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): మునగాకు పొడి ఆరోగ్యానికి ఎంతో మేలు అని సూపర్‌వైజర్ సుజాత చెప్పారు. యద్దనపూడి మండలం యనమదల ఎస్సీ కాలనీలో అంగనవాడీ కేంద్రంలో శుక్రవారం తల్లుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు సౌభాగ్యం, సుబ్బలక్ష్మి,హేమలత, వర్కరు మౌనిక పాల్గొన్నారు.

చీరాల 12వ వార్డులో...

చీరాలటౌన్ : మునగాకు వినియోగం వలన రోగనిరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కుముద్వతి చెప్పారు. పట్టణ పరిధిలోని 12వా వార్డు గట్టువారివీధిలోని అంగన్వాడీ కేంద్రంలో పోషణ వేడుకలు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం సునీత, అంగన్వాడీ కార్యకర్త జ్యోతి, ఆశా వర్కర్ రాధగ్రేస్ పాల్గొన్నారు.

భరద్వాజకు నివాళులు

మార్టూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి) : జ్ఞానపీఠ అవార్డు గ్రహీత రావూరి భరద్వాజ వర్ధంతి సందర్భంగా శుక్రవారం స్థానిక అమ్మ ఆశ్రమంలో ఆయనకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు మచ్చా అనంతాచారి, పూసపాటి సాంబశివరావు, మచ్చా వెంకటేశ్వరాచారి, కొండిపర్తి వినయ్, గుంటుపల్లి చందు పాల్గొన్నారు.

22 నుంచి గ్రామసభలు

పర్చూరు, అక్టోబరు 18 : గతంలో భూముల రీసర్వే జరిగిన రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి గ్రామసభలు నిర్వహించనున్నట్లు డీటీ బ్రహ్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 22 నుంచి 25వ తేదీ వరకు దేవరపల్లి, అడుసుమల్లి, గర్నెపూడి, గొల్లపూడి గ్రామాల్లో రెవెన్యూ గ్రామసభలు నిర్వహించి రైతుల వద్ద నుంచి అర్జీలు స్వీకరిస్తామన్నారు.

రెండు అండర్ పాస్‌లలో విద్యుత్ సౌకర్యం ఏర్పాటు


కరెంటు బల్బులు ఏర్పాటుచేస్తున్న సిబ్బంది

మార్టూరు, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు మార్టూరు సెంటరులో ఉన్న రెండు చిన్న అండర్ పాస్‌లలో శుక్రవారం గ్రామ పంచాయతీ సిబ్బంది విద్యుత్ సౌకర్యాన్ని ఏర్పాటుచేశారు. గతంలో మార్టూరులో నాగరాజుపల్లి సెంటరు, గన్నవరం రోడ్ వద్ద అండర్‌పాస్‌లను ఏర్పాటు చేసినప్పటికీ హైవే అధికారులు వాటిలో విద్యుత్ సౌకర్యాన్ని ఏర్పాటు చేయలేదు. రాత్రి సమయాలలో వాటిలో నుంచి వెళ్లే ప్రయాణికులు ముఖ్యంగా మహిళలు, పిల్లలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో పంచాయతీ అధికారి తన్నీరు శ్రీనివాసరావు రెండు అండరు పాస్‌లలో విద్యుత్ సౌకర్యం, బల్బులను ఏర్పాటుచేయించారు.

గండి పూడ్చుకున్న గ్రామస్థులు


గ్రామస్థులు పూడ్చిన గండి

ఇంకొల్లు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు పాతమద్రాసు రోడ్డులో దుద్దుకూరు వద్ద నేలచప్టాపై నీరు ప్రవహించడంతో గండి పడింది. నాలుగు రోజులుగా రాకపోకలు కూడా నిలిచిపోయాయి. శుక్రవారం ఆ గ్రామస్థులు కొంతమంది పూనుకొని రెండు మూడు ట్రాక్టర్లతో చప్టా పక్కన పడిన గండిని పూడ్చుకున్నారు. తాత్కాలికంగా రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేసుకున్నారు. అధికారులు వెంటనే స్పందించి శాశ్వత పరిష్కార దిశగా చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుకుంటున్నారు.

29న అద్దంకిలో మెగా జాబ్ మేళా


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు, టీడీపీ నేతలు

అద్దంకి, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): యువతకు ఉద్యోగ కల్పనే ధ్యేయంగా ఈ నెల 29వ తేదీ అద్దంకిలో మెగా జాబ్ మేళా జరుగుతుందని అసిస్ట్ సంస్థ సెక్రటరీ కృష్ణ చెప్పారు. విద్యుత్‌శాఖ మం త్రి గొట్టిపాటి రవికుమార్ సహకారంతో అసిస్ట్, నిపుణ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లాలో జరిగే జాబ్‌మేళా పోస్టర్లను శుక్రవారం స్థానిక బంగ్లాలో వారు ఆవిష్కరించారు. 25 కంపెనీలు పాల్గొనే జాబ్ మేళాలో 1000 మందికి పైగా ఉద్యోగాలకు ఎంపిక జరుగుతుంది. పదినుంచి పీజీ వరకు చదువుకున్న యువతీ యువకులు అర్హులు అని కృష్ణ చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవీంద్ర, ఎంపీడీవో శింగయ్య, టీడీపీ నేతలు నాగినేని రామకృష్ణ, చిన్ని శ్రీనివాసరావు, కుందారపు రామారావు, కాకాని అశోక్, అనిల్ పాల్గొన్నారు.

ప్రజలకు తక్కువ ధరకు శుద్ధిజలం


ఆర్వో ప్లాంట్ ను ప్రారంభిస్తున్న మున్సిపల్ మేనేజర్ శ్రీదేవి

అద్దంకి, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణ ప్రజలకు 2 రూపాయలకే 20 లీటర్ల శుద్ధిజలం అందించటమే ధ్యేయంగా ఆర్వో ప్లాంట్ ప్రారంభించినట్లు మున్సిపల్ మేనేజర్ శ్రీదేవి చెప్పారు. అద్దంకి పట్టణంలోని 8వ వార్డు పరిధిలో ఎన్‌టీఆర్ సుజల స్రవంతి పథకం ద్వారా ప్లాంట్‌ను శు క్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు చిన్ని శ్రీనివాసరావు, దొప్పలపూడి ప్రసాద్, నర్రా సుబ్బయ్య, బిళ్లపాటి రామాంజనేయులు, నర్రా శివకృష్ణ, బోడెంపూడి రామయ్య, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు అద్దంకిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

అద్దంకి, అక్టోబరు 18, (ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణంలోని నార్త్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 9 నుంచి 12 గంటలకు వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని టౌన్ ఏఈ ఎన్ శ్రీనివాసరావు కోరారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

జాబ్ మేళాలో 32 మంది ఉద్యోగాలకు ఎంపిక


అద్దంకిటౌన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎన్టీఆర్ మెమోరియల్ డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించారు. ఈ మేళాకు జోయాలూకాస్, టాటా కాపిటల్, హెటరోడ్రగ్స్, అరబిందో ఫార్మసీ కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. మొత్తం 67 మంది అభ్యర్థులు హాజరు కాగా వారిలో 32 మంది ఆయా కంపెనీలకు ఎంపికయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీ రత్తయ్య, కరెస్పాండెంట్ ఎంఏ రత్తయ్య, బాపట్ల జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి శ్రీనివాస్, కెమిస్ట్రీ లెక్చరర్ ఏడుకొండలు, స్కిల్ హబ్ కాలేజి కోఆర్డినేటర్ గోపినాథ్, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీ పొట్టిశ్రీరాములు

నెల్లూరు

జిల్లా వార్తలు

శనివారం 19 అక్టోబరు 2024







సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు సోమిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సురేష్, ఎంపీ వేమిరెడ్డి తదితరులు



మంత్రి నారాయణ, ఎమ్మెల్యే ఇంటూరి



మంత్రి ఆనం

ఎంపీ, ఎమ్మెల్యేలను ఉద్దేశించి మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

తప్పు చేసిన వారిని వదిలి పెట్టం!

కానీ, కక్ష సాధింపు చర్యలొద్దు..!

ఎమ్మెల్యేలు, ఎంపీలకు చంద్రబాబు దిశానిర్దేశం

నెల్లూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : 'మొన్నటి ఎన్నికల్లో కూటమి పార్టీలు 93 శాతం సీట్లు గెలిచాయంటే దానికి మేమే కారణమని అత్యధిక శాతం మంది ప్రజలు భావిస్తున్నారు. ఇది నిజమే. కొంతమంది ఇతర దేశాల నుంచి రూ.లక్షలు ఖర్చు పెట్టి ఇక్కడికి వచ్చి కూటమికి ఓటేశారు. వారిలోనూ తమ వల్లే కూటమి గెలిచిందనే అభిప్రాయం ఉంటోంది. ఇది కూడా నిజమే. వీరంతా కూటమి ప్రభుత్వంలో మేలు జరుగుతుందని, హాయిగా ఉండొచ్చని ఆశించారు.

గత ప్రభుత్వంలో కొందరు నాయకులు జైలుకు పోయారు. కొందరు వేదింపులకు గురయ్యారు. కార్యకర్తలు నిద్రలేని రాత్రులు గడిపారు. దీనికి కారణం గత ప్రభుత్వ అరాచక పాలన. ఇప్పుడు మనం కూడా కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే గత ప్రభుత్వానికి, మనకు తేడా ఏముంటుంది. తప్పు చేసిన వారిని వదిలిపెట్టం. కానీ కక్ష సాధింపు చర్యలొద్దు. గతంలో నాయకులు చేసినట్లు ఎవరినీ కక్షగట్టి వేదించవద్దు.' అని ఎమ్మెల్యేలు, ఎంపీలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హితబోధ చేశారు. తప్పు చేయవద్దని, తప్పు చేసిన వారిని చట్టబద్దంగా కట్టడి చేయాలి తప్ప గత ప్రభుత్వంలో ఇబ్బందులు పెట్టారనే కారణంగా ఎవరిపైనా కక్ష సాధింపు చర్యలకు పూనుకోవద్దని, ఇది ప్రజల్లో చెడ్డ పేరు తెస్తుందని అన్నారు. శుక్రవారం అమరావతిలో జరిగిన ఎమ్మెల్యేలు, ఎంపీల సమావేశంలో చంద్రబాబు మాట్లాడుతూ సహకార సంఘాలు, నీటి సంఘాలకు త్వరలో నామినేటెడ్ కమిటీలు వేస్తామని, ఆరు నెలల్లో వీటికి ఎన్నికలు జరుపుతామన్నారు. ప్రతి నియోజకవర్గం ఒక ఇండస్ట్రియల్ హబ్‌గా తయారు కావాలని అందుకు స్థానిక ఎమ్మెల్యేలు చొరవ చూపాలని, ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లాకు చెందిన మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, కాకర్ల సురేష్, ఇంటూరి నాగేశ్వరరావు, కురుగుండ్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అధికారం ఉంది కదా అని

అడ్డగోలుగా దోచి పెట్టారు!

- పొదలకూరులో ప్రభుత్వ భూముల ధారాదత్తం
- విచారణలో తేలిన నిజాలు.. చర్యలకు రంగం సిద్ధం



అధికారం మా చేతుల్లో ఉంటే ఇక అడ్డు చెప్పేదెవరు అన్న ధోరణిలో వైసీపీ నేతలు వ్యవహరిస్తే.. అధికార పార్టీ నేతలే చెబుతున్నప్పుడు ఇక మనల్ని ప్రశ్నించేది ఎవరు... అన్న ధోరణిలో పొదలకూరు మండల రెవెన్యూ సిబ్బంది ఇష్టారీతిన వ్యవహరించారు. రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూములను వైసీపీ నేతలు, వారి బంధువులకు దోచిపెట్టారు. నాడు ఈ అక్రమాలపై ఫిర్యాదులు అందినా ఉన్నతాధికారులు పట్టించుకోలేదు. అయితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాటి అరాచకాలు వెలుగులోకి వస్తున్నాయి. భూ అక్రమాలపై ఫిర్యాదుల నేపథ్యంలో విచారణ జరిపిన జిల్లా ఉన్నతాధికారులు.. అవన్నీ వాస్తవాలని తేల్చారు. త్వరలోనే చాలా మందిపై వేటు పడే అవకాశం ఉన్నట్లు రెవెన్యూ వర్గాల్లో చర్చలు నడుస్తున్నాయి. ప్రస్తుతం ఈ వ్యవహారం రెవెన్యూలో కలకలాన్ని రేపుతోంది.

6

భూ ప్రక్షాళనకు శ్రీకారం

'జగనన్న భూ రక్ష' సమస్యల పరిష్కారంపై దృష్టి

అప్పట్లో రీసర్వే జరిగిన గ్రామాల్లో నేటినుంచి సభలు

ప్రజల నుంచి వినతుల స్వీకరణ

నెల్లూరు (హరనాథపురం), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : జగనన్న భూ రక్ష పేరిట గత వైసీపీ సర్కారు గ్రామాల్లో చేపట్టిన భూముల రీసర్వే వివాదాస్పదమైంది. దీంతో మళ్లీ గ్రామస్థుల అభిప్రాయాల సేకరణకు శనివారం నుంచి గ్రామసభలు నిర్వహించనున్నారు. నవంబరు నెలాఖరు వరకు రీసర్వే పూర్తయిన గ్రామాలలోనే ఈ సభలు జరగనున్నాయి. దీర్ఘకాలంగా ఉన్న భూ సమస్యలు రీసర్వేతో పరిష్కారం అవుతాయని అప్పటి వైసీపీ ప్రభుత్వం గొప్పగా ప్రకటించుకుంది. అయితే క్షేత్రస్థాయిలో అందుకు విరుద్ధంగా జరిగింది. జిల్లాలోని 737 గ్రామాల్లో జగనన్న భూ రక్ష రీసర్వే చేపట్టాలని భావించారు. అయితే, 329 గ్రామాలలో సర్వే సంపూర్ణంగా జరిగింది. ఈ సర్వే రైతులకు అదనపు తలనొప్పులను తీసుకొచ్చింది. ప్రజల నుంచి అనేక ఫిర్యాదులు అందడంతో ప్రస్తుత కూటమి ప్రభుత్వం జగనన్న భూరక్షను రద్దు చేసింది. రీసర్వే వల్ల ఉత్పన్నమైన సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టి, బాధితులకు న్యాయం చేయాలని నిర్ణయించింది.

● అధికారుల బృందం

గ్రామాలలో గ్రామసభల నిర్వహణకు అధికారుల బృందం ఏర్పాటైంది. ఈ బృందంలో తహసీల్దారు, డిప్యూటీ తహసీల్దారు, మండల సర్వేయర్, విలేజ్ సర్వే అధికారులు ఉంటారు. గ్రామసభల్లో భూ సమస్యలపై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారు.

● ఆ పాసుపుస్తకాల రద్దు !

వైసీపీ ప్రభుత్వంలో జగన్ చిత్రాలతో పట్టాదారు పాసుపుస్తకాలను ముద్రించి రైతులకు అందచేశారు. హద్దురాళ్ల మీద కూడా జగన్ ఫొటోలను ముద్రించారు. అయితే, పాస్‌పుస్తకాలపై జగన్ ఫొటో ఉండటంతో కొన్నిచోట్ల బ్యాంకర్లు రుణాలు ఇవ్వలేదు. రైతుల పరిస్థితిని అర్థం చేసుకున్న కూటమి ప్రభుత్వం జగన్ ఫొటోలతో ఉన్న పాస్ పుస్తకాలను రద్దు చేసి, అధికార రాజముద్ర ఉన్న పాస్ పుస్తకాలను పంపిణీ చేస్తామని ప్రకటించింది.

● విస్తీర్ణం తగ్గిందనీ..

వైసీపీ ప్రభుత్వం చేపట్టిన భూ సర్వేలో విస్తీర్ణం తగ్గిందనే ఫిర్యాదులు అధికంగా వచ్చాయి. రాజకీయ కారణాలతో భూ విస్తీర్ణాన్ని తగ్గించి చూపెట్టారని కొందరు, మృతులనూ హక్కుదారులుగా నమోదు చేశారని ఇంకొందరు ఫిర్యాదు చేశారు. గతంలో ఉన్న భూ కొలతలకు భిన్నంగా రీసర్వేలో తేడాలు వచ్చాయనీ, యజమాని పేరు మార్పు, భూసరిహద్దుల్లో లోపాలు తదితర సమస్యలు ఉత్పన్నమయ్యాయి. భూ హక్కుదారు లేకపోతే అక్కడ ఎవరినో అడిగి వివరాలను నమోదు చేయడం తాము నష్టపోయామంటూ కూడా ఫిర్యాదు వెల్లువెత్తాయి. ఇవే ఫిర్యాదులు కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదికలో, ఆర్డీఓలకు, తహసీల్దార్లకు, ప్రజాప్రతినిధులకు అందాయి. ఈ సమస్యలను పరిష్కరించడానికి కూటమి ప్రభుత్వం తాజాగా గ్రామసభలు నిర్వహిస్తోంది.

అర్జీలకు శాశ్వత పరిష్కారం

గతంలో జరిగిన భూముల రీసర్వేకు సంబంధించి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించడానికే ఈ గ్రామసభలు నిర్వహిస్తున్నాం. ఈ గ్రామ సభల్లో వచ్చిన అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపుతాం.

- కార్తీక్, జాయింట్ కలెక్టర్

సభల్లో సమస్యలు తెలపండి

రీసర్వే పూర్తయిన గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించడానికి అన్నీ ఏర్పాట్లు చేశాం. సర్వే జరిగిన ప్రాంతాలలోని భూ హక్కుదారులు ఈ సభల్లో పాల్గొని సమస్యలు తెలియచేయాలి. జాయింట్ కలెక్టర్‌తోపాటు నేను కూడా సభల్లో పాల్గొంటా.

- నాగశేఖర్, అసిస్టెంట్ డైరెక్టర్, జిల్లా సర్వే శాఖ



ఆత్మకూరు: భూముల వివరాలను తెలుసుకుంటున్న కలెక్టరు ఆనంద్

రైతులను ఆదుకుంటాం!

నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైన్ కోసం భూసేకరణ జరుగుతున్న ఆత్మకూరు, చేజర్ల, పొదలకూరు మండలాల్లో కలెక్టర్ ఆనంద్ శుక్రవారం పర్యటించారు. భూ యజమానులు, రైతులతో కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా భూములను అవార్డు చేసే సమయంలో రెండు పంటలకు పండే సారవంతమైన భూములకు అది తక్కువ ధర నిర్ణయించినందున తాము తీవ్రంగా నష్టపోతున్నట్లు పేర్కొన్నారు. భూసేకరణలో రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఇసుక రవాణా టెండర్ల రద్దు

- లక్కీ డిప్‌పై పలువురు కాంట్రాక్టర్ల ఫిర్యాదు
- కఠిన నిబంధనలతో రీ టెండర్లు పిలుస్తాం: కలెక్టర్
- అప్పటి వరకు నామినేషన్ పద్ధతిలో తరలింపు

నెల్లూరు (వెంకటేశ్వరపురం), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రీచ్‌ల నుంచి స్టాక్ యార్డులకు ఇసుకను తరలించేదుకు పిలిచిన టెండర్లను కలెక్టర్ ఓ ఆనంద్ శుక్రవారం రద్దు చేశారు. విరువూరు, మినగల్లు, పల్లిపాడు, పీకేపాడు రీచ్‌ల నుంచి ఇసుకను సమీపంలోని స్టాక్ పాయింట్ల కు తరలించేందుకు కాంట్రాక్టర్ల నుంచి టెండర్‌లను ప్రభుత్వం ఆహ్వానించిన విషయం విదితమే. టన్ను ఇసుక తరలింపునకు సరాసరి రూ.115 ఖర్చవుతుందని అధికారులు అంచనా చేశారు. అయితే గురువారం టెండర్ వేసిన దాదాపు 43 మందిలో చాలా వరకు అధికారుల అంచనా కన్నా తక్కువ మొత్తానికి కోట్ వేశారు. రూ.36కు కూడా స్టాక్ పాయింట్‌కు చేరుస్తామని బిడ్ వేయడంతో కలెక్టర్ స్పందిస్తూ లక్కీ డిప్ ద్వారా టెండర్ అప్పగిస్తామని, ప్రభుత్వం అంచనా వేసిన ధర రూ.115కు తరలించాలని ఆదేశించారు. డిప్ తీసి నలుగురికి పనులు అప్పగించారు. కలెక్టర్ నిర్ణయాన్ని కాంట్రాక్టర్లు తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రభుత్వ పెద్దలకు, మంత్రులకు, స్థానిక ఎమ్మెల్యేలకు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ మొత్తం టెండర్లు, లక్కీడిప్‌ను పూర్తిగా రద్దు చేశారు. కఠిన నిబంధనలతో మళ్లీ టెండర్లు పిలవనున్నట్లు ప్రకటించారు. అప్పటి వరకు రీచ్‌ల నుంచి ఇసుకను నామినేషన్ పద్ధతిలో స్టాక్ పాయింట్లకు తరలించేలా మైనింగ్‌శాఖ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఇసారైనా టెండర్ల ప్రక్రియ సక్రమంగా సాగుతుందో.. లేదో చూడాలి.

ప్రభుతకు పట్టని పుస్తక కేంద్రాలు

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు. వేలాది పుస్తకాలతో అన్ని వయసుల వారికి సమాచారాన్ని, విజ్ఞానాన్ని అందించే నిలయాలు. అటు వంటి గ్రంథాలయాలు జిల్లాలో అభివృద్ధికి నోచుకోవడం లేదు. జిల్లా ప్రధాన గ్రంథాలయంలోనే కూర్చోవాలంటే పాఠకులు భయపడుతున్నారు. కొత్త భవనం పూర్తికాక, ఉన్నదేమో శిథిలమై, నూతనత్వానికి నిధుల్లేక జిల్లా గ్రంథాలయ సంస్థ భారంగా రోజులు ఈడుస్తోంది.

- అభివృద్ధికి నోచని గ్రంథాలయాలు
- శిథిల భవనాల్లో పుస్తక పఠనం
- సెస్సు బకాయిలు రూ.40కోట్లు
- నత్తనడకన కొత్త భవనం నిర్మాణం
- పాలక మండలి లేక కదలిక శూన్యం

జిల్లా కేంద్ర గ్రంథాలయ భవనం



నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రధాన గ్రంథాలయంతోపాటు జిల్లాలో 61 శాఖలున్నాయి. వీటిలో నెల్లూరు రేబాల వారి వీధిలోని ప్రధాన గ్రంథాలయ, గ్రంథాలయ సంస్థ కార్యాలయ భవనం సుమారు వందేళ్ల కిందటిది. ఆ భవంతి శిథిలమై పైకప్పు కూలేందుకు సిద్ధంగా ఉంది. పెచ్చులూ డిపడి పాఠకులను భయ భ్రాంతులకు గురి చేస్తోంది. ఈ నేపథ్యంలో నూతన భవన నిర్మాణానికి 2019లో అప్పటి, ప్రస్తుత మున్సిపల్ మంత్రి పొంగూరు నారాయణ రూ.3కోట్లు మంజూరు చేసి శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా కొత్త భవనం పునాదులకే పరిమితమైంది. పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది ఆందోళనలతో ఆ తర్వాత రూ.కోటి చెల్లించారు. దీనితో భవన నిర్మాణం మొదటి అంతస్తు వరకు జరిగి ఆగిపోయింది. ప్రధానమైన ఈ గ్రంథాలయానికి అన్ని వయసుల వారు వస్తుంటారు. ముఖ్యంగా వివిధ పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు 50మందికిపైగా చదువుకుంటూ ఉంటారు. అయితే శిథిల భవనం వల్ల వారు ఏకాగ్రతగా చదువుకోలేని పరిస్థితి నెలకొంది. ఇదికాక జిల్లాలోని కొన్ని శాఖా గ్రంథాలయాల భవనాలు కూడా దెబ్బ తిన్నాయి. వాటికీ మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉంది.

పాలక మండలిని పట్టించుకోరే?

గత వైసీపీ ప్రభుత్వంలో జిల్లా గ్రంథాలయ సంస్థకు చైర్మన్ తప్ప కమిటీని నియమించలేదు. కూటమి ప్రభుత్వం వచ్చినా ఇప్పటి వరకు పాలక మండలి నియామకంపై దృష్టిపెట్ట లేదు. ఈ పరిణామం అభివృద్ధి పనులకు ఆటంకంగా మారింది. జిల్లాలోని గ్రంథాలయాలకు 2020 - 2021 సంవత్సరంలో కంప్యూటర్లు కొనుగోలు చేశారు. కానీ వాటిని పూర్తిస్థాయిలో వినియోగించడంలేదు.

పన్నులు చెల్లిస్తేగా..

గ్రంథాలయాలకు ప్రధాన ఆర్థిక వనరు స్థానిక సంస్థలు. మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలకు ప్రజలు చెల్లించే ఇంటి పన్నుల్లో 2 శాతం గ్రంథాలయ సెస్సుగా వసూలు చేస్తారు. ఆ మొత్తాన్ని గ్రంథాలయ సంస్థకు జమ చేయాల్సి ఉంటుంది. అయితే ఈ ప్రక్రియ ఎప్పటికప్పుడు జరగకపోవడంతో గ్రంథాలయాల అభివృద్ధికి, సిబ్బంది జీతాలు, పించన్ల చెల్లింపునకు నిధుల కొరత తీవ్రంగా ఉంది. సెస్సు బకాయిలు కోసం గ్రంథాలయ సంస్థ రిటైర్డ్ ఉద్యోగులు, మున్సిపల్ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. జాయింట్ కలెక్టర్, జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశాల్లో గ్రంథాలయ సెస్సులు చెల్లించాలని ఆదేశించినా నెల్లూరు నగర పాలక సంస్థ, మున్సిపాలిటీలు బేఖాతరు చేస్తూనే ఉన్నాయి. ఆ నిధులు గ్రంథాలయ సంస్థకు ఎప్పుడు చేరుతాయో చెప్పలేని పరిస్థితి నెలకొంది.

ఉమ్మడి జిల్లాలో సెస్సు బకాయిలు ఇలా..

మున్సిపల్	బకాయిలు (రూ.లలో)
నెల్లూరు	34,27,26,407
కావలి	1,19,46,383
గూడూరు	87,62,092
ఆత్మకూరు	50,27,005
వెంకటగిరి	45,86,000
నాయుడుపేట	44,96,978
బుచ్చిరెడ్డిపాలెం	11,12,091
అల్లూరు	2,43,000
మొత్తం	40,05,96,347





అసంపూర్తిగా ఉన్న గ్రంథాలయ సంస్థ భవనం

వారసత్వ సంపదగా జిల్లా కేంద్ర గ్రంథాలయం

నెల్లూరులోని జిల్లా కేంద్ర గ్రంథాలయ భవనానికి 100 సంవత్సరాలకు పైగా చరిత్ర ఉండడంతో దానిని వారసత్వ సంపదగా పరిగణించాలని జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ తెలిపారు. ఆయన ఈనెల 10వతేదీన జిల్లా గ్రంథాలయ సంస్థను సందర్శించారు. భవన మరమ్మతులకు నిధులిస్తామని హామీ ఇచ్చారు. గ్రంథాలయ సంస్థ కొత్త భవనం పూర్తయ్యాక ప్రస్తుత భవనాన్ని వారసత్వ సంపదగా పురావస్తు శాఖకు అప్పగిస్తామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో పాత భవనం మరమ్మతు పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి.

లంచం అడిగితే ఇంటికే..!

● నెల్లూరు ఆర్డీవో నాగ సంతోష్ అనూష

నెల్లూరు (వెంకటేశ్వరపురం), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని అన్నీ మండలాలతో పాటు ఆర్డీవో కార్యాలయంలో ప్రజలకు సేవలు అందించేందుకు లంచాలు అడిగితే సహించనని, అలాంటి వారిని ఇంటికి పంపిస్తానని నెల్లూరు ఆర్డీవో నాగ సంతోష్ అనూష హెచ్చరించారు. శుక్రవారం ఆమె ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. ప్రధానంగా లాండ్ కన్వర్షన్, టపాసుల లైసెన్సు విభాగాల్లో పనులు చేయడానికి కొందరు ఉద్యోగులు లంచా లు అడుతున్నారని తన దృష్టికి వచ్చిందని చెప్పారు. ఇకపై ఇలాంటి కొనసాగితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. తాను స్వయంగా పర్యవేక్షించిన తరువాత మాత్రమే అనుమతులు ఇస్తామన్నారు. టపాసుల లైసెన్సుల జారీ సైతం అంతా పారదర్శకంగా తన పర్యవేక్షణలో నిర్వహిస్తామ న్నారు. ఎవరైనా నగదు అడిగితే తనకు నేరుగా వచ్చి ఫిర్యాదు చేయవచ్చని ప్రజలకు తెలిపారు.

ఫలం చేతికందింది!

ప్రయోగం ఫలించింది..

రూ.లక్షలకు లక్షలు పెట్టుబడి పెట్టి సాగుచేస్తే ఫలితం ఎలా ఉంటుందో తెలియదు.. అన్నీ అనుకున్నట్లే జరిగినా ఫలసాయం అందాలంటే కనీసం నాలుగేళ్లు ఎదురు చూడాలని ఉద్యాన అధికారులు సైతం నిరుత్సాహ పరిచారు. కానీ పుడమితల్లినే నమ్ముకున్న ఆ రైతు మాత్రం అడుగు ముందుకు వేశాడు. తనకున్న ఐదున్నర ఎకరాలలో పూర్తిగా ఖర్జూర మొక్కలు నాటాడు. నాలుగేళ్లు వాటిని కంటికి రెప్పలా కాపాడిన ఆ రైతు ఈ ఏడాది తొలికాపు 30 కిలోల ఖర్జూర పండ్లను దించి, విక్రయించాడు. ఈ పండ్లు తిన్నవారు.. తోటను వీక్షించిన వారు 'శభాష్ రాఘవులు..' అంటూ పొగడ్తలతో ముంచెత్తుతున్నారు.

వినూత్నం

- కరవు ప్రాంతం.. ఖర్జూరానికి అనుకూలం
- ఐదున్నర ఎకరాలలో పది చెట్ల సాగు
- నాలుగేళ్ల తర్వాత ఫలసాయం
- కిలో రూ.150 వంతున విక్రయం
- ప్రభుత్వం ప్రోత్సహించాలంటున్న రాఘవులు



సాగులో ఉన్న ఖర్జూరం తోట, ఖర్జూరం గెలలు

కందుకూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఖర్జూరం.. ఈ పేరు వింటే చాలు చిన్నపిల్లల మొదలు అవ్వా తాతల వరకు నోరూరక మానదు. ఒకప్పుడు ఎక్కడో అరబ్ దేశాల నుంచి దిగుమతి అయ్యే ఖర్జూరాన్ని కొని తినడం అం టే సామాన్యులకు ఓ కలగా ఉండేది. ఇరాన్, ఇరాక్, సౌదీ, దుబాయ్‌ల నుంచి దిగుమతి చేసుకోవడం మినహా మరో ప్రత్యామ్నాయం లేని ఖర్జూరను జిల్లాలోని వలేటివారిపాలెం మండలం అత్తంటివారిపాలెంలో కంచర్ల రాఘవులు వినూత్నంగా సాగుచేసి విజయం సాధించారు. నాలుగేళ్ల క్రితం గుజరాత్ నుంచి ఒక్కో మొక్క రూ.3600 వంతున పది మొక్కలు కొనుగోలు చేసి తన ఐదున్నర ఎకరాలలో నాటాడు. మొక్కల కొనుగోలు, నీటివసతి కోసం బోర్ల ఏర్పాటు, ఇతరత్రా నిర్వహణ ఖర్చుల కోసం తొలి సంవత్సరమే ఆయనకు 25 లక్షలకు పైగా ఖర్చు అయ్యింది. ఖర్జూరం తోట వేసిన పొలం చుట్టూ రక్షణ కవచంగా వాక్కాయ మొక్కలు కూడా నాటాడు. సహజ సిద్ధంగా ముళ్లకంపవలే పెరిగే వాక్కాయ తోటలోకి పశువులు, ఇతరత్రా జీవాలు ప్రవేశించే అవకాశం లేకుండా పెరగడమే గాక ప్రస్తుతం ఏడాదికి రెండు సీజన్లలో కాపు వస్తోంది. వాక్కాయ (చెర్రీ)కు కూడా ప్రస్తుతం మార్కెట్లో గిరాకీ ఉండటంతో ఖర్జూరంతో పాటు రక్షణకు వేసిన వాక్కాయ చెట్లు కూడా రాఘవులుకు ఆదా యాన్ని తెచ్చి పెడుతున్నాయి. మార్చి, ఏప్రిల్ మాసాలలో ఖర్జూరం గెలలు వస్తాయని జూలై, ఆగస్టు నెలల్లో కోతకు వస్తాయని అడపా దడపా సెప్టెంబరు నెలాఖరు వరకు కూడా కాయలు తోటలో ఉంటా యని రాఘవులు చెబుతున్నారు. ఈ ఏడాది కొద్ది చెట్లు మాత్రమే కాపునకు రాగా కిలో 150 రూపాయల వంతున స్థానికులే పోటీపడి కొనుగోలు చేశారని చెప్పారు. దిగుమతి చేసుకునే ఖర్జూరాలతో పోలి స్తే ఇవి ఎంతో రుచిగా ఉండటమేగాక సహజసిద్ధమైనవి కావటంతో కొనుగోలుకు పోటీ ఎక్కువైందని చెబుతున్న రాఘవులు వచ్చే సంవ త్సరం ఎక్కువశాతం ఖర్జూర చెట్లు కాపునకు వస్తాయని దిగుబడి కూడా గణనీయంగా పెరుగుతుందని ఆశిస్తు న్నారు.



తోటకు రక్షణ కంచెగా వాక్కాయ చెట్లు

ప్రభుత్వ ప్రోత్సాహం అవసరం

ఖర్జూర సాగుకు ఈ ప్రాంతం అనుకూలమని తేలినందున ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తే సాగువిస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. నేను ఖర్జూరం సాగు చేయదలచినప్పుడు ఉద్యాన శాఖ అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోయింది. ప్రభుత్వం నిర్దేశించిన ఉద్యాన పంటలలో ఖర్జూరం లేనందున ఏమీ చేయలేమని అధికారులు నిస్సహాయతను వ్యక్తం చేశారు. దీంతో చేసేదిలేక రూ.లక్షలు ఖర్చుపెట్టి సాగుచేశా. ఈ ఏడాది మా తోటలో కొన్ని చెట్లకు కాపురావటం, మంచి ధరకు కాయలు అమ్మడంతో ఇప్పుడు చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా మా తోట చూసివెళ్లటానికి రైతులు వస్తున్నారు. ప్రస్తుతం ఖర్జూరం మొక్క కొనాలంటే రూ.4200 చెబుతున్నారు. ఈ స్థితిలో ఉద్యాన శాఖ ద్వారా నాణ్యమైన మొక్కలను తక్కువ ధరకు సరఫరా చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.



- కంచర్ల రాఘవులు

అధికారం ఉంది కదా అని అడ్డగోలుగా దోచి పెట్టారు!

- పొదలకూరులో ప్రభుత్వ భూముల ధారాదత్తం
- అధికారమే అండగా దోచుకున్న వైసీపీ నేతలు
- అడిగిందే తడువుగా కట్టబెట్టిన రెవెన్యూ సిబ్బంది
- అంతా తానై నడిపించిన ఓ తహసీల్దారు
- విచారణలో తేలిన నిజాలు.. చర్యలకు రంగం సిద్ధం

నెల్లూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వం చివరి ఏడాది కాలంలో పొదలకూరు మండలంలో అనేక భూ అక్రమాలు జరిగాయి. అప్పట్లో పనిచేసిన ఓ తహసీల్దార్ వైసీపీ నాయకులు అడిగిందే తడువుగా నిబంధనలు పక్కనపెట్టి దోచిపెట్టారు. అందులో ప్రధానమైది అసైన్‌మెంట్ పట్టాల వ్యవహారం. అర్హులైన పేదలకు భూములు పంపిణీ చేస్తున్నామని నాడు వైసీపీ ప్రభుత్వం ప్రకటించినా ఈ పథకం వైసీపీ నేతలకు ఒక వరంగా మారింది. భూస్వాములు కూడా పేదల అవతారమెత్తి ప్రభుత్వ భూములను కొల్లగొట్టారు. పొదలకూరు మండలంలో అసలు పేదలే లేనట్లుగా వెంకటాచలం, తిరుపతి జిల్లా కోట వంటి మండలాల్లోని వైసీపీ నేతలకు కూడా అసైన్‌మెంట్ పట్టాలు పంపిణీ చేసినట్లు అధికారుల విచారణలో తేలింది. ఇక కొంతమందికైతే అసలు అసైన్‌మెంట్ కమిటీ ఆమోదం లేకుండానే పట్టాలు కూడా పంపిణీ చేయడం గమనార్హం. రాష్ట్రమంతా ఒక ఫార్మాట్లో అసైన్‌మెంట్ పట్టాలు తయారు చేస్తే ఒక్క పొదలకూరు మండలంలో మాత్రం మరో రకమైన ఫార్మాట్‌లో పట్టాలు రూపొందించారు. ఈ పట్టాలను చూసి జాయింట్ కలెక్టర్ కూడా ఆశ్చర్యపోయినట్లు సమాచారం. ఆరోపణలు ఎదుర్కొంటున్న తహసీల్దార్‌నే ఈ పట్టాలను రూపొందించినట్లు చెప్పుకుంటున్నారు. ఇదంతా అధికారుల విచారణలో బట్టబయలైంది. ఇక పోరంబోకు భూములను కూడా అసైన్‌మెంట్ మాటున వైసీపీ నేతలకు దోచిపెట్టినట్లు తెలుస్తోంది. ఓ గ్రామంలో పోరంబోకు భూములను ఏకంగా ఓ మైనింగ్ కంపెనీ పేరు మీదకు మార్చేయడం గమనార్హం. అలానే ఫ్రీహోల్డ్ మాటున కూడా భారీగా అక్రమాలు జరిగినట్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందా యి. గతంలో ఎస్సీ, ఎస్టీలకు పంపిణీ చేసిన భూములను వైసీపీ నేతలు కొనుగోలు చేసి, ఫ్రీహోల్డ్ మాటున వాటిని వారి పేర్ల పైకి ఎక్కించుకోవడంతో పాటు నిషేధిత జాబితా నుంచి తొలగించినట్లు ఫిర్యాదుల్లో ఉంది. ఇటువంటి అక్రమ వ్యవహారాలు కూడా అధికారులు విచారణలో బయటపడుతున్నాయి. ఇప్పటికే అందిన ఫిర్యాదులపై ఆర్డీవో విచారణ పూర్తి చేయగా, ఆ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకునేందుకు కలెక్టర్, జేసీ సిద్ధమవుతున్నారు.

● అప్పుడు.. ఇప్పుడు అక్కడే..!

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదట్లో పొదలకూరు తహసీల్దార్‌గా సచివాలయం నుంచి ట్రైనీగా వచ్చిన స్వాతి పని చేశారు. ఆ సమయంలో అనేక భూ అక్రమా లు జరిగాయి. అప్పట్లో ప్రభుత్వ భూముల మ్యుటేషన్, క్లాసిఫికేషన్ మార్పే లాగిన్ తహసీల్దార్లకే ఉండడంతో విచ్చలవిడిగా అక్రమా లు చోటుచేసుకున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా రికార్డులు మార్చిన కేసులు వందల్లో ఉన్నట్లు నాడు ఫిర్యాదులు అందాయి. ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తుల పేర్లపైకి ఎక్కించడమే కాకుండా పట్టా భూములను కూడా ఇష్టానుసారంగా మ్యుటేషన్లు చేశారు. స్వాతి హయాంలో జరిగిన మ్యుటేషన్‌లపై విచారణ చేసేందుకు రెండు గ్రామాలకు ఒక తహసీల్దార్ చొప్పున ఏకంగా ఎనిమిది తహసీల్దార్లను పొదలకూరు మండలంలో విచారణకు దించారంటే అక్కడ ఏం జరిగిందో అర్థం చేసుకోవచ్చు. ఈ విచారణలో అక్రమాలు తేలడంతో అప్పటి తహసీల్దార్ స్వాతిని ప్రభుత్వం సస్పెండ్ చేసింది. అయితే ఆ తర్వాత కూడా పొదలకూరు మండలంలో రెవెన్యూ వ్యవస్థ పాఠాలు నేర్వలేదు. మళ్లీ అదే అక్రమ బాటలో పయ నించారు. ఇష్టానుసారంగా ప్రభుత్వ భూములను దోచిపెట్టారు. ఈదఫా కూడా పొదలకూరులో భూఅక్రమాలపై ఉన్నత స్థాయి విచారణ జరగ్గా, ఇప్పుడు కూడా అక్రమాలు జరిగినట్లు విచారణలో తేలడం గమనార్హం. ఇది అప్పట్లో మంత్రిగా పనిచేసిన కాకాణి గోవర్ధన్‌రెడ్డి సొంత మండలం కావడం కొసమెరుపు.



చార్జెస్ ఫ్రేమ్ చేస్తున్నాం

పొదలకూరు మండలంలో భూ అక్రమాలు జరిగాయన్న ఫిర్యాదులపై విచారణ పూర్తి చేశాం. కొన్ని అవకతవకలు జరిగినట్లు తేలింది. అనర్హులకు అసైన్‌మెంట్ పట్టాలు ఇవ్వడం, అసైన్‌మెంట్ కమిటీ ఆమోదం లేకుండానే ఇంకొందరికి పట్టాలు పంపిణీ చేయడం, పోరంబోకు భూములను మైనింగ్ కంపెనీ పేరు మీదకు మార్చడం వంటి పలు విషయాలు విచారణలో తేలాయి. ఇందుకు సంబంధించి బాధ్యులైన నాటి తహసీల్దార్, రెవెన్యూ సిబ్బందిపై చార్జెస్ ఫ్రేమ్ చేస్తున్నాం. నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం.

- కే కార్తీక్, జాయింట్ కలెక్టర్

21న విశ్రాంత ఉద్యోగుల సమావేశం

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : విశ్రాంత ఉద్యోగుల సంఘం సమావేశాన్ని ఈనెల 21వ తేదీ నిర్వహిస్తున్నామని ఏపీస్టేట్ గవర్నమెంటు రిటైర్డు ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఐ లక్ష్మీనారాయణ, కార్యదర్శి పీ వెంకయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం 5 గంటలకు టౌన్‌హాల్లో జరిగే ఈ సమావేశానికి తాలూకా అధ్యక్షులు, కార్యదర్శులు, కార్యవర్గసభ్యులు హాజరు కావాలని కోరారు.

ఓపెన్‌స్కూల్ రిజిస్ట్రేషన్ గడువు పొడిగింపు

నెల్లూరు (విద్య), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ఓపెన్‌స్కూల్ ప్రవేశాలకు ఈనెల 31వతేదీ వరకు గడువు పొడిగిస్తున్నట్లు డీఈవో రామారావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు ఈనెల 25వతేదీ వరకు ఎలాంటి అదనపు చెల్లింపులు లేకుండా ప్రవేశాలు పొందవచ్చన్నారు. అనంతరం 29వతేదీ వరకు రూ.200, ఈనెల 30, 31వతేదీల్లో రూ.500 అదనపు రుసుమును చెల్లించి అడ్మిషన్ పొందాలన్నారు. వ్యక్తిగతంగాగానీ, ఏపీ ఆన్‌లైన్ కేంద్రాలు, గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా గానీ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు apopenschoo.ap.gov.in వెబ్‌సైట్‌కానీ, సమీపంలోని అధ్యయన కేంద్రాల్లో కానీ, 9000619699 నెంబరను కానీ సంప్రదించాలని కోరారు.

క్షయ నిర్మూలనే లక్ష్యంగా పని చేయాలి

● అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి



వెంకటాచలం : మాట్లాడుతున్న అదనపు డీఎంహెచ్‌వో ఖాదర్‌వలి

మనుబోలు/వెంకటాచలం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): వైద్యసిబ్బంది 2029 నాటికి క్షయనిర్మూలనే లక్ష్యంగా పనిచేయాలని జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఖాదరవలి ఆదేశించారు. శుక్రవారం ఆయన మనుబోలు, వెంకటాచలం మండలంలోని కసుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సిబ్బందితో వైద్యసేవలపై సమీక్షించారు. బీసీజీ వ్యాక్సినేషన్, క్షయవ్యాధిగ్రస్తులకు అందించే చికిత్స, గర్భిణులు, పిల్లలకు ఇచ్చే వ్యాధినిరోధక టీకాలపై చర్చించారు. క్రమం తప్పకుండా ప్రతి బుధ, శనివారాల్లో వ్యాక్సిన్ కచ్చితంగా వేయాలని సూచించారు. ప్రతి సచివాలయానికి క్లోరిన్ టాబ్లెట్స్ సరఫరా చేశామని, వాటిని మంచినీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేసిన నీటిని వదిలేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాల్లో వైద్యాధికారులు డాక్టర్ గేయపూజిత, డాక్టర్ కీర్తిప్రియా, సీహెచ్‌వోలు రాజయ్య, రామసుబ్బారెడ్డి, సూపర్‌వైజర్లు రమణయ్య, వెంకటేశ్వర్లు, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



చినుకురాలితే చిత్తడే!

సోమశిల జలాశయం వద్ద సోమేశ్వరుడి ఆలయం ముందున్న రోడ్డు ఇది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డంతా చిత్తడిగా మారిపోయింది. అంతకుముందు గుంతలమయంగా ఉన్న రోడ్డుపై ఇటీవల కంకర మిశ్రమాన్ని చల్లారు. ప్రస్తుత వర్షాలకు రోడ్డంతా చిత్తడిగా మారి వాహనాలు అదుపు తప్పుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేయాలని వాహన చోదకులు కోరుతున్నారు.

- అనంతసాగరం (ఆంధ్రజ్యోతి)

క్రీడల్‌కు బూస్ట్ ఇవ్వండి!

- వైసీపీ సర్కారులో మొక్కుబడిగా క్రీడల నిర్వహణ
- మొండిగోడలు దాటని కేవీకేల నిర్మాణం
- మొగళ్లపాళెం క్రీడాగ్రామానికి గ్రహణం
- నేడు నెల్లూరులో శాప్ చైర్మన్ పర్యటన



నెల్లూరు (విద్య), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో డీఎస్ఏకు సంబంధించిన ఇండోర్ లేదా అవుట్‌డోర్ స్టేడియాల్లో అడుగు పెట్టాలన్నా, ఆటలాడాలన్నా నగదు ఖచ్చితంగా చెల్లించాలంటూ రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాప్) ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. గత వైసీపీ ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నెం 20తో ఇబ్బందిగా మారింది. 14 ఏళ్లలోపు క్రీడాకారులకు ఒక రేటు, 14 ఏళ్లు పైబడిన వారికి ఒక రేటు నిర్ణయించి ఆయా ధరల పట్టికను డీఎస్ఏకు పంపించారు. ప్రభుత్వం మారినా నేటికీ ఈ జీఓ కొనసాగుతుండటంతో క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు.

● క్రీడా గ్రామానికి గ్రహణం

రాష్ట్రంలో 2019లో జాతీయ క్రీడల నిర్వహణే లక్ష్యంగా నెల్లూరు రూరల్ మండలంలోని మొగళ్లపాళెంలో 2014లో క్రీడా గ్రామం కోసం 150 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో డీపీఆర్(డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్) రూపొందించి పంపాలని నాటి కేంద్రమంత్రి ఎం.వెంకయ్యనాయుడు అప్పటి రాష్ట్ర సర్కారును కోరారు. 2016లో 150 ఎకరాలు శాప్ ఆధ్వర్యంలోకి వచ్చింది. శాప్ ప్రతిపాదనలకు వెంకయ్యనాయుడు ప్రత్యేక చొరవ చూపి నాటి కేంద్ర క్రీడల మంత్రిత్వ శాఖను ఒప్పించారు. రాష్ట్ర సర్కారు ఇందుకోసం శాప్ ద్వారా ప్రహరీగోడ, విద్యుత్, రోడ్లు, నీటి సౌకర్యం కల్పించేందుకు రూ.4.60 కోట్లు విడుదల చేసింది. సకాలంలో డీపీఆర్ రూపొందించి కేంద్ర సర్కా రుకు పంపితే క్రీడాగ్రామం కోసం రూ.200 కోట్లతో అంతర్జాతీయ క్రీడా ప్రమాణాల కలిగిన క్రీడాప్రాంగణాలు రూపుదిద్దుకునే అవకాశం ఉందని వెంకయ్యనాయుడు సూచనలు చేసినా ప్రభుత్వం తగిన ప్రాధాన్యత చూపలేకపోయింది. 2016లో రాష్ట్ర ప్రభుత్వం రూ.6 కోట్లు విడుదల చేయగా, ఈ నిధులను భూ సేకరణలో భాగంగా రైతులకు చెల్లించి భూమిని స్వాధీనం చేసుకుంది. అయితే ఇప్పటికీ వీటి నిర్మాణాలు నత్తనడకన సాగుతోంది. తొలిదశలో రూ.8కోట్లతో మల్టీ ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మించేందుకు 2017 మార్చిలో భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ పనులను 2022లో పూర్తి చేసి 2023లో డీఎస్ఏకు అప్పగించారు. అప్పటి నుంచి ఈ ఇండోర్ స్టేడియం ప్రారంభానికి ఎదురుచూస్తోంది. ఈ పరిస్థితుల్లో నూతనంగా నియమితులైన శాప్ చైర్మన్ రవికుమార్ శనివారం జిల్లా పర్యటనకు వస్తున్నారు. ఉదయం మొగళ్లపాళెం మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం, ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలోని డీఎస్ఏ కార్యాలయాన్ని ఆయన సందర్శించనున్నారు. రవికుమార్ పర్యటనతోనైనా జిల్లాలో క్రీడారంగానికి పూర్వవైభవం వచ్చేనా అని క్రీడాకారులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

● కలగానే క్రీడా వికాస కేంద్రాలు

అధికారుల పర్యవేక్షణ లోపం.. ఇంజనీరింగ్ అధికారుల ఉదాసీనతతో జిల్లాలో నిర్మించాల్సిన క్రీడా వికాస కేంద్రాల (కేవీకే) నిర్మాణాలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారయ్యాయి. గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులను ప్రోత్సహించి వారిని జాతీయస్థాయిలో ఆడేలా తయారు చేయాలనే లక్ష్యంతో ఏర్పాటు చేయనున్న కేవీకేలు కలగానే మిగిలిపోయాయి. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో నియోజకవర్గానికి ఒక్కో కేవీకే చొప్పున తొలివిడతగా నాలుగు మంజూరైనా వాటి ఊసే లేకుండా పోయింది. మిగిలిన ఆరు కేంద్రాల గురించి అసలు పట్టించుకునే నాథుడే లేడు. ఒక్కో స్టేడియం నిర్మాణానికి రూ.2కోట్లు కేటాయించినా ఒకటి కూడా పూర్తి కాలేదు.

● పూర్వవైభవం వచ్చేనా...?

గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం క్రీడలను పూర్తిగా నిర్వీర్యం చేయడంతో ఔత్సాహిక క్రీడాకారులు, ప్రతిభ కలిగిన వారు క్రీడలకు దూరమైపోయారు. ఈ నేపథ్యంలో నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వంలో క్రీడలకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించి పూర్వవైభవం తీసుకురాకపోతుందా అని క్రీడాకారులు ఎదురు చూస్తున్నారు.

మాట్లాడుతున్న వీరంపల్లి పొదుపు మహిళలు



స్త్రీనిధి, ఉన్నతి డబ్బు స్వాహాపై ఫిర్యాదు

- బ్యాంకు నోటీసులతో బయటపడ్డ వైనం
- పోలీసుల ముందు లబోదిబోమన్న పొదుపు మహిళలు

మనుబోలు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): తమ గ్రామానికి చెందిన వీవోఏ భారతి తాము చెల్లించిన స్త్రీనిధి, ఉన్నతి పథకాల డబ్బులను స్వాహా చేసిందంటూ వీరంపల్లి పొదుపు మహిళలు శుక్రవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామంలో సుమారుగా 42 పొదుపు సంఘాలు ఉన్నాయన్నారు. 2020నుంచి కొన్ని సంఘాల సభ్యులు స్త్రీనిధి, ఉన్నతి పథకాల ద్వారా రుణాలను బ్యాంకుల ద్వారా తెచ్చుకున్నామన్నారు. ప్రతినెలా వాయిదాలను వీవోఏ భారతికి ఇచ్చి రసీదులు తీసుకున్నామన్నారు. అయితే గూడూరు సిండికేట్ బ్యాంకు అధికారులు రుణాలు చెల్లించలేదని, రూ.20 వేలు బకాయిలు ఉన్నాయంటూ గురువారం గ్రామంలోని దాదాపు 80మంది పొదుపు మహిళలకు నోటీసులు ఇచ్చారన్నారు. దీంతో అందరూ అవాక్కయ్యమన్నారు. దీనిపై వీవోఏని ప్రశ్నించగా తనకేమి సంబంధం లేదని, ఎవరికైనా చెప్పుకోండంటూ బదులు చెప్పిందని వాపోయారు. ఎలాగైనా తమకు న్యాయం చేయాలంటూ పొదుపు మహిళలు పోలీసుల ఎదుట లబోదిబోమన్నా రు. వీవోఏని విచారించి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ మహిళలకు హామీ ఇచ్చారు.

అలరించిన అష్టావధానం

● ముగిసిన హనుమజ్జానకీ రామశర్మ శత జయంతి సభ

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : పోలూరి హనుమజ్జానకీ రామశర్మ శత జయంతి ముగింపు సమావేశం శుక్ర వారం నెల్లూరు టౌనుహాలులో జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన అష్టావ ధానం అలరించింది. ఈ కార్యక్రమాన్ని పద్య కళాపరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్రప్రసాద్, కోశాధికారి నలబోలు బలరామయ్యనాయుడు, నిర్వాహకులు వేదం వెంకటరాధాకృష్ణ ప్రారంభించారు. డాక్టర్ సూరం శ్రీనివాసులు అధ్యక్షతన కొండేపి మురళీకృష్ణ అష్టావధానం నిర్వహించారు. సమస్యను డాక్టర్ ఎస్ఎస్ఆర్‌కే ప్రసాదరావు, దత్తపది డాక్టర్ కే గిరిజాలక్ష్మి, స్వస్తాక్షరీ సూరం అరుణ, వర్ణన సీహెచ్ వీ బృందావనరావు, నిషిద్ధాక్షరిగా అగస్త్య రాజు సుబ్బారావు, ఆశువుగా పోలవరం లక్ష్మీనర సింహారావు, చందోభాషణాన్ని డాక్టర్ సీహెచ్ వెంకటేశ్వరరావు, అప్రస్తుత ప్రసంగంతో బత్తిన సాయికుమార్‌రెడ్డి అవధానాన్ని రక్తి కట్టించారు. ఈ కార్యక్రమంలో పోలూరి హనుమజ్జానకీ రామశర్మ రచించిన శ్రీరామపట్టాభిషేకం పుస్తకాలను వితరణ చేశారు. పలువురు సాహితీ అభిమానులు పాల్గొన్నారు.



అష్టావధానంలో సాహితీకారులు

సోమశిల.. జలకళ

అనంతసాగరం (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయంలో నీటిమట్టం పెరుగుతోంది. ఎగువ నుంచి భారీగా వరద వచ్చి చేరుతోంది. శుక్రవారం 33,891 క్యూసెక్కుల వరద వస్తున్నట్లు అధికారులు తెలిపారు. డ్యాంలో 57.036 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 50, కండలేరుకు 10,000, ఉత్తర కాలువకు 40 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

● రాళ్లపాడులో..

లింగసముద్రం (ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు ప్రాజెక్టులో నీటిమట్టం 14.6 అడుగులకు చేరింది. ప్రస్తుతం ఇన్‌ఫ్లో కేవలం 190 కూసెక్కులు మాత్రమే ఉంది. ఈ వర్షాలకు ముందు ప్రాజెక్టులో 8.7 అడుగుల నీటి మట్టం ఉం డగా, వరద రాక మొదలవడంతో నీటినిల్వ పెరుగుతూ వచ్చింది. అయితే, మరో 2 అడు గుల నీరు చేరితే వరి సాగుకు అనుకూలంగా ఉంటుందని రైతులు అంటున్నారు. వాస్తవానికి ప్రాజెక్టు సామర్థ్యం 20 అడు గులు ఉన్నా 21.6 అడుగుల మేర నిల్వ చేసుకునే అవకాశం ఉంది. అయితే ప్రాజెక్టు భద్రత దృష్ట్యా అధికారులు 20 అడుగుల నీరు మాత్రమే నిల్వ చేస్తున్నారు.

● నీటి విడుదలకు సన్నాహాలు

సంగం (ఆంధ్రజ్యోతి): సంగం బ్యారేజీ నుంచి నీటి విడుదలకు ఇరిగేషన్ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. వర్షాలు తగ్గడంతో కాలువలకు, చెరువులకు క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి వరద రావడం ఆగిపోయింది. దీంతో పెన్నానదికి వస్తున్న వరదతో బ్యారేజీ వద్ద నీటి మట్టం పెంచేందుకు శుక్రవారం ఎత్తిన గేట్లను మూసేశారు. ప్రస్తుతం బ్యారేజ్ వద్ద 10 అడుగుల నీటిమట్టం ఉంది. ఎగువ నుంచి బ్యారేజీకి సుమారు 6 వేల క్యూసెక్కుల నీరు వస్తోంది. కనిగిరి రిజర్వాయర్‌కు, బీపీఆర్, కనుపూరు, నెల్లూరు చెరువు కాలువలకు నీటిని విడుదల చేసేందుకు చర్యలు చేపట్టారు. నీటిమట్టం పెరగ్గానే నీటిని విడుదల చేస్తామని ఏఈ వినయ్ కుమార్ తెలిపారు.

న్యూస్ బాక్స్

నేడు ఎమ్మెల్యే కాకర్ల రాక

ఉదయగిరి రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా శనివారం ఎమ్మెల్యే కాకర్ల సురేష్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్ రానున్నట్లు మండల టీడీపీ కన్వీనర్ చింతన బోయిన శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈసందర్భంగా వారు మండలంలోని నేలటూరు, శకునాలపల్లి, జీ.చెర్లోపల్లి, జీ.చెరువుపల్లి పంచాయతీల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారన్నారు. కావున టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

ఎమ్పీడీవోకు సన్మానం

కావలిరూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కావలి ఎంపీడీవోగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన శ్రీదేవిని శుక్రవారం టీడీపీ, బీజేపీ నేతలు ఎమ్పీడీవో కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించారు.

అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ

● రోడ్డుప్రమాదాల నివారణపై వాహనదారులకు అవగాహన

కావలి రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అప్రమత్తతతో రోడ్డుప్రమాదాల నివారణ సాధ్యమని, ద్విచక్ర వాహన చోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని సీఐ రాజేశ్వరరావు పేర్కొన్నారు. రుద్రకోట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం హెల్మెట్ వాడకం, డ్రైవింగ్ లైసెన్స్‌లపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం జాతీయ రహదారిపై పర్యటించి ఎక్కువగా ప్రమాదాలు జరిగే గౌరవరం, తుమ్మలపెంట రోడ్డు, మద్దూరుపాడు ప్రాంతాలను గుర్తించారు. వాహన వేగ నియంత్రణకు రేడియం స్టిక్కర్లతో డ్రమ్ములు, బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు తిరుమలరెడ్డి, బాజీబాబు, ప్రిన్సిపాల్ సునీల్ కుమార్ ప్రియ, సిబ్బంది పాల్గొన్నారు.

● కందుకూరు : రోడ్డు ప్రమాదాల నివారణపై కందుకూరు టౌన్ ఎస్సై వీ సాంబశివయ్య వాహన చోదకులకు అవగాహన కల్పించారు. శుక్రవారం పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహం కూడలి వద్ద వాహనదారులకు పలు సూచనలు చేశారు. విధిగా వాహక చోదకులు డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని సూచించారు.

● ఉదయగిరి రూరల్ : ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక వైఎస్ఆర్ సర్కిల్ వద్ద ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరించపోతే జరిమానా తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


కావలి రూరల్: హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పిస్తున్న సీఐ

వేగనిరోధకాల ఏర్పాటు

● దుత్తలూరు(ఉదయగిరి రూరల్) : ప్రమాదాల నివారణలో భాగంగా మండలంలోని తెడ్డుపాడు గ్రామ సమీపంలో పిల్లాపేరు వాగు వద్ద 565 జాతీయ రహదారిపై వేగనిరోధకాలు ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ ఆదిలక్ష్మీ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రమాదాలు జరిగే ప్రదేశంలో డ్రమ్ముల్లో మట్టిని నింపి వాహనాల వేగ నియంత్రణకు చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

రాళ్లపాడు ప్రాజెక్టుకు ఇద్దరు డీఈల నియామకం

లింగసముద్రం (ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు ప్రాజెక్టుకు ఇరిగేషన్ ఉన్నతాధికారులు ఇద్దరు డీఈలను నియమించారు. ప్రకాశం జిల్లాలోని సంతనూతలపాడు నుంచి డీఈ వెంకటేశ్వర్లును, బాపట్ల జిల్లాలోని అద్దంకి నుంచి ఏఈ మధుసూదనరావును ఇన్‌చార్జ్ డీఈగా ప్రాజెక్టుకు నియమించారు. దీంతో వారు ఇద్దరు శుక్రవారం విధుల్లో చేరారు.

మాలమాదిగలను విడగొట్టడం రాజ్యాంగ విరుద్ధం

● మాలల మహాగర్జనను విజయవంతం చేద్దాం : ఎల్లు సాల్మన్‌రాజు

అల్లూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మాల మాదిగలను విడగొట్టడం రాజ్యాంగ విరుద్ధమని, ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా నిర్వహించే మాలల మహాగర్జనను విజయవంతం చేయాలని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు అన్నారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన దళితులతో కలసి అల్లూరులో ఆయన శుక్రవారం రాత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజకీయ లబ్ధి కోసం మాల మాదిగలను విడగొడుతూ ఎస్సీ వర్గీకరణ అనే ప్రక్రియను తెరపైకి తీసుకొచ్చారని, దీనికి వ్యతిరేకంగా చేపట్టాల్సిన కార్యాచరణను రూపొందించడం జరిగిందన్నారు. దీనిని ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా నిర్వర్తించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. నవంబరు 4న అల్లూరులో నిర్వహించే మాలల మహాగర్జన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అరగల రమణయ్య, పంగులూరు శ్రీనివాసులు, దానం మాల్యాద్రి, పంగులూరు సుధాకర్, ముసలి నరేంద్ర, కమలాకర్, చెన్నయ్య, దగ్గల మనోహర్, గంగపట్నం సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎల్లు సాల్మన్‌రాజు

మార్చి నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి

ఉదయగిరిరూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): హౌసింగ్ లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టే లబ్ధిదారులు వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తిచేయాలని హౌసింగ్ ఈఈ దయాకర్ సూచించారు. శుక్రవారం మండలంలోని శకునాలపల్లి, పుల్లాయపల్లి గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న పక్కాగృహాలను పరిశీలించి లబ్ధిదారులకు తగు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉద్యోగులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద గృహ లబ్ధిదారులకు అందాల్సిన 90 రోజుల పనిదినాల నగదును త్వరితగతిన అందించాలన్నారు. లబ్ధిదారులు పొదుపు గ్రూపుల్లో సభ్యులు అయినట్లయితే వారికి రూ.35 వేల రుణం ఇచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అప్పాజీ, హౌసింగ్ ఏఈ రామకృష్ణ, ఏపీఎం ఖాజారంతుల్లా, ఏపీవో శ్రీనివాసులు, వర్కు ఇన్‌స్పెక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ షరీఫ్ పాల్గొన్నారు.


పక్కాగృహాన్ని పరిశీలిస్తున్న ఈఈ దయాకర్

పారిశ్రామికాభివృద్ధికి సహకరించండి

● ఎమ్మెస్ఎంఈ చైర్మన్‌కు అళహరి వినతి

కావలిటౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కావలి పరిసర ప్రాంతాల్లో పారిశ్రామికాభివృద్ధికి సహకరించాలని ఏపీ ఎమ్మెస్ఎంఈ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్‌ని కావలి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి అళహరి సుధాకర్ కోరారు. శుక్రవారం అమరావతిలో అళహరి తమ్మిరెడ్డిని కలిసి జ్ఞాపిక అందించి సత్కరించారు. కావలి సమీపంలోని రామాయపట్నం ఓడరేవు నిర్మాణం జరుగుతున్నందున అందుకు అనుసంధాన పరిశ్రమలను కావలి ప్రాంతంలో ఏర్పాడితే కావలి అభివృద్ధికి దోహదపడడంతోపాటు నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలియచేశారు.


తమ్మిరెడ్డిని సత్కరిస్తున్న అళహరి సుధాకర్

దెబ్బతిన్న వరిపంట పరిశీలన

అనంతసాగరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి, కచ్చేరిదేవరాయపల్లిలో వర్షాలతో దెబ్బతిన్న వరి పంటను జిల్లా అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ శివన్నారాయణ, ఏడీ దేవసేనమ్మ పంటను చూసి రైతులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏవో శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎంతమార్పు.. పల్లెల్లో తక్షణ చర్యలు

● వర్షాలు తగ్గడంతోనే పంచాయతీల్లో పారిశుధ్య పనులు

జలదంకి, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో పంచాయతీలకు అందాల్సిన నిదులు దొడ్డిదారిన రాష్ట్రప్రభుత్వం లాక్కుంది. దీంతో సర్పంచులు కనీసం బ్లీచింగ్ కొనేందుకు కూడా నగదు ఉండేది కాదు. ప్రస్తుతం ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌లు కేంద్రప్రభుత్వం అందించే ఆర్థిక సంఘం నిధులు సర్పంచుల ఖాతాల్లో జమచేసింది. దీంతో సర్పంచులు పంచాయతీల అభివృద్ధికి పనులు చేపడుతున్నారు. ఈ క్రమంలో 4రోజులుగా వర్షాలు కురిసి గురువారంతో ఆగిపోయాయి. దీంతో శుక్రవారం జలదంకి మండలంలోని అన్ని పంచాయతీలలో ఎంపీడీవో బ్రహ్మయ్య ఆధ్వర్యంలో బ్లీచింగ్ చల్లి పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టారు. వాటర్‌ట్యాంకులలో బ్లీచింగ్ పౌడర్ కలిపారు. ఇది చూసిన గ్రామీణ ప్రజలు ఎన్నాళ్లైంది పారిశుధ్య పనులు చేపట్టి అని, పాలన అంటే ఇలా ఉండాలంటూ ప్రశంసిస్తున్నారు.

● మర్రిపాడు : మండలంలో ఫ్రైడే డ్రైడర్ కార్యక్రమం శుక్రవారం ఎంపీడీవో నాగేశ్వర ప్రసాద్ నిర్వహించారు. గ్రామాల్లో రోడ్లపై చేరిన నీరు, మురికిని తొలగించారు. ప్రజలు కాచిన నీటిని తాగాలని గ్రామాల్లో దండోరా వేయించారు.


జలదంకి: బ్రాహ్మణక్రాకలో డ్రైనేజీలో బ్లీచింగ్ చల్లుతున్న పంచాయతీ సిబ్బంది

తుఫాన్ బాధితులకు సాయమందించాలి : సీపీఎం

కావలిటౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ తాకిడికి ఇబ్బందిపడ్డ పేదలకు ప్రభుత్వ సాయమందించాలని సీపీఎం నేతలు కోరారు. ఈ మేరకు శుక్రవారం సీపీఎం పట్టణ కార్యదర్శి పెంచలయ్య ఆధ్వర్యంలో ఆర్డీవో వంశీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. తుఫాన్ ప్రభావంతో పట్టణంలోని కాలనీలు నీట మునిగాయని, నిత్యావసరాలు, దుస్తులు, గృహోపకరణాలు నీళ్లపాలైనాయన్నారు. పేద కూలీలకు పనులు లేక ఉపాధి కోల్పోయారని, వెంటనే ప్రభుత్వం స్పందించి వారిని అన్నివిధాలా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో నేతలు మధుసూదన్‌రావు, కృష్ణమోహన్, తిరుపాలు, బాబురావు, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించండి

బిట్రగుంట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కరోనా సమయంలో నిలిపివేసిన గుంటూరు-తిరుపతి మెమో రైళ్లను ప్రయాణికుల సౌకర్యార్థం తిరిగి పునరుద్ధరించాలని, కనీసం తిరుపతి-బిట్రగుంట వరకైనా నడపాలని బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు షేక్‌నూరుద్దీన్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ఇబ్రహీంపేటలో విలేకర్లతో మాట్లాడుతు గుంటూరు- తిరుపతి రైలును నంద్యాల, కడప స్టేషన్ల మీదుగా నడుపుతున్నారన్నారు. బిట్రగుంట పరిసర ప్రాంతాల సామాన్య ప్రజలు గూడూరు, వెంకటగిరి, శ్రీకాళహస్తి, రేణిగుంట, తిరుపతికి వెళ్లాలంటే రైళ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సింహపురి ఎక్స్‌ప్రెస్ రైలు వేళలు మార్చేందుకు కృషి చేసిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు దాసరి సునీల్, బత్తుల రవిచంద్ర, ఫ్రాన్సిస్, ఆరోగ్యదాస్, అహ్మద్‌బాషా, చిట్టేటి శివకుమార్ పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం తగదు

కావలి రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎమ్పీడీవో శ్రీదేవి హెచ్చరించారు. కావలి మండలం సర్వాయపాలెం సచివాలయాన్ని శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది సకాలంలో హాజరు నమోదు ఉండాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, వాటర్ ట్యాంకులను క్లోరినేషన్ చెయ్యాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామక్రిష్ణ, వీఆర్వో హరీష్, ఏఎన్ఎం, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ ధ్యేయం

వలేటివారిపాలెం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వం ప్రధాన ధ్యేయం అని మండల టీడీపీ అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం తెలిపారు. మండలంలోని చుండి, అంకభూపాలపురం, కళవళ, పోలినేనిపాలెం గ్రామాల్లో శుక్రవారం ఆయన గ్రామ టీడీపీ నాయకులతో కలిసి సిమెంటు రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు అనుమోల అమరేశ్వరి ఇరపని సతీష్, టీడీపీ నాయకులు కామినేని అశోక్, కామినేని వీరయ్య, చొప్పర చినబ్రహ్మయ్య, మేకల అశోక్, ప్రెగడ శ్రీనివాసులు, పంది లక్ష్మీనారాయణ, బక్కమంతుల మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

జస్టిస్ లక్ష్మణరావుకు ఘన నివాళి

కావలిటౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రాష్ట్రం రెడ్‌క్రాస్ పూర్వపు అధ్యక్షుడు జస్టిస్ లక్ష్మణరావు గురువారం మృతి చెందడంతో శుక్రవారం స్థానిక రెడ్‌క్రాస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ రవిప్రకాష్, రెడ్‌క్రాస్ బాధ్యులు కలికి శ్రీహరి రెడ్డి, హరినారపరెడ్డి, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

డిస్లెక్సీయపై అవగాహన ర్యాలీ

సీతారామపురం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక భవిత కేంద్రంలో శుక్రవారం డిస్లెక్సీయపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా భవిత కేంద్రం నుండి విద్యార్థినీ, విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మస్తాన్‌వలి మాట్లాడుతూ డిస్లెక్సీయ అనేది ఒక రకమైన అభ్యాస వైకల్యం అని, అభ్యాస వైకల్యం ఉన్న వ్యక్తి పదాలు, సంఖ్యల ఉచ్చారణలో, అర్థం చేసుకోవడంలోనూ ఇబ్బంది పడుతుంటారన్నారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, బెస్తకాలనీ ఎంపిపి స్కూల్ ప్రధానోపాధ్యాయులు తిరుపతయ్య, ఐఈడిఎస్ఎస్ అన్సార్ బాష, ఐఈఆర్‌టి విజయ్, ఉపాధ్యాయులు వెంగయ్య, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఒరిగిన స్తంభాలను సరిచేసిన విద్యుత్ సిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వలేటివారిపాలెం (ఆంధ్ర జ్యోతి): మండలంలోని కూని పాలెంలో ప్రధాన రహదారి పక్కన ఒరిగిపోయిన నాలుగు విద్యుత్ స్తంభాలను విద్యుత్ ఏఈ తాటికొండ మధుబాబు ఆధ్వర్యంలో సిబ్బంది శుక్రవారం నిటారుగా నిలబెట్టారు. ఒరిగిన విద్యుత్ స్తంభాలు అని ఆంధ్రజ్యోతిలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి విద్యుత్ అధికారులు స్పందించి ఒరిగిపోయిన విద్యుత్ స్తంభాలను సరిచేసి నిటారుగా నిలబెట్టారు. దీంతో ఏళ్లతరబడి పరిష్కారం కాని సమస్య ఆంధ్రజ్యోతి కథనంతో పరిష్కార మయిందని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


ఒరిగిపోయిన స్తంభాలను నిలబెడుతున్న విద్యుత్ సిబ్బంది

వెలుగొండ పూర్తిచేసి వలసలు నివారించాలి

ఉదయగిరి రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రానున్న బడ్జెట్ సమావేశాల్లో వెలుగొండ ప్రాజెక్టుకు నిధులు కేటాయించి పనులు పూర్తి చేసి వలసలు నివారించాలని వెలుగొండ సాధన సమితి నాయకుడు డాక్టర్ శ్యాంప్రసాద్, సాగునీటి రంగ నిపుణుడు నారాయణరెడ్డి కోరారు. శుక్రవారం స్థానిక కోట్నీస్ ప్రజా వైద్యశాల ఆవరణలో వెలుగొండ సాధన సమితి ప్రజా సంఘాలు, జిల్లా సాధన సమితి నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు విలేఖరులతో మాట్లాడుతూ జిల్లాలోని మెట్ట ప్రాంతాలకు సాగు, తాగునీరు అందించే ఏకైక వనరు వెలుగొండ ప్రాజెక్టు అన్నారు. అయితే పాలకుల నిర్లక్ష్యం కారణంగా ప్రాజెక్టు పనులు మందకొడిగా సాగుతున్నాయన్నారు. బడ్జెట్ సమావేశాల్లో వెలుగొండ ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలని, లేదంటే సాధన సమితి ఆధ్వర్యంలో ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రాజెక్టు పూర్తయితే మూడు జిల్లాల్లో తాగునీటి కష్టాలు తీరడంతో పాటు ఫ్లోరైడ్ సమస్య తీరుతుందన్నారు. పార్టీలకతీతంగా వెలుగొండ ప్రాజెక్టు పూర్తికోసం ఉద్యమించి ప్రభుత్వంపై వత్తిడి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాధన సమితి నాయకులు దస్తగిరిఅహ్మద్, గాజులపల్లి రామిరెడ్డి, రైతు సంఘం నాయకుడు కాకు వెంకటయ్య, ఫర్స్ డైరెక్టర్ పీవీ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మద్యం దుకాణాలు సీజ్

కావలి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ మద్యం దుకాణాల పాలసీని అమల్లోకి రావడంతో ప్రభుత్వ మద్యం దుకాణాలను సీజ్ చేశారు. కావలి సర్కిల్ పరిధిలో 16 ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉండగా వాటిని రెవెన్యూ అధికారులతో కలిసి ఎక్సైజ్ అధికారులు తనిఖీలు చేసి ప్రతి దుకాణంలో ఉన్న మద్యం నిల్వలను, ఫ్రిజ్ తదితర సామగ్రిని రికార్డుల్లో నమోదు చేసి సీజ్ చేశారు. దుకాణాల తాళాలను కావలి ఎక్సైజ్ సీఐ సుంకర శ్రీనివాసులు తమ వద్ద ఉంచుకున్నారు. అయితే ఆయా దుకాణాల్లో ఉన్న మద్యం నిల్వలతో పాటు అక్కడ ఉన్న సామగ్రిని నెల్లూరు డిపోకు చేర్చమని అధికారులు ఆదేశాలు ఇచ్చారు. అక్కడ ఉన్న సామగ్రి విలువల కన్నా వాటిని నెల్లూరుకు చేర్చేందుకు అయ్యే రవాణా ఖర్చులు అధికంగా కనిపిస్తున్నాయని చెబుతున్నారు. దీంతో రవాణా ఖర్చులపై ఎక్సైజ్ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు.

అదుపుతప్పి ఆటో బోల్తా - ఒకరి మృతి

కందుకూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అదుపుతప్పి ఆటో బోల్తాపడడంతో ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన దొండపాడు వద్ద శుక్రవారం జరిగింది. కందుకూరు రూరల్ ఎస్సై మహేంద్ర నాయక్ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని పాలురు గ్రామం నుంచి కందుకూరుకు వెళుతున్న ఆటో దొండపాడు వద్ద అదుపుతప్పి బోల్తాపడింది. ఈ సంఘటనలో ఆటోలో ఉన్న మార్త్రాటి లక్ష్మయ్య(60) అక్కడిక్కడే మృతిచెందాడు. అతనితోపాటు మరో ముగ్గురు మహిళలకు స్వల్ప గాయాలు అయ్యాయి. లక్ష్మయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కందుకూరు ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు

ఉదయగిరి రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పంటల సాగులో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడులు సాధించేలా గ్రామ వ్యవసాయ సహాయకులు చర్యలు చేపట్టాలని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ లక్ష్మీమాధురి, కృషివిజ్ఞాన్ కేంద్రం శాస్త్రవేత్త విజయకుమార్‌నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక స్త్రీశక్తి భవనంలోని సబ్ డివిజన్‌లో వ్యవసాయ సహాయకులకు సామర్థ్య పెంపుపై ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ పంటల సాగులో మేలైన వంగడాలు ఎంచుకోవడంతో పాటు విత్తనశుద్ధి తప్పనిసరిగా చేయించాలన్నారు. రసాయనిక ఎరువులు తగ్గించి సేంద్రీయ ఎరువులు వాడేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ పీ.చెన్నారెడ్డి, వ్యవసాయాధికారులు వెంకటసుబ్బారెడ్డి, చక్రవర్తి, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏడీఏ లక్ష్మీమాధురి

రాయితీపై వరి విత్తనాల పంపిణీ


జలదంకి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జలదంకి రైతుసేవాకేంద్రంలో శుక్రవారం రైతులకు రాయితీపై వరి విత్తనాలు పంపిణీ చేశారు. కేఎన్ఎం-1638 రకం విత్తనాలు 30 కిలోలు రూ.1065లకు అందించామని ఏవో బీ శైలజ పేర్కొన్నారు. రాయితీపై విత్తనాలు కావాలంటే స్థానిక రైతుసేవాకేంద్రాల్లో వీఏఏలను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏ శివప్రియ, టీడీపీ మండల అధ్యక్షుడు పి.మధురెడ్డి, జలదంకి ఉపసర్పంచు కె.మాలకొండారెడ్డి, పాల్గొన్నారు.

● సంగం : మండలంలోని రైతు సేవాకేంద్రాల్లో బీపీటీ -5204, కెఎన్ఎం -1638 రకం వరి విత్తనాలు కేజీకి రూ. 5 చొప్పున రాయితీపై ఇస్తున్నామని వ్యవసాయాధికారి శ్రీహరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అవసరమైన రైతులు తీసుకెళ్లవచ్చునని తెలిపారు.

● కలిగిరి: రైతులకు శనివారం నుంచి రాయితీపై వరి, శనగ విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయాధికారి ఎం సురేష్‌బాబు తెలిపారు. వరి రకం కెఎ న్ఎం-16380, శనగ రకం జెజీ-11, కేఎకె2, వితనాలు 25శాతం రాయితీతో అందజేస్తామని తెలిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

వరికుంటపాడు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): దుకాణదారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారాలు సాగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని డివిజనల్ ఫుడ్ కంట్రోల్ అసిస్టెంట్ అధికారి నీరజ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన వరికుంటపాడులోని పలు దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనుమతులు లేని దుకాణాలకు నోటీసులు అందజేయడం జరిగిందన్నారు. కొనుగోలుదారులు తప్పనిసరిగా వస్తువులపై తయారీ, గడువు తేదీలను గమనించాలన్నారు. దుకాణదారులు సైతం అలాంటి ప్రమాణాలు కలిగిన వస్తువులను మాత్రమే విక్రయించాలని సూచించారు. కాగా, సమాచారం అందుకున్న కొంతమంది దుకాణదారులు హడావిడిగా తమ దుకాణాలకు తలుపులు వేసి అక్కడి నుంచి జారుకోవడం గమనార్హం.


తనిఖీలు చేపడుతున్న నీరజ

దివీస్ ల్యాబ్‌కు 20 మంది విద్యార్థులు ఎంపిక

కందుకూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం కాలేజీలో దివీస్ ల్యాబ్ శుక్రవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి ప్రాంగణ ఎంపికల్లో 20 మంది విద్యార్థులు ఉద్యోగ అర్హత సాధించినట్లు కరస్పాండెంట్ కంచర్ల రామయ్య, టెక్నికల్ డైరెక్టర్ డాక్టర్ కే విజయ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. వీరికి వార్షిక వేతనం రూ.3 లక్షలు ఉంటుందని కంపెనీ ప్రతినిధి హెచ్ఆర్ రామకృష్ణ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఆర్ నవీన్, ఆర్అండ్‌డీ డీన్ డాక్టర్ ఎం లక్ష్మణరావు, మెకానికల్ హెచ్ఓడీ డాక్టర్ పున్నారావు, కోటయ్యలు పాల్గొన్నారు.